www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 25-8-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 170 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: విదియ మ.12:35 తదుపరి తదియ, నక్షత్రం: ఉత్తర తె.3:50 తదుపరి హస్త, వర్జ్యం: ఉ.9:49-11:32, దుర్ముహూర్తం: మ.12:42-1:31, మ.3:11-4:01, అమృతఘడియలు: రా.8:06-9:49, రాహుకాలం: ఉ.7:30-9:00, సూర్యోదయం: 6:03, సూర్యాస్తమయం: 6:30 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అండాల కోసం అడ్డదారిలో..

- సంతాన అవసరార్థులు వేలల్లో.. దాతలు పదుల్లో!
- ఈ పరిస్థితులే దళారుల పాలిట వరాలు
- దంపతుల అవసరాలతో వ్యాపారాలు
- ఒక్కో అండానికి రూ. 25 వేల నుంచి రూ.30 వేలు
- 15-20 శాతం మందిలో అండాలే ఉండట్లేదు
- ఇతరులపైనే ఆధారపడాల్సి వస్తోంది: వైద్యులు
- ఎగ్‌ఫ్రీజ్ చేసుకుంటున్న ప్రముఖులు, ఐటీ ఉద్యోగులు



హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆలస్యంగా వివాహాలు జరగడం.. కాలుష్యం.. జీవనశైలిలో మార్పులు.. రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ వంటి రుగ్మతలు.. పని ఒత్తిడి.. కారణాలేమైనా.. ఇవన్నీ ఇప్పుడు సంతానసాఫల్యానికి అడ్డంకిగా మారుతున్నాయి. పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, కదలికల్లో వేగం లేకపోవడాన్ని పక్కనపెడితే..

మిగతా 12వ పేజీలో...

బడులకు మళ్లీ కళ!

కొత్త టీచర్లతో పాఠశాలలకు మహర్దశ

- మెగా డీఎస్సీతో 16,347 మంది కొత్త ఉపాధ్యాయులు
- మోడల్ ప్రైమరీ స్కూళ్లతో నూతన అధ్యాయం
- ప్రాథమిక బడిలో ప్రతి తరగతికీ ఒక టీచర్
- టీచర్లపై పనిభారం తగ్గింపు
- తొమ్మిది రకాల పాఠశాలల విధానం
- పాఠశాల విద్యలో కీలక సంస్కరణలు



తిరోగమనం దిశగా సాగుతున్న ప్రభుత్వ విద్యకు కూటమి ప్రభుత్వం కొత్త ఉత్సాహం తీసుకొచ్చింది. పిల్లలు వెళ్లిపోతున్నారు..... ఉన్న టీచర్లే ఎక్కువైపోయారని గత వైసీపీ ప్రభుత్వం తేల్చగా...పాఠశాలలను పునర్వ్యవస్థీకరించి 16,347 పోస్టులతో చంద్రబాబు ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించింది. ఈ టీచర్లు ఒకటి, రెండు వారాల్లో పాఠశాలల్లో అడుగుపెట్టబోతున్నారు. కొత్త సార్లతో ప్రభుత్వ పాఠశాలలు నిండుగా మళ్లీ కళకళలాడనున్నాయి.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా మారింది. ప్రతి సంవత్సరం విద్యార్థులు తగ్గిపోతున్నారు. 2021-22లో 44లక్షల మంది విద్యార్థులుంటే 2024-25 నాటికి ఆ సంఖ్య 34.5 లక్షలకు పడిపోయింది. విద్యార్థుల సంఖ్య పడిపోవడంతో కొత్త టీచర్ల అవసరమే లేదని, ఉన్న టీచర్లే మిగిలిపోయారని గత జగన్ ప్రభుత్వం తేల్చింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు మళ్లీ పుంజుకోవడం కష్టమేనని భావించిన సమయంలో కూటమి ప్రభుత్వం వినూత్న విధానాలు ప్రవేశపెట్టింది. ముఖ్యంగా కునారిల్లుతున్న ప్రాథమిక విద్యను తిరిగి గాడిలో పెట్టేందుకు మోడల్ ప్రైమరీ స్కూళ్లు అనే కొత్త విధానం తీసుకొచ్చింది. గతేడాది వరకూ రాష్ట్రంలో ఒకరిద్దరు టీచర్లతోనే నెట్టుకొస్తున్న

మిగతా 12వ పేజీలో...

అభివృద్ధిలో ఎంత తేడా!

నాడు : గత జగన్ ప్రభుత్వం అప్పులు చేసింది. కానీ ఒక్క రోడ్డు కూడా వేయలేదు. కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేదు. రాజధాని అమరావతిని అటకెక్కించింది. పోలవరం ప్రాజెక్టును గాలికొదిలేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే.. గత ఐదేళ్లలో అభివృద్ధి అన్న మాటనే పక్కన పెట్టేసింది. మరి తెచ్చిన ఆ అప్పులను జగన్ ఏం చేశారో ఎవరికీ తెలియదు.

నేడు : ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం కూడా అప్పులు చేస్తోంది. అయితే రోడ్లకు మరమ్మతులు చేయించడంతో పాటు రోడ్లు వేయించింది. అమరావతి నిర్మాణ పనులు కళ్లెదురుగా కనిపిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇంకా ఎన్నో ప్రాజెక్టులు చేపడుతున్నారు. నేడు అభివృద్ధి పరుగులు పెడుతోంది.

అభివృద్ధి విషయంలో బోత్ ఆర్ నాట్ సేమ్

సంక్షేమంలో రెట్టింపు

నాడు : గత ఐదేళ్లలో జగన్ ఆర్భాటంగా బటన్ నొక్కి పలు సంక్షేమ పథకాలు అమలు చేసినా.. కొన్ని హామీల విషయంలో మాట తప్పారు. మరెన్నో హామీలను విస్మరించారు.

నేడు : ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గతంలో కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ఎన్నికల హామీలను దాదాపుగా నెరవేర్చింది.

అప్పుల విషయంలో బోత్ ఆర్ నాట్ సేమ్



నాడు అరాచకం నేడు అభివృద్ధి

- గతంలో అడ్డగోలుగా లక్షల కోట్ల అప్పులు
- అయినా అమరావతి, పోలవరం పడక
- రోడ్లపై గుంతలు కూడా పూడ్చని వైనం
- బటన్ నొక్కినా సంక్షేమ పథకాల్లో కోత
- ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు లేవాయె
- అప్పులు మినహా అభివృద్ధి జాడే లేదు
- నేడు రెట్టింపు సంక్షేమం అమలు
- పట్టాలెక్కిన పోలవరం, అమరావతి
- ఠంఛనుగా జీతాలు.. రోడ్లకు మహర్దశ
- అభివృద్ధి, సంక్షేమంతో బాబు పరుగులు
- వాస్తవాలు దాచి జగన్, రోతపత్రిక అక్కసు

అప్పుల్లో జగన్‌కు, చంద్రబాబుకు ఇదే తేడా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన జరిగాక ఆంధ్రప్రదేశ్ వాటాగా లక్ష కోట్ల అప్పులు వచ్చాయి. అంటే.. లోటు బడ్జెట్‌తో విభజిత ఆంధ్రప్రదేశ్ ప్రయాణం మొదలైంది. అభివృద్ధి, సంక్షేమం అమలు చేయాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి. నాడు జగన్ సర్కారుకు అయినా, నేడు చంద్రబాబు ప్రభుత్వానికి అయినా ఇది తప్పదు. అయితే నాడు అడ్డగోలుగా లక్షల కోట్లు అప్పులు చేసి, అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన జగన్.. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం భారీగా అప్పులు చేస్తోందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని విమర్శలు చేశారు. ఆయన రోత పత్రిక పెద్ద కథనం రాసింది. కానీ అప్పులు చేయడంలోనూ.. అభివృద్ధి, సంక్షేమంలోనూ

మిగతా 11వ పేజీలో...

కలెక్టర్లకు మరింత పవర్!

- భూ కేటాయింపుల్లో మరింత అధికారం
- విస్తీర్ణం, ధర నిర్ణయంలో కీలక పాత్ర
- ప్రభుత్వ సంస్థలకు 15 ఎకరాల వరకు కేటాయించే వెసులుబాటు
- అధికారాలు పెంచనున్న రెవెన్యూ శాఖ
- జిల్లాల్లో అభివృద్ధే లక్ష్యంగా నిర్ణయాలు
- త్వరలో సర్కారుకు ప్రతిపాదనలు

జిల్లాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం.. ఈ క్రమంలో జిల్లా పాలనాధికారులుగా ఉన్న కలెక్టర్లకు మరిన్ని అధికారాలు ఇవ్వాలని భావిస్తోంది. ప్రభుత్వ సంస్థలకు, విభాగాలకు, ప్రైవేటు సంస్థలకు కూడా 10-15 ఎకరాల మేరకు భూములు కేటాయించే అధికారాన్ని కలెక్టర్లకే ఇవ్వనుంది. తద్వారా ప్రాజెక్టులు, పనులు కూడా సత్వరమే సాకారం అవుతాయని, ఫలితంగా జిల్లాలు వడివడిగా అభివృద్ధి పథంలో పరుగులు పెడతాయని భావిస్తోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జిల్లాల అభివృద్ధిలో కలెక్టర్లది కీలక పాత్ర. అన్ని శాఖలపైనా వారికి పట్టు ఉంటుంది. కానీ, అధికారాలు మాత్రం కొన్నే ఉంటాయి. కీలకమైన అంశాల్లో చాలా పరిమితమైన అధికారాలే ఇచ్చారు. దీంతో ఇప్పటికీ పలు విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వ విభాగాధిపతులు, కార్యదర్శుల స్థాయి నిర్ణయాల కోసం కలెక్టర్లు ఎదురు చూస్తున్నారు. తహసీల్దార్ స్థాయిలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్న కొన్ని అంశాలు రాష్ట్ర స్థాయిలో కేంద్రీకృతమయ్యాయి. దీంతో కొన్ని ముఖ్యమైన అంశాల్లో జిల్లా కలెక్టర్ కూడా

మిగతా 11వ పేజీలో...



ఎగిరి వెళ్లే శవపేటికలు

- శత్రువులపై ఆత్మాహుతి దాడులకు మిగ్-21 విమానాలు
- డీకమిషన్ చేస్తున్న మిగ్-21లను కమికాజ్ డ్రోన్లుగా మార్చే యోచన?
- టార్గెట్ డ్రోన్లుగా.. శత్రు రేడార్లను మభ్యపెట్టే విమానాలుగా వాడకం!
- గూఢచర్యానికి ఉపయోగించే ప్రతిపాదనలపై విస్తృత చర్చ

అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పరీక్ష విజయవంతం

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన ఐఏడీడబ్ల్యూఎస్

2

ఎయిర్ డ్రాప్ పరీక్ష సక్సెస్

'గగన్‌యాన్'లో మరో ముందడుగు



2

భారత్‌కు రండి

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ప్రధాని మోదీ ఆహ్వానం
- తేదీ ఖరారు కాలేదన్న రాయబారి

మొదటిసారి రుణం తీసుకునేవారికి

కనీస సిబిల్ స్కోర్ అక్కర్లేదు

రుణ దరఖాస్తులకు కనీస క్రెడిట్ స్కోర్‌ను అర్హతగా సూచించలేదు

కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి

2

సురవరానికి తుది వీడ్కోలు

- చంద్రబాబు, రేవంత్, వెంకయ్య సహా ప్రముఖుల నివాళి
- అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర.. గాంధీ వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత
- సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు: సీఎం చంద్రబాబు

11



హైదరాబాద్‌లో సురవరం భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, పార్టీ నేతలు కూనంనేని, నారాయణ తదితరులు

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి!

- ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై నిఘా పెట్టండి
- యూరియా నిల్వలను తనిఖీ చేయండి
- పక్కదారి పట్టిస్తే లైసెన్సులు రద్దు చేయండి
- ధర పెంచి అమ్మితే కేసులు పెట్టండి
- అంతిమంగా ఏ రైతుకూ ఇబ్బంది రాకూడదు
- లభ్యత, సరఫరాలో తేడా రాకూడదు: సీఎం

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యూరియా సరఫరాపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయశాఖ అధికారులకు నిర్దేశించారు. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలని, అదే సమయంలో ఎవరైనా ఫేక్ ప్రచారాలు చేస్తుంటే.. అలాంటి వారిని గుర్తించి, తగిన సమాధానం చెప్పాలని సూచించారు. అంతిమంగా

మిగతా 11వ పేజీలో...

గోదారి మళ్లించాలి!

ఏటా గోదావరి వరద నీరు వృథా
వేల టీఎంసీలు సముద్రంలోకి



బ్యారేజీ వద్ద వరద ఉధృతిని తెలిపే స్కేల్

- ఈ ఏడాది 1400 టీఎంసీలు
- గత నాలుగేళ్లలో 15,680 టీఎంసీల వృథా
- పోలవరం సామర్థ్యం 190 టీఎంసీలు
- ప్రాజెక్టు పూర్తయినా ఇంకా మిగులే
- సద్వినియోగం చేసుకుంటే ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదంటున్న నిపుణులు
- 1986లో అతి భారీ వరద
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 35,06,380 క్యూసెక్కులు సముద్రంలోకి
- ఒక్క రోజే 302 టీఎంసీలు వృథా

12

విశాఖలో ప్రకృతి వైద్య కళాశాల

- రూ.4.08 కోట్లతో నిర్మాణానికి అనుమతి
- 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు
- 50 పడకలతో ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రికి 14.85 కోట్లు
- 6 కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లు
- ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద, హోమియో, యునాని, ప్రకృతి వైద్యం వంటి సేవలను ప్రజలకు మరింత చేరువచేసే లక్ష్యంతో కొత్త ఆస్పత్రుల ఏర్పాటు చర్యలను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసిందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ చర్యల్లో భాగంగా తొలి ప్రకృతి వైద్య కళాశాల విశాఖపట్నంలో ఏర్పాటు కానుందని ఆదివారం ఒక

మిగతా 12వ పేజీలో...



గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేపై త్వరలో సీఎంల భేటీ!

- 'హైదరాబాద్-అమరావతి' రహదారి ఎంట్రీ పాయింట్లపై తుది నిర్ణయం
- 3 ప్రతిపాదనలతో ప్రాథమిక రూట్‌మ్యాప్!
- వాటిని బాబు-రేవంత్ ఒకే చేస్తే కేంద్రానికి

12

అంతరిక్షంలోకి వెళ్తాననుకోలేదు

» చిన్నప్పుడు చాలా బిడియస్థుడిని: శుభాన్షు శుక్లా

» గగన్‌యాన్ యాత్రికులకు రాజ్‌నాథ్ సన్మానం



న్యూఢిల్లీ, ఆగస్టు 24: బాల్యంలో తాను చాలా బిడియస్థుడినని, ఎవరితోనూ కలిసేవాడిని కాదని భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా తెలిపారు. అంతరిక్షంలోకి వెళ్తానని కలలో కూడా అనుకోలేదని చెప్పారు. ఆదివారం భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నతనంలో రాకేశ్‌శర్మ అంతరిక్ష ప్రయాణానికి సంబంధించిన కథలు వింటూ పెరిగానని గుర్తుచేసుకున్నారు. అయితే అప్పట్లో నింగిలోకి వెళ్లాలనే ఆలోచన లేదన్నారు. మరోవైపు, గగన్‌యాన్ వ్యోమగాములు శుభాన్షు శుక్లా, పి.వి. నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సన్మానించారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ఆకాంక్షలకు ప్రతీకలుగా నిలిచిన వీరు మన దేశానికి గర్వకారణమని ప్రశంసించారు. "నాది లఖ్‌నవూ పార్లమెంట్ నియోజకవర్గం. శుభాన్షు శుక్లా అక్కడివాడే. అతను కూడా మా ఓటరు" అని రాజ్‌నాథ్ అన్నారు.

అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 24: భారత రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన అత్యాధునిక సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ (ఐఏడీడబ్ల్యూఎ)ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. శనివారం అర్ధరాత్రి 12:30 గంటలకు ఒడిశా తీరంలోని దీన్ని పరీక్షించినట్టు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'ఐఏడీడబ్ల్యూఎస్ (ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్) అనేది డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ. దీనిలో స్వదేశీయంగా అభివృద్ధి చేసిన క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (క్యూఆర్ఎస్ఏఎం), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వీఎస్‌హెచ్‌వోఆర్ఏడీఎస్) మిస్సైల్స్, హైపవర్ లేజర్-బేస్డ్ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ) ఉన్నాయి' అని రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా, సముద్ర తీరప్రాంత గస్తీని బలోపేతం చేసుకోవడంపై భారత నేవీ దృష్టి పెట్టింది. దీనికోసం 76 నావల్ యుటిలిటీ హెలికాప్టర్లు (ఎన్‌హెచ్‌యూ) కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 'సమాచారం కోసం అభ్యర్థన' (రిక్వెస్ట్ ఫర్ ఇన్ఫర్మేషన్)ను జారీ చేసింది. నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచిన వివరాల ప్రకారం ఈ 76 హెలికాప్టర్లలో 51 నావికా దళానికి, మిగిలిన 25 హెలికాప్టర్లను కోస్ట్‌గార్డ్‌కు కేటాయించనున్నారు.

వినియోగదారుల ఫోరమ్‌ల అధికారాల పునరుద్ధరణ

» అన్ని రకాల ఆదేశాలను అమలు చేసేలా సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ, ఆగస్టు 24: వినియోగదారుల ఫోరమ్‌ల అధికారాలను పునరుద్ధరిస్తూ సుప్రీంకోర్టు తాజాగా కీలక తీర్పు వెలువరించింది. వాటి అన్ని తుది, మధ్యంతర ఆదేశాలను సివిల్ కోర్టు డిక్రీలుగా పరిగణిస్తూ అమలు చేసే అధికారాన్ని కల్పిస్తూ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రాజేశ్ బిందాల్ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిర్ణయం వేలాది మంది వినియోగదారులకు అనుకూలమైన తీర్పులు వచ్చినప్పటికీ.. నిజమైన ఉపశమనం లభించని దాదాపు 18 ఏళ్ల చట్టపరమైన లొసుగుకు ముగింపు పలికింది. 'ప్రతి ఆర్డర్' అనే పదం స్థానంలో 'మధ్యంతర ఆర్డర్' అని మారుస్తూ వినియోగదారుల పరిరక్షణ చట్టానికి (సీపీఏ) 2002లో చేసిన సవరణ.. ఫోరమ్‌ల అధికారాలను నీరుగార్చిందని ధర్మాసనం అభిప్రాయపడింది. వాటి సొంత తుది తీర్పులను కూడా అమలు చేయకుండా నిరోధించిందని పేర్కొంది. 1986 చట్టంలోని సెక్షన్ 25 'ఏ ఆదేశాన్ని' అయినా అమలు చేసే అధికారాన్ని ఫోరమ్‌లకు కల్పిస్తుందని పేర్కొంది.

జెలెన్‌స్కీని భారత్‌కు ఆహ్వానించిన మోదీ

» తేదీ ఇంకా నిర్ణయం కాలేదన్న రాయబారి

న్యూఢిల్లీ, ఆగస్టు 24: భారతదేశానికి రావాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ప్రధాని మోదీ ఆహ్వానించారు. భారత్‌లో ఉక్రెయిన్ రాయబారి అలెగ్జాండర్ పొలిష్చుక్ తాజాగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఉక్రెయిన్ జాతీయ పతాక దినోత్సవం సందర్భంగా శనివారం ఢిల్లీలో ఒక ఆంగ్ల వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ జెలెన్‌స్కీ రాక కోసం ఇరుదేశాల అధికారులు పనిచేస్తున్నారని చెప్పారు. 'జెలెన్‌స్కీ భారత్‌కు వస్తారని మేం ఆశిస్తున్నాం. మన ద్వైపాక్షిక సంబంధాల్లో ఇదొక గొప్ప కార్యం కానుంది. తగిన తేదీకి అంగీకరించేందుకు మేం ప్రయత్నిస్తున్నాం' అన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడంలో భారత్ మరింత క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. రష్యాతో భారత్‌కు ఉన్న సుదీర్ఘ సంబంధాల దృష్ట్యా.. శాంతి చర్చల్లో భారత్‌ను కీలక పాత్రధారిగా తాము భావిస్తున్నామన్నారు. శాంతి, కాల్పుల విరమణను సమర్థిస్తున్న మోదీని ఆయన ప్రశంసించారు. భారత్ తటస్థమైనది కాదని, శాంతి, దౌత్యం, రాజకీయ చర్చలను అది దృఢంగా సమర్థిస్తోందని అన్నారు.

'సర్' తర్వాతా పాక్ మహిళలకు బిహార్‌లో ఓటు

భగల్పూర్, ఆగస్టు 24: బిహార్ ఓటరు జాబితాపై ఏదో ఒక వివాదం వెలుగు చూస్తోంది. తాజాగా బిహార్‌లోని భగల్పూర్‌లో ఇద్దరు పాక్ వృద్ధ మహిళలకు ఓటరు కార్డు జారీచేయడం కేంద్ర ప్రభుత్వాన్నే నివ్వెరపరచింది. ఆ ఇద్దరి ఓటరు కార్డులను వెంటనే రద్దుచేయించి, సమగ్ర విచారణ జరపాలని భగల్పూర్ కలెక్టరు, ఎస్పీలను కేంద్ర హోంశాఖ తాజాగా ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. ఇమ్రానా, ఫిరదౌసియా అనే ఇద్దరు పాక్ మహిళలు 1956లో విజిటర్ వీసాపై భారత్‌కు వచ్చి తిరిగి వెళ్లలేదు. ప్రస్తుతం వీరు భగల్పూర్‌లోని ఇషాక్‌చక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భికన్‌పూర్ గుమ్టి నం. 3లోని ట్యాంక్ లేన్‌లో నివాసం ఉంటున్నారు. ఇమ్రానా 3నెలల కోసం, ఫిరదౌసియా మూడేళ్ల కోసం ఈ వీసా తీసుకున్నారు. అయితే, ఇటీవల నిర్వహించిన సమగ్ర ఓటరు సవరణ(ఎస్ఐఆర్) తర్వాత కూడా వీరి ఓట్లను ఈసీ తీసివేయలేకపోవడం గమనార్హం.

ఓట్ల తారుమారుకు మోదీ యత్నం: రాహుల్

అరారియా, ఆగస్టు 24: ఓటర్ల జాబితాలను తారుమారు చేసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్లో జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా పేదల ఓట్లు దొంగిలించాలని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. చిన్న పిల్లలు సైతం 'ఓట్ల దొంగా.. గద్దె దిగు' అంటున్నారని.. ఈసీ వారితో మాట్లాడాలని సూచించారు. ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర' ఆదివారం అరారియా చేరుకుంది.ఓటర్ అధికార యాత్ర సందర్భంగా రాహుల్, తేజస్వి బుల్లెట్‌పై కాసేపు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి భద్రతావలయాన్ని ఛేదించుకుని వచ్చి రాహుల్ ఎడమ భుజంపై ముద్దుపెట్టాడు. వెంటనే భద్రతాసిబ్బంది అతడిని కొట్టి సెక్యూరిటీ జోన్‌కు దూరంగా తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఇదిలా ఉండగా, బిహార్లో ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా చేపట్టిన ఓటర్ల డాక్యుమెంట్ల తనిఖీ ముమ్మరంగా సాగుతోందని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఇప్పటివరకు 98.2 శాతం మంది డాక్యుమెంట్లు సమర్పించారని తెలిపింది. ధ్రువపత్రాలకు ఇంకా 8రోజుల సమయం మాత్రమే ఉందని పేర్కొంది.

ఆ కోర్సులు ఆన్‌లైన్, దూరవిద్య విధానాల్లో వద్దు

» హెల్త్‌కేర్, సైకాలజీ, న్యూట్రిషన్ కోర్సులపై యూజీసీ ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 24: ఈ విద్యా సంవత్సరం నుంచి హెల్త్‌కేర్, దాని అనుబంధ కోర్సులను(సైకాలజీ, న్యూట్రిషన్ సహా) ఓపెన్, దూరవిద్య, ఆన్‌లైన్ విధానాల్లో ఆఫర్ చేయవద్దని యూజీసీ అన్ని ఉన్నత విద్యా సంస్థలను ఆదేశించింది. 'నేషనల్ కమిషన్ ఫర్ అలీడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్'(ఎన్‌సీఏహెచ్‌పీ) చట్టం, 2021 కింద ఆఫర్ చేసే సైకాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, బయో టెక్నాలజీ, క్లినికల్ న్యూట్రిషన్, డైటెటిక్స్ వంటి కోర్సులకు కూడా ఈ నిషేధం వర్తిస్తుంది. ఒకవేళ ఏదైనా విద్యాసంస్థకు ఇప్పటికే ఈ కోర్సులకు అనుమతి మంజూరు చేసినా దాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి ప్రకటించారు. అందువల్ల ఏ విద్యాసంస్థా ఈ కోర్సుల్లో విద్యార్థులను చేర్చుకోవద్దని తెలిపారు.

శత్రువులపై ఆత్మాహుతి దాడులకు..

ఎగిరి వెళ్లే శవపేటికలు

డీకమిషన్ చేస్తున్న మిగ్-21లను కమికాజే డ్రోన్లుగా మార్చే యోచన?



మిగ్ 21 విమానం

న్యూఢిల్లీ, ఆగస్టు 24: భారత వైమానిక దళానికి దాదాపు ఆరు దశాబ్దాలపాటు సేవలందించిన యుద్ధ విమానాలు.. ఎగిరే శవపేటికలుగా పేరొందిన మిగ్ 21లకు ఈ ఏడాది సెప్టెంబరు కల్లా పూర్తిగా సెలవు ప్రకటించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే! వాటి స్థానాన్ని స్వదేశీ తేజస్ ఎల్‌సీఏ మార్క్-1ఏ విమానాలతో భర్తీ చేసేందుకు ఐఏఎఫ్ సిద్ధమైంది. అయితే.. మిగ్-21లకు పూర్తిగా వీడ్కోలు పలకడం వల్ల వాయుసేనకు యుద్ధవిమానాల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో.. డీకమిషన్ చేసిన మిగ్ 21లను ఆత్మాహుతి డ్రోన్లుగా, శత్రు రేడార్లను మభ్యపెట్టే విమానాలుగా.. గూఢచర్యానికి.. ఇలా ఇతరత్రా రకరకాల మార్గాల్లో వినియోగించుకునే ప్రతిపాదనలపై చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.

టార్గెట్ డ్రోన్లు: పైలట్ రహిత మిగ్-21లను ఏరియల్ టార్గెట్లుగా వినియోగించడం. అంటే.. ఎయిర్-టు-ఎయిర్, సర్ఫేస్-టు-ఎయిర్ మిస్సైళ్లను పరీక్షించడానికి హైస్పీడ్ టార్గెట్లు అవసరం అవుతాయి. అలాంటి టార్గెట్లుగా మానవరహిత మిగ్-21లను ఉపయోగించాలనే ప్రతిపాదన ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే.. మన క్షిపణుల సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు ఈ మిగ్-21లు ప్రాక్టీస్‌గా ఉపయోగపడతాయన్నమాట.

కంబాట్ డ్రోన్లు: మిగ్-21 బైసన్‌లను 'కంబాట్ ఎయిర్ టీమింగ్ సిస్టమ్ (క్యాట్స్)' ప్రోగ్రామ్ కింద కంబాట్ డ్రోన్లుగా మార్చడం. ఇవి మానవ రహిత యుద్ధవిమానాలుగా పనిచేస్తాయి. హైరిస్క్ మిషన్స్‌లో వీటిని ముందుగా పంపి.. శత్రు రేడార్లు, క్షిపణి రక్షణ వ్యవస్థలు యాక్టివేట్ అయ్యేలా చేస్తారు. ఆ తర్వాత మన యుద్ధవిమానాలు దాడులు చేసి ఆయా రేడార్లు, క్షిపణి రక్షణ వ్యవస్థలను నాశనం చేస్తాయి. అమెరికా ఇప్పటికే పాత ఎఫ్-16లను క్యూఎఫ్-16టార్గెట్ డ్రోన్లుగా మార్చి వాడుతోంది. చైనా, రష్యా కూడా పాత యుద్ధవిమానాలను ఇదే తరహాలో వినియోగిస్తున్నట్లు సమాచారం.

కమ్యూనికేషన్ రిలే టవర్: శత్రుస్థావరాలు ఉండే ప్రాంతాల్లో సురక్షిత కమ్యూనికేషన్ కోసం.. మిగ్-21లను ఎగిరే సమాచార ప్రసార టవర్లుగా ఉపయోగించుకునే ప్రతిపాదన ఇది

కమికాజే స్ట్రైక్ రోల్: మానవ రహిత మిగ్-21లో భారీగా పేలుడు పదార్థాలు నింపి ఆత్మాహుతి డ్రోన్‌గా మార్చి నేరుగా శత్రులక్ష్యాలపై ప్రయోగించడం. అంటే.. ఈ విధానంలో ప్రయోగించిన విమానం ఇక తిరిగి రాదు. దాడి చేసి పేలిపోతుంది. శత్రువుల రేడార్ కేంద్రాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, రన్‌వేలపై వీటిని ప్రయోగిస్తారు. దీనివల్ల మనం కోల్పోయేది.. కాలంచెల్లిన పాత మిగ్ విమానాలను మాత్రమే.

గూఢచర్యానికి: మిగ్-21లకు అత్యంత అధునాతనమైన సెన్సర్లను అమర్చి అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో గూఢచర్యానికి పంపొచ్చు. పగలు, రాత్రి శత్రువుల కదలికలను గమనించడానికి.. మేఘాలు, పొగమంచు ఉన్నప్పుడు కూడా భూభాగాన్ని మ్యాప్ చేయడానికి, శత్రువుల సమాచారప్రసారాన్ని పసిగట్టడానికి, శత్రువుల ఎలక్ట్రానిక్ వ్యవస్థలు ఎక్కడున్నాయో గుర్తించడానికి ఉపయోగించవచ్చు. ప్రస్తుతం మనం హెరాన్, రుస్తుం-2 వంటి యూఏవీలను గూఢచర్యానికి వాడుతున్నాం. కానీ.. మిగ్-21లు వేగంలో వాటికన్నా చాలా మెరుగైనవి. ఎక్కువ పేలోడ్‌ను మోసుకెళ్లగలవు. స్టెల్త్ సామర్థ్యం లేకపోయినా.. వేగంతో తప్పించుకోగలవు.

అందుకే ఆ పేరు

1963లో తొలిసారి భారత వైమానిక దళం అమ్ములపొదిలో చేరిన మిగ్-21లు దరిమిలా పలు యుద్ధాల్లో సత్తా చాటాయి. ఒక దశలో ఐఏఎఫ్ వద్ద 850కి పైగా మిగ్-21లు ఉన్నాయి. కానీ, ఈ విమానాలు తరచూ కూలిపోవడం వల్ల దాదాపు 200 మంది పైలట్లు చనిపోయారు. పలువురు పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు. భారత వాయుసేన విమానాల్లో అత్యధికంగా కూలిపోయినవి ఇవే అందుకే వీటికి ఎగిరే శవపేటికలనే పేరు వచ్చింది.

నాలుగు ఎఫ్-86లు వర్సెస్ మిగ్-21

మిగ్-21లకు 'ఎగిరే శవపేటికలు', 'విడో మేకర్స్' అనే పేర్లున్నాయిగానీ.. తామెప్పుడూ వాటిని అలా చూడలేదని, వాటి సామర్థ్యం ఏమిటో తమకు తెలుసని ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) పృథ్వీసింగ్ బ్రార్ (86) వంటివారు చెబుతున్నారు. 1971 యుద్ధ సమయంలో పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లపై బాంబుల వర్షం కురిపించడంలో మిగ్-21లదే కీలకపాత్ర అని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో తాను స్వయంగా మిగ్-21లో వెళ్లి పాకిస్థాన్‌లోని రఫికుల్ ఎయిర్‌బేస్‌పై 500 కిలోల బాంబులు రెండింటిని జారవిడిచి.. తిరిగి వస్తుండగా అమెరికాకు చెందిన నాలుగు ఎఫ్-86లు తనను వెంబడించాయని చెప్పారు. "నా మిగ్-21ను పూర్తివేగంతో నడిపాను. దీంతో పాక్ విమానాలు (మిగ్-21 వేగంతో సరితూగలేక) నన్ను వదిలేశాయి" అని ఆయన వివరించారు.

ఎయిర్ డ్రాప్ పరీక్ష విజయవంతం

» గగన్‌యాన్ మిషన్‌లో మరో ముందడుగు



గగన్‌యాన్ క్రూ మాడ్యూల్‌ను మోసుకెళ్తున్న హెలికాప్టర్

సూళ్లూరుపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గగన్‌యాన్ మిషన్‌లో మరో ముందడుగు పడింది. ఈ మిషన్‌లో కీలకమైన క్రూ మాడ్యూల్‌కు సంబంధించిన తొలి ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డ్రాప్ టెస్ట్(ఐఏడీటీ-01)ను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. ప్రయోగంలో భాగంగా గగన్‌యాన్ క్రూ మాడ్యూల్ నమూనాను షార్ నుంచి 35 కిలోమీటర్ల దూరంలో.. భూ ఉపరితలానికి 3 కిలోమీటర్ల ఎత్తులో హెలికాప్టర్ సాయంతో నింగిలోకి తీసుకెళ్లి కిందకు జారవిడిచారు. పారాచూట్ల సాయంతో ఆ మాడ్యూల్ వేగాన్ని తగ్గించుకుంటూ సముద్ర జలాల్లో సురక్షితంగా దిగేలా చేశారు. అనంతరం బంగాళాఖాతంలో పడిన క్రూ మాడ్యూల్‌ను స్వాధీనం చేసుకుని చెన్నై పోర్టుకు తరలించారు. వ్యోమగాములను అంతరిక్షం నుంచి తీసుకొచ్చేందుకు ఈ మాడ్యూల్ ఉపయోగపడుతుంది. మరోవైపు, మానవసహిత అంతరిక్ష మిషన్ల కోసం వ్యోమగాములను సిద్ధం చేసుకోవాలని ఇస్రో భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా వ్యోమగాముల బృందాన్ని ఏర్పాటు చేయాలని, ఇందులో మహిళలు, సాధారణ ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని నిర్ణయించింది.

లోకం తీరు



గల్ఫ్‌లో ఐదుగురు తెలంగాణ ప్రవాసీలకు

రెండేళ్ల జైలు.. దేశ బహిష్కరణ

» 19 మంది ప్రవాస భారతీయులకూ అదే శిక్ష

» ఆహార ప్యాకెట్లపై గడువు తేదీ మార్చినందుకు బహ్రెయిన్ కోర్టు తీర్పు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సంస్థ యజమానితో కలిసి ఆహార ప్యాకెట్లపై గడువు ముగింపు తేదీలను మార్చడం ద్వారా మోసాలకు పాల్పడ్డారనే కేసులో ఐదుగురు తెలంగాణ ప్రవాసీలు జైలు పాలయ్యారు. న్యాయస్థానం వీరికి రెండేళ్ల జైలు శిక్ష, దేశ బహిష్కరణ విధించింది. అలాగే, ఇద్దరు అరబ్బు యజమానులు, ఓ భారతీయ మేనేజరు సహా 19 మంది ప్రవాస భారతీయులు కూడా జైలు శిక్ష పడిన వారిలో ఉన్నారు. బహ్రెయిన్‌లో ఆహార పదార్థాలను సరఫరా చేసే ఓ ప్రముఖ సంస్థలో నిజామాబాద్‌కు చెందిన ముగ్గురు.. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఒక్కొక్కరు పని చేస్తున్నారు. అయితే, ఇదే సంస్థలో పని చేయడానికి వచ్చిన ఉద్యోగి ఒకరు అందులో పని విషయమై వివాదం ఏర్పడడంతో సంస్థ కార్యకలాపాలను వీడియో రికార్డింగ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు సంస్థ గిడ్డంగులపై దాడులు చేసి ప్యాకింగ్ చేసిన వివిధ రకాల ఆహార పదార్థాల ప్యాకెట్లపై గడువు ముగిసిన తేదీలను మారుస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారని బహ్రెయినీ జాతీయులైన అరబ్బు యజమానులతో సహా మొత్తం 29 మందిని అరెస్టు చేశారు. కానీ, సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో న్యాయస్థానం ఏడుగురు భారతీయులను విడుదల చేయగా.. మిగిలిన 22 మందికి రెండేళ్ల జైలు శిక్షలు విధించింది. ప్రవాస భారతీయుల జైలు శిక్షను రద్దు చేయాలని బహ్రెయిన్‌లోని సామాజిక కార్యకర్త కోటగిరి నవీన్, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డిలు ప్రయత్నాలు చేస్తున్నారు.



భరతనాట్యంలో అరంగేట్రం

చేసిన చైనా విద్యార్థిని

బీజింగ్, ఆగస్టు 12: భారతీయ ప్రాచీన కళారూపమైన భరతనాట్యంలో 'అరంగేట్రం' చేయడం ద్వారా చైనా జాతీయురాలైన 17ఏళ్ల జాంగ్ జియాయువాన్ చరిత్ర సృష్టించింది. ఈ మేరకు బీజింగ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ భరతనాట్య కళాకారిణి జిన్ షాన్ షాన్, భారత దౌత్యవేత్తలు, పెద్దఎత్తున హాజరైన స్థానికుల ఎదుట జాంగ్ తన అరంగేట్ర ప్రదర్శన చేసింది. తద్వారా చైనాలోనే శిక్షణ పొంది, ఇక్కడే అరంగేట్రం చేసిన రెండో నర్తకిగా రికార్డు సృష్టించింది. గతేడాది 13 ఏళ్ల లీ ముజీ చైనాలో మొట్ట మొదటిసారిగా భరతనాట్య అరంగేట్రాన్ని ప్రదర్శించిన తొలి విద్యార్థినిగా నిలిచింది. జాంగ్ ఐదేళ్ల వయసులోనే భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించి, 12ఏళ్లు వచ్చేనాటికి తన గురువు జిన్ షాన్ షాన్ నిర్వహించే ప్రత్యేక నృత్య పాఠశాలలో చేరింది. అరంగేట్రం కోసం రోజుకు 5గంటల చొప్పున కఠిన సాధన చేసింది. ప్రదర్శన తర్వాత భారత దౌత్యవేత్త అభిషేక్ ఆమెను అభినందిస్తూ, అత్యంత క్లిష్టమైన భారతీయ నృత్య రూపాన్ని నేర్చుకోవడానికి తను చేసిన కృషిని ప్రశంసించారు.

రూ.20 వాటర్ బాటిల్‌కు 100 ఎందుకు తీసుకుంటారు?

» హోటళ్లు, రెస్టారెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 24: హోటళ్లు, రెస్టారెంట్లు వసూలు చేస్తున్న సర్వీస్ చార్జీలపై మరోసారి ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విక్రయించే వాటిపై గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే ఎక్కువే తీసుకుంటున్నప్పుడు.. మళ్లీ అదనంగా సర్వీస్ చార్జీ ఎందుకు వసూలు చేస్తున్నారంటూ రెస్టారెంట్ల సంఘాలను నిలదీసింది. హోటళ్లు, రెస్టారెంట్లలో సర్వీస్ చార్జీ తప్పనిసరి కాదంటూ ఈ ఏడాది మార్చిలో ఢిల్లీ హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తీర్పునిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ జాతీయ రెస్టారెంట్ల సంఘం, భారత హోటళ్లు, రెస్టారెంట్ల సంఘాల సమాఖ్య పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై ద్విసభ్య ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది. 'రూ.20 వాటర్ బాటిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నప్పుడు మళ్లీ వినియోగదారుడు విడిగా సర్వీస్ చార్జీ ఎందుకు చెల్లించాలి. ఎమ్మార్పీ కంటే ఎక్కువ తీసుకుంటారా.. అదనంగా రూ.80 ఎందుకివ్వాలి..?' అని రెస్టారెంట్ల సంఘాలను ప్రశ్నించింది. వాదనలు నమోదు చేసుకున్న కోర్టు.. విచారణను సెప్టెంబరు 22కి వాయిదా వేసింది.

భార్యకు నిప్పంటించి హత్య..

» అదనపు కట్నం కోసం.. నోయిడాలో అత్తింటి వారి దురాగతం

» హత్య వీడియో వైరల్.. భర్త విపిన్, అత్త అరెస్టు..



నోయిడా, ఆగస్టు 24: అదనపు కట్నం కోసం భార్యను అతి కిరాతకంగా హింసించాడు. జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లాడు. అంతటితో ఆగకుండా.. తన తల్లిదండ్రులతో కలిసి.. థిన్నర్ చల్లి, నిప్పంటించి చంపేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఈ దారుణం చోటుచేసుకోగా.. పోలీసులు భర్తను అరెస్టు చేసి, సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా ఇన్‌స్పెక్టర్ పిస్టల్ లాక్కొని, పారిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడి కాలికి గాయమైంది. నోయిడా అదనపు డీసీపీ సుధీర్‌కుమార్, బాధితురాలి తండ్రి భికారీ సింగ్ పాయ్లా కథనం ప్రకారం.. సిర్సా చౌరాహా ప్రాంతానికి చెందిన సత్యవీర్, దయా దంపతుల కుమారుడు విపిన్ భాటీతో.. భికారీ సింగ్ కుమార్తె నిక్కీని ఇచ్చి ఏడేళ్లక్రితం వివాహం చేశారు. వీరికి ఆరేళ్ల కుమారుడున్నారు. పెళ్లి సమయంలో విపిన్ కోరినట్లు కట్నంతోపాటు ఒక స్కార్పియో వాహనాన్ని ఇచ్చామని భికారీ సింగ్ తెలిపారు. ఆ తర్వాత బుల్లెట్ బైక్ అడిగితే.. కొనిచ్చామని పేర్కొన్నారు. కొంత కాలం క్రితం తమ కుటుంబం కోసం మెర్సిడెస్ కారును కొన్నట్లు వివరించారు. అప్పటి నుంచి విపిన్ తనకు కూడా ఆ కారును కొనివ్వాలని పట్టుబట్టాడని, రూ.36 లక్షల అదనపు కట్నం ఇవ్వాలంటూ తమపై ఒత్తిడి తీసుకువచ్చాడని చెప్పారు. ఈ క్రమంలో గురువారం నిక్కీని ఆమె భర్త, అత్తమామలు హింసించారు. అనంతరం నిప్పంటించి పారిపోయారు. 70% కాలిన గాయాలతో సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో నిక్కీ చనిపోయారు. ఈ ఘటన దృశ్యాల వీడియో వైరల్ అయ్యింది. విపిన్, అతని తల్లి దయాను అరెస్టుచేశారు. విపిన్ తండ్రి సత్యవీర్, సోదరుడు రోహిత్ పరారీలో ఉన్నారు.

ఎన్‌కౌంటర్ చేయాలి: విపిన్ తన కూతురిని పొట్టనబెట్టుకున్నాడని నిక్కీ తండ్రి భికారీ సింగ్ పాయ్లా అన్నారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలని, ఇంటిని బుల్‌డోజర్‌తో కూల్చివేయాలని సీఎం యోగిని ఆయన కోరారు. లేదంటే దీక్షకు దిగుతామని హెచ్చరించారు.నిక్కీ ఆరేళ్ల కుమారుడు కూడా.. "మా అమ్మపై ఏదో చల్లారు. లైటర్‌తో నిప్పంటించారు"ని పోలీసులకు వాంగ్మూలమిచ్చాడు.

48 గంటల్లో అల్పపీడనం

» ఉత్తర కోస్తాకు మూడు రోజులు భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక చోట్ల ఆదివారం ఎండ తీవ్రత కొనసాగింది. కావలిలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మూడు, నాలుగు రోజుల నుంచి ఎండ తీవ్రత కొనసాగడంతో క్యుములో నింబస్ మేఘాలు ఆవిరించి రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, పిడుగులతో వర్షాలు కురిశాయి. అదే ప్రభావంతో సోమవారం నుంచి ఉత్తరకోస్తాలో వర్షాలు పెరగనున్నాయని, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. వచ్చే 48 గంటల్లో ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్‌కు ఆనుకొని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో 26, 27, 28 తేదీల్లో ఉత్తరకోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

కృష్ణా, గోదావరి వరద తగ్గుముఖం

విజయవాడ, పోలవరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. కృష్ణానదిలో నాగార్జునసాగర్ నుంచి 3.60 లక్షల క్యూసెక్కులు పులిచింతలకు వస్తోంది. పులిచింతల నుంచి 3.33 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పాలేరు నుంచి 706 క్యూసెక్కులు, కీసర నుంచి 4738 క్యూసెక్కులు కలిపి మొత్తంగా ప్రకాశం బ్యారేజీకి 3,83,916 క్యూసెక్కులు వస్తుండటంతో గేట్లన్నీ ఎత్తి 3,65,725 క్యూసెక్కులు సముద్రంలోకి వదులుతున్నారు. గోదావరిలో భద్రాచలం వద్ద నీటిమట్టం 32.60అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 6,79,782 క్యూసెక్కులను 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రమాదం అంచుల్లో రాజ్యాంగం!

» తమిళనాడు నేతలతో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి



జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న స్టాలిన్

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో సమాఖ్యవాదం, రాజ్యాంగం ప్రమాదపుటంచుల్లో ఉన్నాయని, తనను గెలిపిస్తే రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని విపక్ష ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తమిళనాడు ఎంపీల మద్దతు కోరేందుకు ఆయన ఆదివారం చెన్నై వచ్చారు. సాయంత్రం డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్, ఆ పార్టీ మిత్రపక్షాల నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తమిళనాడును దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా స్టాలిన్ ముందుకు నడిపిస్తున్నారని, విద్య, వైద్య రంగాలలో తమిళనాడు ప్రథమ స్థానంలో ఉందని ప్రశంసించారు. రాష్ట్ర హక్కుల కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారతదేశం, రాజ్యాంగం గురించి తెలియని వారంతా ఒకే దేశం అంటూ నినాదాలు చేస్తున్నారని, ఒకే దేశం అంటే రాష్ట్రాలు కూడా ఉన్నాయనే విషయాన్ని మరచిపోతున్నారని పేర్కొన్నారు.

మొదటిసారి రుణం తీసుకునేవారికి

కనీస సిబిల్ స్కోర్ అక్కర్లేదు

» రుణ దరఖాస్తులకు కనీస క్రెడిట్ స్కోర్‌ను ఆర్బీఐ సూచించలేదు

» కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి



న్యూఢిల్లీ, ఆగస్టు 24: మొదటిసారి బ్యాంకు రుణం తీసుకునే వారికి కనీస సిబిల్ స్కోర్ అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గత వారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి మాట్లాడుతూ.. మొదటిసారి రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి క్రెడిట్ స్కోర్ తక్కువగా లేదా సున్నాగా ఉంటే రుణ దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించరాదన్నారు. ఈ సందర్భంగా ఆర్బీఐ ఇచ్చిన ఆదేశాలను ఆయన ప్రస్తావించారు. కేవలం క్రెడిట్ చరిత్ర లేదన్న కారణంతో మొదటిసారి రుణం తీసుకునే వారి రుణ దరఖాస్తును బ్యాంకులు తిరస్కరించరాదని ఆర్బీఐ సూచించినట్టు తెలిపారు. రుణ దరఖాస్తులకు ఆర్బీఐ కనీస క్రెడిట్ స్కోర్‌ను ఏమీ సూచించలేదన్నారు. మొదటిసారి రుణం తీసుకునే వారికి సిబిల్ స్కోర్ తప్పనిసరి కాకపోయినప్పటికీ దరఖాస్తుదారుల నేపథ్య తనిఖీని నిర్వహించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకులను కోరింది. వీటిలో క్రెడిట్ చరిత్ర, గత చెల్లింపుల చరిత్ర, చెల్లింపుల్లో జాప్యం, రుణాల సెటిల్‌మెంట్ వంటివి ఉంటాయి. కాగా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు(సీఐసీ) ఒక వ్యక్తికి క్రెడిట్ రిపోర్టులను ఇవ్వడానికి రూ.100 వరకు చార్జీని వసూలు చేయవచ్చని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అంతకు మించిన మొత్తం ఆమోదనీయం కాదన్నారు.

సిబిల్ స్కోర్ అంటే?

సిబిల్ అంటే.. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్. సిబిల్ స్కోర్ అనేది క్రెడిట్ యోగ్యతను నిర్ణయించే మూడంకెల సంఖ్య. ఈ స్కోర్ 300 నుంచి 900 వరకు ఉంటుంది. వ్యక్తిగత, బంగారం, గృహ, ఇతర బ్యాంకు రుణాలను తీసుకోవడానికి ఒక వ్యక్తి అర్హతను నిర్ణయించడానికి గాను సిబిల్ ఇచ్చే స్కోర్‌ను బ్యాంకులు వినియోగిస్తుంటాయి. స్కోరు 750అంతకంటే మెరుగ్గా ఉంటే పలు రుణాల ఆమోదానికి అర్హత ఎక్కువగా ఉంటుంది.

25,000 వద్ద పరీక్ష


వి. సుందర్ రాజా

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం మానసిక అవధి 25,000 వరకు వెళ్లినా అక్కడ నిలదొక్కుకోలేకపోయింది. శుక్రవారం నాడు ఏర్పడిన బలమైన రియాక్షన్‌తో ఆ స్థాయి కన్నా దిగజారింది. వారం మొత్తానికి 240 పాయింట్ల లాభంతో 24,870 వద్ద వారం కనిష్ఠ స్థాయికి చేరువలో ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతకు ఇది సంకేతం. మార్కెట్లో ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. అయితే మిడ్ క్యాప్-100 సూచీ 1125 పాయింట్లు లాభపడి 57,630 వద్ద స్మాల్‌క్యాప్-100 సూచీ 370 పాయింట్ల లాభంతో 17,920 వద్ద ముగిశాయి. ట్రెండ్‌లో సానుకూలత కోసం తదుపరి నిరోధాల వద్ద బలంగా నిలదొక్కుకోవాల్సి ఉంది. అమెరికన్ మార్కెట్లో గత శుక్రవారం నాటి ర్యాలీ కారణంగా ఈ వారం మన మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు.

బుల్లిష్ స్థాయిలు: గరిష్ఠ స్థాయిల్లో మరింత కన్సాలిడేషన్ ఉండవచ్చు. మార్కెట్ ఈ వారంలో స్వల్పకాలిక నిరోధం, మానసిక అవధి 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఆ పైన ప్రధాన నిరోధం 25,250.

బేరిష్ స్థాయిలు: 25,000 వద్ద విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 24,850. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో ప్రధాన మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో 56,000 స్థాయిని బ్రేక్ చేసినా శుక్రవారం నాటి బలమైన రియాక్షన్ కారణంగా వారం మొత్తానికి 190 పాయింట్ల నష్టంతో 55,150 వద్ద ముగిసింది. ప్రధాన మద్దతు స్థాయి 55,000 కన్నా పైనే ఉంది. తదుపరి నిరోధం 55,700 కన్నా పైన నిలదొక్కుకుంటే పాజిటివ్ సంకేతం ఇస్తుంది. తదుపరి ప్రధాన నిరోధం 56,200.

పాటర్న్: నిఫ్టీ ఇప్పుడు 25,000 సమీపంలో ఉన్న 50 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. అదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద కూడా నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళ, శుక్రవారాల్లో మైనర్ రివర్సల్స్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	25,000, 25,060
మద్దతు	24,940, 24,850

టెక్, ఏఐకు భారత్ అద్భుత మార్కెట్

- ఏఐతో కొత్త రకం ఉద్యోగాలు
- మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్



న్యూఢిల్లీ: టెక్నాలజీ, కృత్రిమ మేధ (ఏఐ)కు భారత్ అద్భుతమైన మార్కెట్ అని మైక్రోసాఫ్ట్ ఇండియా భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది లేదా ఏడాదిన్నరలో నూటికి 82 కంపెనీలు తమ ఉద్యోగులకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతుంటే, భారత్‌లో మాత్రం 93 శాతం కంపెనీలు ఇందుకు సిద్ధంగా ఉన్నట్టు సంస్థ ప్రెసిడెంట్ పునీత్ చందోక్ చెప్పారు. ఈ గిరాకీని తట్టుకునేందుకు పెద్దసంఖ్యలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, అప్లికేషన్స్ ఇంజనీర్లు అవసరమవుతారన్నారు. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ కోడింగ్‌లో 30 శాతం ఏఐ ద్వారానే రాస్తున్నట్టు తెలిపారు. భారత్‌లో తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐలో 300 కోట్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్టు తెలిపారు.

ఏఐపై అనవసర భయాలు: ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలను చందోక్ తోసిపుచ్చారు. కొన్ని ఉద్యోగాలు పోయినా, ఏఐ ఆర్కెస్ట్రేటర్, ఏఐ ఏజెంట్ మేనేజర్, ఏజెంట్ బాస్, ప్రాంప్ట్ ఇంజనీర్ వంటి అనేక కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్నారు. అయితే ఇందుకు అవసరమైన పూర్తి స్థాయి ఏఐ నైపుణ్యాలను యువత అలవర్చుకోక తప్పదన్నారు. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంపై అడిగిన ప్రశ్నకు మాత్రం చందోక్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. అయితే ఆర్థిక సంబంధాలు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయన్నారు. ఐదేళ్లలో భారత్‌లో కోటి మందికి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యానికి మైక్రోసాఫ్ట్ ఇండియా కట్టుబడి ఉన్నట్టు తెలిపారు.

ఫార్మా ఎగుమతుల్లో 5 % వృద్ధి



జూన్ త్రైమాసికంలో రూ.65,860 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: అనిశ్చిత పరిస్థితుల్లోనూ భారత ఫార్మా ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారత్ నుంచి 757 కోట్ల డాలర్ల (సుమారు రూ.65,860 కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 5.21 శాతం ఎక్కువ. ఫార్ములేషన్లు, బయోలాజిక్స్ విభాగాలు ఎగుమతులు పెరిగేందుకు బాగా దోహదం చేశాయి. కాగా ఇదే కాలంలో విదేశాల నుంచి మన దేశానికి దిగుమతయ్యే ఫార్మా ఉత్పత్తులు 4.21 శాతం పెరిగి 78.6 కోట్ల డాలర్లకు చేరినట్టు ఫార్మెగ్జిల్ చైర్మన్ నమిత్ జోషి చెప్పారు. జూన్ త్రైమాసికంలో భారత్‌కు దిగుమతైన ఫార్మా ఉత్పత్తుల్లో 46 శాతం బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియరీలు ఉన్నాయి. అమెరికా మార్కెట్లో ధరల ఒత్తిడి, టారిఫ్ సమస్యలు ఉన్నా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగతా త్రైమాసికాల్లోనూ ఎగుమతుల వృద్ధి రేటు కొనసాగుతుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25) లో భారత్ నుంచి 3,047 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.65 లక్షల కోట్లు) విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 9.39 శాతం ఎక్కువ.

ఆర్‌కామ్‌ది మోసపూరిత ఖాతానే : బీఓఐ

న్యూఢిల్లీ: అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) కూడా మోసపూరిత ఖాతాగా ప్రకటించింది. ఆర్‌కామ్ వ్యాపార విస్తరణ పేరుతో 2016 ఆగస్టులో అనిల్ అంబానీ తమ నుంచి తీసుకున్న రూ.700 కోట్లను దారి మళ్లించి జేబులో వేసుకున్నట్టు బీఓఐ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఆర్‌కామ్ రుణ ఖాతాను ఎస్‌బీఐ ఈ ఏడాది జూన్‌లోనే మోసపూరిత ఖాతాగా ప్రకటించింది. కాగా తమ నుంచి తీసుకున్న రూ.700 కోట్ల రుణ మొత్తాన్ని ఆర్‌కామ్ నిబంధనలకు విరుద్ధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిందని బీఓఐ పేర్కొంది. మరోవైపు అనిల్ అంబానీపై సీబీఐ నమోదు చేసిన కేసుల ప్రభావం తమ వ్యాపారాలు, ఆర్థిక లావాదేవీలు, వాటాదారులు, ఉద్యోగులపై ఏ మాత్రం ఉండదని రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రకటించాయి.

ఎగుమతులకు రూ.25,000 కోట్ల ప్రోత్సాహకాలు!

న్యూఢిల్లీ: ట్రంప్ సుంకాలతో ఆందోళనలో ఉన్న ఎగుమతిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే ఆరేళ్లలో ఎగుమతిదారులకు ప్రోత్సాహకాల రూపంలో రూ.25,000 కోట్లు అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం) కింద ప్రభుత్వం ఈ మొత్తాన్ని అందించనుంది. ఎగుమతిదారులకు తక్కువ వడ్డీతో సులభంగా రుణాలు అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని అధికార వర్గాలు చెప్పాయి. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఎక్స్‌పెండీచర్ ఫైనాన్స్ కమిటీ (ఈఎఫ్‌సీ)కి పంపించినట్టు సమాచారం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25 తేదీ



హైదరాబాద్	495	విజయవాడ	540
వరంగల్	497	గోదావరి	535
చిత్తూరు	558	విశాఖపట్నం	535

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	112
వరంగల్	98	గుంటూరు	112
కరీంనగర్	98	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	85
కర్నూలు	98	నెల్లూరు	90
విశాఖపట్నం	116	అనంతపురం	90
గోదావరి	112		

- ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీదారు ఓబెన్ ఎలక్ట్రిక్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో షోరూమ్, సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా సంస్థకిది 50వ షోరూమ్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశవ్యాప్తంగా 150 షోరూమ్‌లు ఏర్పాటు చేయాలని ఓబెన్ లక్ష్యంగా పెట్టుకుంది.
- బంధన్ బ్యాంక్ తన పదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'లెగసీ అకౌంట్'ను ప్రారంభించింది. సంపన్నుల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన పొదుపు ఖాతా ఇదని బ్యాంక్ వెల్లడించింది. ఎలీట్ మాస్టర్ డెబిట్ కార్డుతో పాటు రూ.కోటి వరకు ఎయిర్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, రూ.20 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా ఆఫర్ చేస్తోంది.
- ఎల్ అండ్ టీ ఫైనాన్స్.. గూగుల్ పేతో జట్టు కట్టింది. ఇందులో భాగంగా అర్హులైన యూజర్లకు వ్యక్తిగత రుణాలను ఎల్ అండ్ టీ ఫైనాన్స్ ఆఫర్ చేయనుంది. ఎల్ అండ్ టీ ఫైనాన్స్ ఇప్పటికే ఇతర ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్స్ అయిన ఫోన్‌పే, క్రెడ్, అమెజాన్ పే లతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది.
- ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్.. స్మార్ట్ షీల్డ్ ప్లస్ పేరుతో కొత్త పాలసీని ప్రారంభించింది. వినియోగదారుల బీమా అవసరాలకు అనుగుణంగా ఈ పాలసీని డిజైన్ చేసింది. ఇది ఇండివిడ్యువల్, నాన్ పార్టిసిపేటింగ్, రిస్క్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం.

ఆచితూచి వ్యవహరించండి..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం కనిపిస్తోంది. సెప్టెంబరులో యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉండటం, జీఎస్‌టీ సంస్కరణలు సూచీలకు దన్నుగా నిలిచే వీలుంది. అయితే ట్రంప్ టారిఫ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ విరమణపై స్పష్టత లేకపోవటం సూచీలపై ప్రభావం పడే అవకాశం ఉంది. వీటిని దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్టర్లు ఎంపిక చేసుకున్న షేర్లలో పెట్టుబడులు పెట్టడం మంచిది. నిఫ్టీ గత శుక్రవారం 200 పాయింట్లకు పైగా పతనమవ్వటం లాభాల స్వీకరణను సూచిస్తోంది. మద్దతు లభిస్తే మళ్లీ పుల్‌బ్యాక్ ర్యాలీకి అవకాశం ఉంటుంది.

స్టాక్ రికమండేషన్స్

ఎన్ఎస్‌డీఎల్: కొన్ని రోజుల కిందే స్టాక్ మార్కెట్లో లిస్టయిన ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ఐపీఓ గరిష్ఠ స్థాయి తర్వాత షేరు టైట్‌గా చలిస్తోంది. ఫ్లాగ్ స్ట్రక్చర్ కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.1,275 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,450 టార్గెట్ ధరతో రూ.1,250 స్థాయిలో అక్యుములేట్ చేసుకుంటూ పడే కొద్ది కొనుగోలు చేయాలి. రూ.1,210 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఎక్స్ప్రైడ్ ఇండస్ట్రీస్: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం రివర్సల్ అవుతోంది. హయ్యర్ హై ఫామ్ చేస్తూ అక్యుములేషన్ జోన్‌లో ఉంది. బ్యాటరీ ఇండస్ట్రీ బ్రెడ్త్ సైతం మెరుగవుతోంది. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.396 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.380/390 శ్రేణిలో ఎంటరై రూ.455 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.370 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రీమ్ ఇండస్ట్రీస్: గత ఏడాది జూన్ నుంచి డౌన్ ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్ ఈ ఏడాది మే నుంచి రివర్సల్ బాట పట్టింది. ప్రస్తుతం కీలక నిరోధ స్థాయి రూ.4,700 వద్ద చలిస్తోంది. దీన్ని అధిగమిస్తే మరింత పెరగటం ఖాయం. మూమెంటమ్ క్రమంగా మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.4,637 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,780 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,560 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇప్కా ల్యాబ్స్: కొన్ని నెలలుగా అక్యుములేషన్ జోన్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి రూ.1,350 నుంచి రివర్సల్ అయ్యింది. డార్వాస్ బాక్స్ మాదిరిగా కొంతమేర స్వింగ్ లభించే సూచనలు ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,418 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,400 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,580/1,650 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,360 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆదిత్య ఇన్ఫోటెక్: కొన్ని రోజుల క్రితమే మార్కెట్లో లిస్టయిన ఈ షేరు దూకుడు మీద ఉంది. నిఫ్టీతో పోల్చితే జోరు ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం రూ.1,360 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,300 శ్రేణిలో ప్రవేశించి రూ.1,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రిస్క్ ప్రొఫైల్‌ను బట్టి దీర్ఘకాలం మదుపు చేసుకోవచ్చు. రూ.1,260 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదివారం అమరావతిలో కలుసుకుని తన మనవరాలు కాదంబరి ఎస్.విశ్వనాథన్ వివాహ వేడుక ఆహ్వానపత్రికను అందిస్తున్న 'వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (వీఐటీ) వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్.

డీఎస్సీ ఎస్జీటీలో 'ఆదిత్య' విద్యార్థినికి స్టేట్ థర్డ్ ర్యాంకు



సూర్యలక్ష్మిని అభినందిస్తున్న ఆదిత్య శిక్షణా సంస్థ డైరెక్టర్ డీఎన్ గణేష్

కాకినాడ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య శిక్షణా సంస్థలో కోచింగ్ తీసుకున్న వి.సూర్యలక్ష్మి మెగా డీఎస్సీ-2025 ఎస్జీటీ విభాగంలో 94.56 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 3వ, కాకినాడ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సూర్యలక్ష్మిని ఆదిత్య శిక్షణా సంస్థ డైరెక్టర్ డీఎన్ గణేష్, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణ దీపక్ రెడ్డి అభినందించారు.

పదవుల కోసం తాపత్రయపడను చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యం

- తండ్రి బాటను వీడను: వంగవీటి రాధ

ముదినేపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి బాటను వీడనని, ఆయన ఆశయాల సాధనకే కట్టుబడి ఉన్నానని దివంగత నేత వంగవీటి మోహనరంగా తనయుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం ఈడేపల్లిలో ఆదివారం రంగా విగ్రహాల ఆవిష్కరణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పదవుల కోసం తాపత్రయపడనని, తన భవిష్యత్తును టీడీపీ అధిష్ఠానమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయమే శిరోధార్యమన్నారు. పదవులు రాలేదన్న బాధలేదన్నారు. తన తండ్రి రంగా ఆశయ సాధనకే తాను ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. రాష్ట్రంలో కూటమి పాలన అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనిస్తోందని అన్నారు.

బాబు వచ్చినా మార్పు లేదు

- ప్రత్యామ్నాయ నమూనాతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి: కె.రామకృష్ణ
- చంద్రబాబు తొలి ఐదేళ్లలో అమరావతి, పోలవరం జపం
- ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేయలేదు
- జగన్ బటన్ నొక్కి ఓట్లు దండుకోవాలనుకున్నాడు
- సీపీఐ మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి ధ్వజం
- అదానీ, అంబానీల శ్రేయస్సుకే మోదీ ప్రాధాన్యం: వహీదా నవాజ్
- నేడు కొత్త కార్యదర్శి ఎన్నిక?
- రేసులో ముప్పాళ్ల, ఈశ్వరయ్య



ఒంగోలులో సీపీఐ ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఒంగోలు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్ర సమగ్రాభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన నమూనాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. తొలి ఐదేళ్లలో పోలవరం, అమరావతి జపం చేస్తూ ఇతర ప్రాంతాల అభివృద్ధిని చంద్రబాబు పట్టించుకోలేదని విమర్శించారు. జగన్ సీఎం అయ్యాక బటన్ నొక్కి అకౌంట్లలో అరకొర నగదు వేసి ఓట్లు దండుకోవాలనుకున్నాడు తప్ప రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేశాడని మండిపడ్డారు. తిరిగి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కూడా మార్పు లేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం వివిధ రంగాల వారీ చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను వామపక్షాలు రూపొందించి వాటి సాధన కోసం ఐక్యఉద్యమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. వామపక్షాలు, మేధావులు, అభివృద్ధిని కాంక్షించే వర్గాలతో విస్తృతంగా చర్చించి కార్యాచరణ రూపొందించాలన్నారు. అందుకు సీపీఐ మహాసభలు నాంది కావాలని ఆకాంక్షించారు. ఒంగోలులో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఇక్కడి ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ జరిగింది. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీఎన్ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభను సీపీఐ జాతీయ నాయకురాలు వహీదా నవాజ్ ప్రారంభించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. వ్యవసాయం, ఇరిగేషన్, పారిశ్రామిక, ఐటీ, భూములు, అమరావతి అభివృద్ధిపై ప్రత్యామ్నాయ నమూనా రూపొందించి అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టాల్సి ఉందని రామకృష్ణ తన ప్రసంగంలో పేర్కొన్నారు. వివిధ వర్గాల వారితో త్వరలో ప్రత్యేక చర్చ చేపట్టి దానిని రూపొందించి రెండు కమ్యూనిస్టు పార్టీలు పోరాడాలని ప్రతిపాదించగా ప్రతినిధులు హర్షధ్వానాలతో ఆమోదం తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహమంటూ.. 140 కోట్ల భారతీయుల క్షేమం కన్నా అదానీ, అంబానీల శ్రేయస్సుకే ప్రధాని మోదీ ప్రాధాన్యం ఇస్తున్నారని వహీదా మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన టారిఫ్ వార్‌పై ఆయన నోరు మెదపడం లేదని ఆక్షేపించారు. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి

పార్టీ అగ్ర నేత సురవరం సుధాకర్‌రెడ్డి మరణించడంతో సీపీఐ ప్రతినిధులు సభ ప్రారంభ సమయంలో ఆనవాయితీగా చేసే ఎర్రజెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని రద్దు చేశారు. సభలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తొలుత సీనియర్ కమ్యూనిస్టు నేత నల్లూరి వెంకటేశ్వర్లు ఆహ్వాన సంఘం తరపున ప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జాతీయ నేతలు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, సినీనటుడు మాదాల రవి, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర సీపీఐకి నేడు కొత్త సారథి!

రాష్ట్రంలో సీపీఐకి కొత్త సారథి రానున్నారా? ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పదేళ్లుగా పనిచేస్తున్న రామకృష్ణ ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నారా? అవుననే ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఒంగోలులో మహాసభల చివరి రోజైన సోమవారం ఈ మార్పు జరిగే అవకాశం ఉన్నట్లు చర్చ సాగుతోంది. సీనియర్ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు (గుంటూరు), యువజన నేత జి.ఈశ్వరయ్య (కడప) రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈసారి తాను వైదొలుగుతానని రామకృష్ణ ఇప్పటికే కేంద్ర కీలక నేతలకు చెప్పినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఆయన సీపీఐ అఖిల భారత స్థాయి కమిటీకి రాష్ట్రం నుంచి ఎంపికవుతారని చర్చ సాగుతోంది.



క్రీడాజ్యోతితో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సినీనటుడు రోహిత్, తదితరులు

స్పోర్ట్స్ హబ్‌గా ఏపీ: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

- తిరుపతిలో అమరావతి చాంపియన్‌షిప్ కప్ పోటీలు ప్రారంభం

తిరుపతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్పోర్ట్స్‌డేని పురస్కరించుకుని అమరావతి చాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఆదివారం తిరుపతిలోని ఎన్టీఆర్ స్టేడియంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లోనే క్రీడారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా మార్చబోతున్నారని వెల్లడించారు. సినీనటుడు నారా రోహిత్, శాప్ చైర్మన్ రవినాయుడు, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ గిరీషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి పంచాయతీ కార్యదర్శుల సమస్యలు

- ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ (గాంధీనగర్), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు, డీఏ ఆరియర్స్, బకాయిల చెల్లింపు, ఇతర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.విద్యాసాగర్, డీవీ రమణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య (ఏపీపీఎస్ఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో ఆదివారం జరిగింది. పంచాయతీ కార్యదర్శి పేరును గ్రామ అభివృద్ధి అధికారి లేదా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా మార్చాలని తీర్మానించారు.

నవంబరులో అనంతపురంలో రెవెన్యూ క్రీడలు: బొప్పరాజు

విజయవాడ (గాంధీనగర్), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 7, 8, 9 తేదీల్లో అనంతపురంలో ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ రెవెన్యూ అసోసియేషన్ ఇటీవల చేపట్టిన ఉమ్మడి జిల్లాల తహసీల్దార్ల సమావేశాలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. జాతీయ స్థాయిలో రెవెన్యూశాఖకు రెండు స్కాచ్ అవార్డులు రావడంపై హర్షం వ్యక్తం చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సోమశేఖర్, రమేశ్‌బాబు

న్యూరో సర్జరీల్లో రోబోలు కీలక పాత్ర

- 'న్యూరో నెక్సస్ 2025'లో వైద్య నిపుణులు

గుంటూరు మెడికల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో న్యూరో సర్జరీ విభాగంలో రోబోల పాత్ర మరింత కీలకంగా మారుతుందని ఆస్టర్ ఇండియా మెడికల్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సోమశేఖర్ అన్నారు. త్వరలోనే ఆస్టర్ రమేశ్ గ్రూప్‌లో న్యూరో రోబోటిక్ సర్జరీలను ప్రారంభిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి న్యూరాలజీ వైద్య విద్యా కార్యక్రమం 'న్యూరో నెక్సస్ 2025'లో సోమశేఖర్ పాల్గొని ప్రసంగించారు. ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేశ్‌బాబు మాట్లాడుతూ.. న్యూరో వైద్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనుసంధానిత సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ ఫలితాలు అత్యంత కచ్చితత్వంతో శాస్త్రీయ వైద్యం అందించేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. సైంటిఫిక్ సెషన్‌లో పలువురు న్యూరో సర్జన్లు, న్యూరాలజిస్టులు.. మూర్ఛ వ్యాధులు, పక్షవాతం, మూవ్‌మెంట్ డిజార్డర్, న్యూరో సర్జరీ విభాగాలలో నూతనంగా వస్తున్న విప్లవాత్మక వైద్యవిధానాలను వివరించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్, ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ న్యూరాలజిస్టులు కుమారవేలు, హరిణి, లక్ష్మీ అనూష, ప్రశాంత్ బాబు, రాజేశ్, దీప్తి, న్యూరోసర్జన్లు అరుణ్, ధీరజ్, పృథ్వీ, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి, ఐఎంఏ గుంటూరు అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారాయుడు, కార్యదర్శి బి.సాయికృష్ణ, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ బి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

పార్వతీపురం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చిన్న గొడబ గ్రామ సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాఘవ (26) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం దుప్పలపూడి గ్రామంలోని తన ఇంటిలో శనివారం ఆయన ఆత్మహత్యకు ప్రయత్నించి, అప స్మారక స్థితికి చేరుకోగా బంధువులు బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందాడు. అప్పుల బాధ తాళలేక రాఘవ ఆత్మహత్య చేసుకున్నట్టు రామభద్రపురం ఎస్ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లే కారణమా...?

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రాఘవ ఎరువుల విక్రయాలకు సంబంధించి సుమారు రూ.5 లక్షలతో పాటు మరో రూ.మూడు లక్షల వరకు రైతులకు ఇవ్వాల్సి ఉన్నట్టు సమాచారం. ఈ నగదును తన సొంత అవసరాలకు వినియోగించుకున్న అతను తిరిగి చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసింది. ఆన్‌లైన్ బెట్టింగుల కారణంగానే అతను అప్పుల పాలైనట్టు సమాచారం.

కాలంపై చెరగని ఆరుద్ర ముద్రలు



ప్రపంచ రాజకీయ పరిణామాల వల్ల, ఆర్థిక కారణాల వల్ల, సంప్రదాయ పరంపరానుగత కవిత్వం, భావ కవిత్వం వంటి వాని కాల దూర అంశాల వల్ల – పుట్టి, వికసించి, విస్తృతమైన అభ్యుదయ కవిత్వ ఉద్యమంలో ఆరుద్ర వహించిన పాత్ర సాహిత్య చరిత్రాత్మకం.

వైవిధ్యాలు, వైచిత్ర్యాలు, ప్రాకృతిక సౌందర్యాలు, ఉద్యమ వైతాళిక ప్రబోధాలు, సమసమాజ స్వాప్నిక సృజనలు, జనోపయోగ రచనా ప్రయోగాలు – ఇటువంటి వాటి సమాహారం ఆరుద్ర కవిత్వం. శ్రీశ్రీ వంటి వేళ్ళ లెక్కింపు కవి శ్రేణిలో వాగ్వాణీ విలసితుడై ఠకీమని గుర్తుకు వచ్చే కవి ఆరుద్ర.

ప్రపంచ రాజకీయ పరిణామాల వల్ల, ఆర్థిక కారణాల వల్ల, సంప్రదాయ పరంపరానుగత కవిత్వం, భావ కవిత్వం వంటి వాని కాల దూర అంశాల వల్ల – పుట్టి, వికసించి, విస్తృతమైన అభ్యుదయ కవిత్వ ఉద్యమంలో ఆరుద్ర వహించిన పాత్ర సాహిత్య చరిత్రాత్మకం.

చమత్కారాలు అభివ్యక్తి సౌందర్యాలు ఆలోచనాప్రేరకాలు అని చెప్పడానికి ఆయన రాసిన 'కూనలమ్మ పదాలు' హృదయాల్లో మెదులుతాయి. జానపదాలలో పూర్వమే కొన్ని కూనలమ్మ పదాలు లభ్యమైనా, వాటి కంటె బలంగానూ ఉక్తి చమత్కృతులతోనూ వచ్చినవి ఆరుద్ర కూనలమ్మ పదాలే!

"చెలుల చీరలు దోచి/ చెల్లి చీరను కాచి/ చేసెనే లాలూచి/ ఓ కూనలమ్మా" అనడంలో వెటకారం గల పౌరాణిక పరిజ్ఞానముంది. "ఏకపత్నీ వ్రతము/ ఎలుగెత్తు మన మతము/ వేల్పు భార్యలో శతము/ ఓ కూనలమ్మా" అనడంలో సత్య దృష్టి ఉంది. "కొత్త పెండ్లము వండు/ గొడ్డు కారము మెండు/ తీపియను హజ్బెండు/ ఓ కూనలమ్మా" అనడంలో భార్యాప్రియత్వం ఉంది. పదప్రయోగ ధిషణత్వం ఉంది. "కొంటె బొమ్మల బాపు/ కొన్ని తరముల సేపు/ గుండె ఊయలలూపు/ ఓ కూనలమ్మ" అనడంలో బాపు స్థిర చిత్ర కీర్తిని మనోహరంగా చెప్పడం ఉంది. "గంగలో మునుగంగ/ పాపములు పోవంగ/ పాపియగునా గంగ?/ ఓ కూనలమ్మ" అనడంలో హేతువాదాలోచన ఉంది. ఆరుద్ర కూనలమ్మ పదాలు రాశాక ఎందరో కూనలమ్మ మకుటంతో ఆయన ప్రభావంతో ఎన్నో పదాలు రాశారు.

ఆరుద్ర చమత్కారాల పుట్ట 'ఇంటింటి పజ్యాలు'. అంత్య ప్రాసలే ఆరుద్ర వేలిముద్రలనడానికీ ఇవి కారకాలవుతాయి:

"ఎన్నడైనా జార్జిబెర్నాడ్ షా/ ఎక్కాడా సైకిల్ రిక్షా/ ఎన్నడైనా సోమర్‌సెట్ మామ్/ తిన్నాడా గులాబ్ జామ్/...

"రోజూ గీసుకోని మగాడి గడ్డం/ మోజున్న సరసానికొస్తుందా అడ్డం/... ముప్ఫయేళ్ళు దాటాక మగాడికి బొజ్జ/ తప్పకుండా వస్తే రాకూడదు లజ్జ/ కాలప్రవాహంలో ముప్ఫయేళ్ళ రేవు/ స్త్రీలు కూడా దాటగానే ఎక్కుతారు లావు"... ఇలాంటివెన్నో ఆశువుగా కూడా చెప్పేస్తారు ఆరుద్ర సారు.

ఎన్ని ప్రక్రియల్లో రచనలు చేసినా ఆరుద్ర మౌలికంగా కవి. తెలుగులో కైత పంటల్ని పండించిన ఆయన తమిళ కవిత్వానువాదాలన్ని చేసి, సరస్వతీ పుత్రులైన పుట్టపర్తి నారాయణాచార్యులు, విద్వద్విమర్శకుడు చల్లా రాధాకృష్ణశర్మ వంటి ఆంధ్ర తమిళ భాషా సాహిత్యవేత్తల ప్రశంసలు పొందారు. రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి నన్నయ్య భారత భాగాంధ్రానువాదం చేశాడు. ఆ రాజరాజు కుమారుడు కులోత్తుంగ చోళుని ఆస్థాన కవి జయం గొండాన్ 'కళింగత్తు సరణి' అనే తమిళ వీర రస కావ్యం రాశాడు. అందులోని కొన్ని ప్రకరణాలను ఆరుద్ర 'వెన్నెల – వేసవి' పేరిట ఆంధ్రీకరించారు. స్వీయ కావ్యమా అని భ్రమించేలా సహజానువాదం చేసి తమిళ కావ్య సుధను ఆంధ్రులచే ఆస్వాదింప జేశారు. యుద్ధ భూమి నుండి వీరులు తిరిగి వచ్చి తమ ప్రియురాళ్ళ ఇళ్ళకు వచ్చి 'తలుపు తీయమనడం' ఒక గొప్ప ప్రకరణం.

"వలరాజు కేళిలో అలసి సొలసిన పిదప/ ఇల మరచి మైమరచి అలవాట్లు చొప్పన/ వలిపెములు చుట్టుకొన చలువ వెన్నెల తాకి/ తెల బోవు చెలులార తలుపు తీయండి..."

"మెల్లగా వేనలి అల్లాడ అల్లాడ/ మేల్కొన్న నెమలి వలె మేనాడ మేనాడ/ మిసిమి అందెల రవళి ప్రసరించ ప్రసరించ/ మెలత చిలకల్లార తలుపు తీయండి. (వేనలి అంటే జడ).

"ఛాయ యను తన భార్య మాయమై దాగుకొన/ వేయి కరముల తోడ వదకెనో సూర్యుడన/ కాయుచుండెడి ఎండ కాకకోర్వని ధరణి/ వేయి చోట్లను పగిలి వెడద బీటలు వారె."

విశ్వజనీనమైన కవిత్వం ఏ భాషలో ఉన్నా ఆబగా గ్రోలాలనే వుంటుంది రసజ్ఞ భావుక జనానికి. పై చరణాలలోని తమిళ మహాకవి రసాత్మక కల్పనలను ఆలోచనలనూ ఆరుద్ర గారి 'అనువాద దూరదర్శని' ద్వారా మనం సమీక్షించుకోవచ్చు.

విశాఖపట్టణంలో ఆరుద్ర ఫొటోగ్రాఫర్‌గా పనిచేసిన కాలంలో తెలంగాణలో రజాకార్లచే చెరచబడిన ఒక నగ్న స్త్రీ వేదనార్తిని "నాకా సిగ్గు, నా స్త్రీత్వం ఎప్పుడో ఎప్పుడో పోయింది" అనే వార్తగా చూసి చలించిపోయాడు. రజాకార్లపై ఆయన ఆగ్రహం 'త్వమేవాహమ్' అనే అగ్రగణ్య కావ్యమై ప్రయోగాత్మక ప్రతీకాత్మక కావ్యమై విజృంభించింది. శాస్త్రజ్ఞానాన్ని కళాత్మకంగా ఎలా మలచవచ్చో చెప్పడానికి ఆరుద్ర ప్రతిభా పాండిత్యాల్ని గణించడానికీ ఈ కావ్యం బలకరంగా నిలబడింది. శ్రీశ్రీ, దాశరథి వంటి వారల విశ్లేషణలో ఇది ప్రజా రసజ్ఞ సమీపవర్తిని అయింది. "ఆంధ్రవాణి త్వమే వాహమనగ" సాగు అతులమతిక ఆరుద్రకు నతులొనర్తు' అన్నారు అభినవ పోతన వానమామలై వరదాచార్యులు. 'గాయాలూ – గేయాలూ'లో ఆరుద్ర అభ్యుదయ భావాలు పతాకస్థాయికి చేరాయి. పాలక వర్గాన్ని ప్రశ్నించే తత్త్వం ఉన్నత కేతనంగా మారింది. "పాలితుల మెదళ్ళ కుదుళ్ళు కట్టి/ వాళ్ళ చూపు దారిలో కాపలావాళ్ళను పెట్టి/ వాళ్ళ కిటికీలు మూసి మేకులు కొట్టి/ పరిపాలించబోతుంది రేపటి రాజ్యం. మొరలాలించడం అందులో పూజ్యం," అంటారు.

'సినీవాలి' కావ్యం ఆరుద్ర కీర్తిని స్థిరపరచింది. నగర జీవితానికి, మధ్యతరగతి మనస్తత్వానికీ ఒక ఆకృతి, కృతి. పదాలను కొత్తగానో మూలార్థాలతోనో వాడడం ఆరుద్రకు అలవాటు. సినీవాలి అంటే అమావాస్య నాటి చంద్ర రేఖ అని భావం. కావ్యపాత్ర అయిన సూర్యారావు నగరంలో ప్రవేశించాడు. ఆయనకు నగరంలోని షాపులు "పులితోలు కప్పుకున్న సాధు గోవులు"లా కనపడ్డాయి: "నగరం నీ ముందరి కాళ్ళ బంధం/ నగరం నీ కాలకూట మకరందం/... ఆధునిక రంగేళి యువతి లాగ/ నగరానికి మెదడు తక్కువ/ షోకులెక్కువ/ ఆశయాలు లేని/ ఆశలూ విలాసాలూ ఎక్కువ" – అనే సత్యం సూర్యారావు గ్రహించాడు. విలువలులేనితనం, స్వార్థ సంకుచిత భావాలు, ఆత్మీయతలు లేనితనం వంటివి సూర్యారావు చివరకు గమనించాడు. ఊహా ప్రేయసితో విహరించాడు, వాస్తవం గ్రహించాక చివరకు ఆత్మహత్యకు ప్రయత్నం చేశాడు. తెలుగులో శ్రీరంగం నారాయణబాబు – పఠాభి, పాశ్చాత్య సాహితీ ప్రపంచంలోని ఇలియట్ – ఎజ్రా పౌండ్ వంటివారి వారి ప్రభావం కొంతగా ఆరుద్రపై పని చేసే ఈ కావ్య సృజన వికసించింది.

సినీ కవిగా నాలుగు వేల అయిదు వందలకు పైగా పాటలు రాశారు ఆరుద్ర. నేను గొప్ప పాటనంటే నేను గొప్ప పాటనని ఎన్నెన్నో పాటలు పేర్కొనడానికి గాను ముందుకు తారాజువ్వల్లా దూసుకొస్తాయి. ఏ పెళ్ళి పందిరిలో నిలబడ్డా, "పందిట్లో పెళ్ళవుతున్నాది/ కనువిందౌతున్నాది" అనే ఆరుద్ర ఎప్పటి పాటో గుర్తుకు వచ్చి తీరుతుంది. నాస్తికుడైన ఆరుద్ర సినిమాలకై రామ సంబంధంగా రాసిన పాటలు భక్తుల గుండెల్లో సజీవంగా ఉంటూనే ఉంటాయి. "రాయినైనా కాకపోతిని రామ పాదము తాకగా/ బోయనైనా కాకపోతిని పుణ్య కావ్యము వ్రాయగా...", "శ్రీరామ నామాలు శతకోటి, ఒక్కొక్క నామం బహుతీపి," వంటివి పాత్రల తాదాత్మ్యంతో, పురాణ సంస్కృతిని ప్రతిబింబించేలా రాసిన పాటలు.

'ఆంధ్ర కేసరి' చలనచిత్రం కొన్నాళ్ళు ఆడి వెళ్ళిపోయింది. కానీ ఆ సినిమాలో ఆయన రాసిన "వేదంలా ఘోషించే గోదావరి, అమర ధామంలా శోభిల్లే రాజమహేంద్రి" అనే పాట ఎన్ని నాళ్ళ నుండో ఎన్ని ఏళ్ళ నుండో పాడబడుతూనే ఉంది. శ్రీశ్రీ, విశ్వనాథ, ఆరుద్ర, దాశరథి వంటి కవులు తాము విశ్వసించిన భావజాలం రక్తగతం అవడం వల్ల మాటలు, పాటలు, కవితలు వేటిలోనైనా ఆ సంబంధ అంశాలు వ్యక్తావ్యక్తాలుగా వచ్చి తీరతాయి. 'వేదంలా ఘోషించే గోదావరి' పాటలో, "ఆది కవిత నన్నయ్య వ్రాసెనిచ్చట" అన్నారు కాని "ఆదికవి నన్నయ్య వ్రాసెనిచ్చట" అనలేదు. కారణం– నన్నయ్య కావ్యం ఆది కావ్యమే కాని నన్నయ్య ఆది కవి కాడు అనే వాదానికి చెందినవారు ఆరుద్ర.

డిటెక్టివులు, కథలు, నవలలు, గాంధీ చరిత్రపై తోలు బొమ్మల రచన, గల్పికలు, రూపకాలు, శాస్త్రీయ గ్రంథాలు ఇలా ఎన్నో రాసినప్పటికీ, సమగ్రాంధ్ర సాహిత్యం వంటి అసమాన అపూరూప సాహిత్య చరిత్ర రాసినప్పటికీ మౌలికంగా ఆయన ఆత్మ సందర్శనం కవిత్వంలోనే అనిపిస్తుంది. అడుగిడినట్టి ప్రక్రియల్లో అద్భుతాలు సృష్టించారు. రసోత్తమ స్థాయి గల జానపద పాటకి దీటుగా ఆయన రాసిన "కొండగాలి తిరిగింది/ గుండె వూసులాడింది" పాటలో "పడుచుదనం అందానికి తాంబూలమేసింది," అన్న వాక్యాన్ని భావుకతతో ఆగి చదువుకుంటే, ఆనందంతో గుండె రసాత్మకమైన ఏదో వెలితి కలిగి నిండిపోదూ!

1925 ఆగస్టు 31వ తేదీన విశాఖపట్టణంలో పుట్టి పెరిగి సాహిత్య కవిత్వ కారణ జన్ముడై విజృంభించిన ఆరుద్ర మదరాసులో 1998 జూన్ 4వ తేదీన సర్గస్థులు కాలేదు, శాశ్వత కీర్తిశేషులయ్యారు. "ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయింది," అన్నట్లుగా.

(ఆగస్టు 31న ఆరుద్ర శతజయంతి)

■ **గౌతమీ పుత్ర**
✆ 92920 55531

సోమవారం 25 ఆగస్టు 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

'తలపుల పుటలు' కవిత్వ సంపుటి

తెరవే కరీంనగర్ ఆధ్వర్యంలో బూర్ల వెంకటేశ్వర్లు కవిత్వ సంపుటి 'తలపుల పుటలు' ఆవిష్కరణ సభ ఆగస్టు 25 సాయంత్రం కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరుగుతుంది. అధ్యక్షత సి.వి.కుమార్, ముఖ్య అతిథి అన్నవరం దేవేందర్, ఆవిష్కర్త నగునూరి శేఖర్, పుస్తక పరిచయం తోట నిర్మలా రాణి. అతిథులుగా కొండి మల్లారెడ్డి, కల్వకుంట్ల రామకృష్ణ, కందుకూరి అంజయ్య తదితరులు పాల్గొంటారు.

సి. వి. కుమార్

'ముందడుగు' నాటక ప్రదర్శన

రసరంజని ఆధ్వర్యంలో సమాహార థియేటర్ గ్రూప్ సమర్పణలో వాసిరెడ్డి భాస్కర రావు, సుంకర సత్యనారాయణ 1945లో రాసిన 'ముందడుగు' నాటకం ప్రదర్శన రత్నశేఖర్ దర్శకత్వంలో ఆగస్టు 25 సా.6.45ని.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సంగీతం వంశీమోహన్, రైటింగ్ కావలి రాజశేఖర్, సెట్స్ సురభి జయవర్ధన, మేకప్ బాబూ రావు సంస్థ, స్టేజ్ మేనేజర్లు మాధవ్ రెడ్డి, భార్గవ్ కళ్యాణ్.

రసరంజని

మునిపల్లె శతజయంతి సదస్సు


సాహిత్య అకాడమీ నిర్వహణలో మునిపల్లె రాజు శత జయంతి సదస్సు ఆగస్టు 30 ఉ.10 గం.టల నుంచి ఎస్.వి.కె.పి & డా. కె.యస్. రాజు ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్, పెనుగొండ, పశ్చిమగోదావరి జిల్లాలో జరుగుతుంది. కె. శ్రీనివాసరావు, సి. మృణాళిని, చినవీరభద్రుడు, వై.వి.వి. అప్పారావు, టి. నాగిరెడ్డి, కె. లక్ష్మీప్రసన్న, కలిదిండి రామచంద్ర రాజు, వి. లవకుమార్ తదితరులు పాల్గొంటారు. ఉష మునిపల్లె, రంకిరెడ్డి రామ మోహన రావు, కానుకొల్లు బాలకృష్ణ, కాకుమాని శ్రీనివాసరావు, బిహెచ్‌వి రమాదేవి పత్ర సమర్పణ చేస్తారు.

సి. మృణాళిని

'దాపు' కవిత్వ సంపుటి

సృజన సాహితి ఆధ్వర్యంలో మునాసు వెంకట్ కవిత్వ సంపుటి 'దాపు' ఆవిష్కరణ ఆగస్టు 31 ఉ.10గం.లకు నల్లగొండలో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా ఆయన నివాసంలో జరుగుతుంది. సభాధ్యక్షులు బెల్లి యాదయ్య, విశిష్ట అతిథి గోరటి వెంకన్న, గౌరవ అతిథి అంబటి సురేందర్ రాజు, ప్రత్యేక ఆహ్వానితులు గుంటూరు లక్ష్మీనరసయ్య, ఆత్మీయ అతిథులు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సిద్ధార్థ తదితరులు.

పెరుమాళ్ళ ఆనంద్



మీరెప్పుడైనా గమనించారా
ఖాళీ చేసిన ఇంటి గోడలు మాట్లాడుకోవటం
క్రీస్తులా గుండెల్లో దిగేసిన మేకుల బాధలతో
మనుషుల జ్ఞాపకాల ఊసులు మోసిన భావాలతో
మౌనగళాలు విప్పి నిశ్శబ్ద భాషలో చర్చించుకోవటం
నిన్నటి కళాకాంతుల కొట్టాడై ధగధగలాడిన
కుడ్య వదనాలు నిర్జీవ శవకళతో మూగరోదనైన సందర్భాలు
చాకలిపద్దుల వివరాలతో
పాలవాడి గైర్హాజరు తేదీలతో
ఇంటి ఇల్లాలికి జవాబుదారీగా ఉన్న రోజులు
ఎంత బాధ్యతని చిరునవ్వుతో మోశాయో!

దేవుడి పటాలను తమకు వారగా ఆనించి
మంత్రోచ్ఛారణలతో ధూపదీప నైవేద్యాలతో చేసిన పూజలు
గోడలకు వేలాడ దీసిన తాత ముత్తాతల జ్ఞాపకాలు
ఇల్లు ఖాళీ చేసినంత సులువుగా మర్చిపోగలవేనా ఆ స్మృతులు
బుడిబుడి అడుగుల హంసలు
రంగుల చాక్‌పీసులతో
తమ ఒంటి నిండా చేసిన సంతకాలన్నీ
తమని అజంతా ఎల్లోరా గుహల కోవలో నిలబెట్టి
గర్వంగా తలెత్తుకునేలా చేసిన అమృత గడియలు.

ఏ గోడైతే యేంటి మిత్రమా!
కోటగోడైనా, ఇంటి గోడైనా
మనిషి తలదాచుకున్న చరిత్రకి ఆనవాలే కదా!
తాజ్‌మహలు గోడలు ప్రేమ ప్రతీకలైతే
ఇంటి గోడలు వాత్సల్యోద్వేగాల అనురాగ గీతికలే కదా!
గోడలంటే తట్టెడు రాళ్ల దోసెడు సిమెంట్ మాత్రమే కాదు
నాలుగు గోడలు తమ నెత్తి మీద ఒక కప్పుని మోస్తూ
అమ్మ మాయ తిత్తిలో
కలల నెలవంకని కాపాడినంత ఆప్యాయంగా
ఇంటిల్లిపాదినీ కాపాడే సైనిక శిబిరం
కూలిపోయిన మొండిగోడలైనా
మానవ జీవన యాన మహాయాత్రకి మౌనసాక్షి
మనిషిని కాపలా కుక్కలా రక్షించిన అహింసాయుధం
నాగరికతని చాటిచెప్పిన ఇళ్ళూ మహళ్ళూ భవనాలే లేకపోతే
ఈ భువన భాండమంతా నరసంచార కీకారణ్యమే కదా!
చీని చీనాంబరాలే కాదు,
చుట్టూ సరిహద్దు గోడే చైనా ప్రజానీక రక్షణ వ్యూహం
నిన్నగాక మొన్న కూల్చేసిన బెర్లిన్ గోడే కదా
మనుషులందరి మనసుల్ని కలిపి కుట్టిన పూలమాల
స్వాతంత్ర్య సమరోద్యమ స్ఫూర్తి ప్రదాతలు
ఊరూరా నిప్పు రవ్వల్ని రాజేసిన పత్రికల్ని
జెండాలా మోసిన గోడలు
చీకటి చెరువులో కలిసిపోయిన నీలి గోడల వెలుతురు నీడ
మొండి గోడలే కదా
చరిత్ర వీధుల్లో విరాజిల్లిన చేతి వెన్నముద్దలు.

అనుకునే వాళ్ళు అనుకోవచ్చు కానీ
ఇల్లు ఖాళీ చేసి సొంత ఇంటికి చేరామని
అక్కడైనా తమ చరిత్రను వేలాడదీయాల్సింది గోడల పైనే కదా.

■ **ఈతకోట సుబ్బారావు**
✆ 94405 29785

మా అనంతపురం సోక్రటీసు!


'అడవిలో ఒక పేరు లేని పూవు అయి రాలిపోతాను' అని శ్రీశ్రీ గారి ఖడ్గ సృష్టిలో చదివిన గుర్తు. మంచిరెడ్డి శివరామ్ రెడ్డి అస్తమించిన వార్త వినినప్పుడు నాకు ఈ కవితావాక్యమే గుర్తుకువచ్చింది. అతడు ప్రముఖ విద్యావేత్త. సామాజిక తత్వవేత్త. STEP ఉద్యమ నిర్మాత. యాభై ఏండ్ల క్రితం ఒకటి రెండు తరాలకు తప్ప అతడు ఎవరికీ తెలియదు. కానీ అనంతపురం జిల్లా గ్రంథాలయానికి తెలుసు. ఆ గ్రంథాలయం ఆవరణలోని వేపచెట్టుకు తెలుసు. శిరీష వృక్షానికి తెలుసు. లలితకళాపరిషత్‌కు తెలుసు. క్లాక్ టవర్‌కు తెలుసు. అనంతపురం భౌతిక వాతావరణం నిండా సూదీదారంలా అల్లుకుపోయినవాడు. చెప్పులు లేని పాదాలతో, మాసిన గడ్డంతో, అడ్డపంచ పైన పొడుగాటి ముతక లాల్చీతో గబగబా నడుస్తూ తారసపడేవాడు. మిత్రుల భుజాలమీద ఆప్యాయంగా చేయి వేసేవాడు. లేదా వారి రెండు చేతులూ దోసిట్లోకి తీసుకుని, సంతోషంతో ఒత్తుతూ వుండేవాడు. సోక్రటీసు; సంతలో తాత్విక చర్చలు జరిపినట్లు ఏదో ఒక కాకా హోటల్లో కూర్చుని, మిత్రులతో సంభాషించేవాడు. జిడ్డు కృష్ణమూర్తి, రమణ మహర్షి వంటి వారు చర్చకు వచ్చేవారు. ఉన్నట్లుండీ "వేర్ రిలెటివిటీ స్టాప్స్, దేర్ అద్వైత బిగిన్స్" వంటి మాటలు దొరలి, వాతావరణాన్ని ఉత్తేజపరిచేవి. మిత్రులు ఎవరు ఏ పుస్తకాలు కొత్తగా చదివినారో విచారించేవాడు. కొత్తగా ఏ కవిత్వం, ఏ కథ రాసినారో తెలుసుకుని, వినిపించమని కోరేవాడు. "కాసరమా వికారముల్ రాల్చకు" అంటూ వెర్రి కాదిది, సర్రియలిజం సోదరా.. అని బోధించేవాడు. స్ట్రీమ్ ఆఫ్ కాన్షస్‌నెస్ పలవరించేవాడు.

స్నేహితుడు దక్షిణామూర్తిది వెన్నెల క్లినిక్ వుండేది. ఒకరోజు రాత్రి క్లినిక్‌లో కూర్చోబెట్టి పేపరు, పెన్ను చేతికి ఇచ్చి, "బుర్రలోకి వచ్చిన ఆలోచనలన్నీ రాయి!" అన్నాడు. పది నిమిషాల తర్వాత నా ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసినాడు. రాసినది ఎట్లుందోయేమోకానీ, ఏదో థెరపీ ఇచ్చినట్లు నా మనసంతా నిశ్శబ్దం ఆవరించి, ధ్యానానుభూతి కలిగింది.

వేయిపడగలులో పసరిక గురించి, మాలపల్లిలో తక్కెళ్ల జగ్గడు గురించి ప్రస్తావించేవాడు. ఆయన సమక్షం తాత్విక సాహిత్య చర్చలతో విద్యున్మయమై ఆవరించేది. అప్పటికి మా మిత్రులమంతా ఆయన కంటే ఒక తరం చిన్నవాళ్లం. ఆయన చెప్పే సంగతులన్నీ చాలా సీరియస్‌గా వినేవాళ్లం.

గ్రంథాలయ ఆవరణలో వేపచెట్టు కింద అతడి చుట్టూ చేరినవారిలో కవులు, రచయితలు వుండేవారు. రాయుడు, బద్వేలి రమేష్, కైలాస్, మల్లెల నరసింహమూర్తి, ఎక్కలూరి శ్రీరాములు, చిలుకూరి దేవపుత్ర, బండి నారాయణ స్వామి, రమణ జీవి, ఖాదర్ బాషా, పద్మనాభయ్య, దక్షిణామూర్తి, బోసు, రఘుబాబు వంటి పదీ పదిహేను మంది చేరేవారు. డెబ్భయ్యవ దశకంలో అనంతపురం సాంస్కృతిక వాతావరణం అంతా పద్యమయమే. పండితులు వచనకవిత్వ ప్రక్రియను వెక్కిరిస్తున్న రోజులు. కుందుర్తి; వచనకవిత్వాన్ని భుజాలకెత్తుకున్న రోజులు. "కుక్కలు దొంతలు పడగొట్టగలవు గానీ, పేర్చగలవా?" అని పండితోత్తములు మర్మగర్భంగా మాట్లాడుతున్న మాటలు. ఒక దినం పద్యానికీ, వచనానికీ మధ్య యుద్ధానికి అన్నట్లుగా వేదిక కూడా తయారయింది. అంతకు రెండు రోజుల ముందు తన యువ కవుల సైన్యంతో శివరామ్ సారు శిక్షణా శిబిరాన్ని నిర్వహించినాడు – "గ్రీకులు ఉపన్యాసాన్ని డైలాగ్ అంటారు. ఆ కళను ఎట్ల సాధింపవలె? గొణుగుతున్నట్లు చదివితే అది కవిత్వమా? చేతిలో పేపరు లేకుండా కవిత్వాన్ని గానం చేయండి. కవిత్వాన్ని భాషించండి," అన్నాడు.

ఆ దినం లలితకళాపరిషత్ బయలులో ఇసుక వేస్తే రాలనంత జనం. అష్టావధానాలు, వారికి దండలు, శాలువాలు, సన్మానాలు ముగిసినాయి.



శివరామ్ రెడ్డి అనంతపురంలో మొట్టమొదటి లిటరరీ యాక్టివిస్టు. కొలకలూరి ఇనాక్, సింగమనేని నారాయణ గార్ల కంటే ముందు అనంతపురం వాతావరణంలో ఆధునిక సాహిత్యానికి దారులు ఏర్పరిచినవాడు. యువకవుల ప్రతిభను ఛానలైజ్ చేసినవాడు. సమాజంలో దుష్టవిలువలను దండించినవాడు. ఫాల్స్ ప్రిస్టేజ్‌ను అధిగమించినవాడు.

ఆ తరువాత యువకవులు చెలరేగిపోయినారు. ప్రేక్షకుల చప్పట్లు, ఈలల మధ్య వచన కవిత్వాన్ని గద్దెనెక్కించినారు. స్వాంతంత్ర్యానంతరం మొలుచుకొచ్చిన కొత్త తరం కవుల సందోహం ఒక మహావృక్షమై, తెలుగు సాహిత్యాన్ని పరిపాలించబోతున్న సంకేతం అది. ఇదంతా చూసి, పెద్దాయన తిరుమల రామచంద్ర (హంపీ నుండి హరప్పాదాక) ముగ్ధులైన ఘడియ కూడా అది.

"మేము చేయవలసిన పని మీరు చేసినారు. ఇది చరిత్ర. అనంతపురం సాంస్కృతిక వాతావరణంలో ఒక పెద్ద కుదుపు" అన్నారు కమ్యూనిస్టు మిత్రులు. ఈ సాహిత్య సందర్భాన్ని మొత్తం భుజానవేసుకుని నడిపించినవాడు శివరామ్ సారు. అతడు అనంతపురంలో మొట్టమొదటి లిటరరీ యాక్టివిస్టు. కొలకలూరి ఇనాక్, సింగమనేని నారాయణ గార్లకంటే ముందు అనంతపురం వాతావరణంలో ఆధునిక సాహిత్యానికి దారులు ఏర్పరిచినవాడు. యువకవుల ప్రతిభను ఛానలైజ్ చేసినవాడు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వైపు మిత్రులను ఉన్ముఖీకరణ చేసినవాడు. సమాజంలో దుష్టవిలువలను దండించినవాడు. చలం జీవితాన్ని శ్లాఘించినవాడు. ఫాల్స్ ప్రిస్టేజ్‌ను అధిగమించినవాడు.

ఉత్తరాంధ్రలో సాయుధపోరాటం జరుగుతున్న రోజులవి. పంచాది నిర్మల గురించి చెప్పేవాడు. సుబ్బారావు పాణిగ్రాహి కట్టిన పాటలను గుండెకు హత్తుకునేవాడు. ఈ సాయుధపోరాటం మా భూమి సినిమాగా రిలీజ్ అయింది. బయట నుండి తన వంతుగా ఏదో ఒకటి చేయకుండా వుండలేకపోయినాడు. "ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా..." అని పాటల రికార్డు మోగుతుండగా 'మా భూమి' సినిమా బండి బజారులో వస్తూవుంది. శివరామ్ సారు, బండి ముందు గుంపులో కలిసిపోయి ఆ సినిమా pamphlets పంచడం మొదలుపెట్టినాడు.

"సమాజం మన మైండును కండీషన్ చేస్తుంది. బీ కేర్‌ఫుల్" అని హెచ్చరించేవాడు. "సీ సర్, సీ.. మీ మైండ్ ఏమి ఆలోచిస్తోందో గమనించండి" అనేవాడు.

"నేను, నా మైండు.. అంటూ రెండు నేనులు వున్నాయా?"

"చూసేవాడు, చూడబడేది రెండూ ఒకటే సర్" అనేవాడు.


జిడ్డు కృష్ణమూర్తి, రమణ మహర్షి, అరబిందోలను అనంతపురం సాంస్కృతిక వాతావరణానికి దగ్గర చేసినవాడు. బయలు తత్వం, అచల యోగం.. అంటూ అధ్యాత్మికానికి జానపదుల గొంతును తొడిగేవాడు. పక్షులు, పువ్వులు, పసిపాపల మధ్య జీవనకళ వెదుక్కునేవాడు.

కొబ్బరాకులు వెన్నెలను చెరిగినట్లు.. అన్న కవితాత్మక వాక్యాలతో అతడి వచన రచనలు నిండిపోయేవి. ఒక్కొక్క రచననూ మిత్రులకు చదివి వినిపించి, ఆ తర్వాత వాటిని చించి చెత్తబుట్టలో పడవేసేవాడు. అతడు కవి, రచయిత. "రాసిన తరువాత అది మనది కాదు" అనేవాడు. రాసిన దాన్ని దేనినీ ఓన్ చేసుకునేవాడు కాడు. ఆయన మిత్రుల మధ్య ఎంత సౌమ్యుడో, సత్యాన్వేషణలో అంత నిర్మొహమాటి. తాను మాట్లాడవలసినది మాట్లాడతాడు. ఎదిరించవలసిన చోట ఎదిరిస్తాడు. సభ అనికూడా లెక్కచేయడు. నిలదీస్తాడు, అరుస్తాడు, కేకలు వేస్తాడు. ఎంత పద్ధతిగా వుండగలడో, అంత అరాచకంగానూ వుండగలడు. ఆయన్ను గురువుగా సంబోధించినవాడు బతికిబట్టకట్టేనా? శివనామ్ సారు గుర్తుకువచ్చినప్పుడల్లా అనంతపురం స్నేహితులు; "నో గురు.. నో టీచర్.." అని వార్నింగులు ఇచ్చుకుంటారు. అతడిని అనంతపురం మరువదు. శివరామ్ సారు ఇక లేరు.

భారతి పత్రిక ఆగిపోతే, ఆ ఆగిపోయిన పత్రికకు సంస్మరణ సభ జరిపింది ఎవరు? గ్రంథాలయ ఆవరణలో వంద సంవత్సరాల వయసు గల ఆ శిరీష వృక్షాన్ని నరికివేసినప్పుడు దానికి సంతాపసభ జరిపింది ఎవరు?

ఆ జీవన నాట్యం ఇప్పుడు లేదు.
ఆ జీవనోత్తేజం ఇప్పుడు లేదు.
ఆ జీవనకళ ఇప్పుడు లేదు.
మా శివరామ్ సారు ఇక లేరు.

■ **బండి నారాయణ స్వామి**
✆ 88865 40990



మనిద్దరం

పేరుకే మనిద్దరం
సమాంతర రేఖల్లా సాగిపోతూ
విడివిడిగా విరిగిపోతూ

మన గదిలో
అనుబంధాల ఊయలలుండవు
ఎప్పటికప్పుడు
దళసరెక్కుతున్న
పల్చని గోడలు తప్ప
వెతికినా వెలుతురుండదు
మబ్బులా కమ్మేసిన
చీకటి తప్ప

నీదొక ఇటుక ముక్క
నాదొక ఇసుక రేణువు కలగలిపి
ఒక నిలువెత్తు నిశ్శబ్దాన్ని నిర్మించాం


లోపల ఎగిరే రంగుల సీతాకోకలను
పెరిగిన పరిమళాల పూలతోటలను
నెమ్మది నెమ్మదిగా
తెలియకుండానే చిదిమేసాం
యవ్వనోత్సాహ కలలను
కాలం కొలిమిలో
బూడిద చేసాం

మన
ఉదయాలు సాయంత్రాలు
పరుగులో కరిగిపోయాయి
అలసటలో ఆరిపోయాయి

దేహాల రాపిడికి
రాలిపడ్డ పసిమొలకకు మాత్రం
నువ్వు కాస్త నీరు తాగిస్తే
నేను కొంత ఎరువు అందిస్తూ

ఈ ప్రయాణం
ఎటు పోతోందో
నీకూ నాకూ తెలీదు
తెలిసిందల్లా
ప్రపంచం ఎదుట
అందమైన ముసుగులతో
ప్రదర్శనలివ్వడమే

■ **పద్మావతి రాంభక్త**
✆ 99663 07777



టెండర్ జామ్



గుంటూరుతో పాటు విజయవాడ నగరాల్లో రోడ్ల అభివృద్ధికి పిలిచిన టెండర్ల ఖరారు విషయంలో సీఆర్‌డీఏ అధికారులు అంతులేని తాత్సారం చేస్తున్నారు. రెండు నగరాల్లో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నా అధికారులకు పట్టడంలేదు. యుద్ధ ప్రాతిపదికన విస్తరణ పనులు చేపట్టాల్సి ఉన్నా టెండర్లు పిలిచి.. ఖరారు చేయకుండా గడువుల మీద గడువులు పొడిగించుకుంటూ పోతుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరులో ఇన్నర్‌రింగ్ రోడ్డు ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉంది. నగరంలోని ట్రాఫిక్‌ను అవుటర్‌లోకి మళ్లించడానికి ఇన్నర్ ఫేజ్-3 పనులు అవసరమని ప్రభుత్వం నిర్ణయించింది.



- రోడ్ల పనుల ఖరారులో సీఆర్‌డీఏ తాత్సారం
- ఇన్నర్‌రింగ్ రోడ్డు ఫేజ్- 3కి ఆరు సంస్థలు పోటీ
- టెక్నికల్ బిడ్లు తెరవకుండా గడువులు పొడిగింపు

(ఆంధ్రజ్యోతి, గుంటూరు)

ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్-3లో జేకేసీ కాలేజీ (స్వర్ణ భారతి నగర్) నుంచి పెదపలకలూరు వరకు చేపట్టాల్సిన పనులకు రూ.34.87 కోట్లతో టెండర్లు పిలిచారు. ఆగస్టు 7తో బిడ్ల సమర్పణకు తుది గడువుగా నిర్ణయించారు. అదే రోజు సాయంత్రం టెక్నికల్ బిడ్లను ఓపెన్ చేశారు. ఆరు సంస్థలు టెండర్లు వేశాయి. వీటిలో యాబీఎస్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్, ఎన్‌సీసీ లిమిటెడ్, భవానీ కన్ స్ట్రక్షన్స్, బీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, (మిగతా 6వ పేజీలో)

ప్రీ బిడ్ మీటింగ్ పేరుతో పొడిగింపు

విజయవాడ రూరల్, అర్బన్ పరిధిలో చేపట్టాల్సిన రోడ్లకు సంబంధించి రూ.75.04 కోట్ల వ్యయంతో టెండర్లు పిలిచారు. టెండర్లను ఆగస్టు 11 తుది గడువుగా నిర్ణయించారు. అదే రోజున టెక్నికల్ బిడ్లను తెరవాల్సి ఉంది. కానీ, సీఆర్‌డీఏ అధికారులు ఆగస్టు 29వ తేదీకి గడువు పొడిగించారు. ఇలా గడువులు ఎందుకు పొడిగిస్తున్నారో కాంట్రాక్టర్లకు కూడా అర్థం కాక సీఆర్‌డీఏ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.



స్తంభాలగరువు పార్కులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, పక్కన ఎమ్మెల్యే మాధవి

తెలుగు నేల గర్వపడేలా చేసిన ఎన్టీఆర్

- గుంటూరును ప్రథమ స్థానంలో నిలుపుతాను
- విగ్రహావిష్కరణలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు నేల గర్వపడేలా... తెలుగుబిడ్డ తల ఎత్తుకునేలా.. విద్యావంతులైన సామాన్యులకు రాజకీయ పాఠాలు నేర్పిన తెలుగు సింహం ఎన్టీఆర్ అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక స్తంభాలగరువు పార్కులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ పేదల కోసం పుట్టిన సిద్ధాంతం.. ఢిల్లీ పీఠాన్ని కుదిపేసిన ధర్మపీటం.. ఎన్టీఆర్ ఆలోచనా రూపమే తెలుగుదేశం అని అన్నారు. దేశంలోనే గుంటూరును నంబరు 1 పార్లమెంట్‌గా చేయడానికి కష్టపడి పని చేస్తున్నామన్నారు. కొత్త రఘురామయ్య తర్వాత ఈ ప్రాంతానికి మళ్లీ తన రూపంలో కేంద్ర మంత్రి పదవి వచ్చిందని పెమ్మసాని చెప్పారు. శంకర్‌విలాస్ ఆర్వోబీ, ఎక్కడ చూసినా రైల్వేగేట్లు, ఇన్నర్ రింగురోడ్డులో ట్రాఫిక్ సమస్య, జీజీహెచ్‌లో అందని వైద్యం, కాల్వల్లో చెత్త, గుంతల రోడ్లు ఇలాంటి సమస్యలతో గుంటూరు తనకు స్వాగతం పలికిందన్నారు. ఈ పరిస్థితుల్లో నగరంలో అన్ని బ్రిడ్జిలను మంజూరు చేయించానని, మూడేళ్లలో వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఉండాలి

విగ్రహాల ఏర్పాటు నేడు కులాలు, రాజకీయ పార్టీల మధ్య పోరాటంలా తయారైందన్నారు. ప్రతీ 500 గజాలకు ఒక విగ్రహం వెలుస్తున్నది. దీనికి అన్ని పార్టీలు స్వస్తి చెప్పాలన్నారు. నడిరోడ్డులో విగ్రహాల వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. ఏ పార్టీ వారిని అయినా ట్రాఫిక్‌కి ఇబ్బంది కలిగేలా విగ్రహాలు పెట్టనీయొద్దని నగరపాలకసంస్థ కమిషనర్‌కు సూచిస్తున్నానన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని రోడ్డుకు అడ్డం లేకుండా పక్కన స్థలంలో ఏర్పాటు చేశారని హన్మంతరావు, కమిటీ సభ్యులను పెమ్మసాని అభినందించారు. అభివృద్ధి జరుగుతున్న తరుణంలో రోడ్ల మధ్య ఉన్న చర్చిలు, దేవాలయాలు, మసీదులు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ, నిమ్మల శేషయ్య, విగ్రహ కమిటీ హన్మంతరావు, పంచుమర్తి కోటేశ్వరరావు, టీడీపీ నాయకుడు తాళ్ల వెంకటేష్ యాదవ్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సజీల పాల్గొన్నారు. .

రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి తొలగింపు ఎలా?

- బ్రిడ్జి దిగువన హైటెన్షన్ విద్యుత్ లైన్లు
- శిథిలాలు పడితే ట్రాక్ దెబ్బతినే అవకాశం
- ఇప్పటికే జీజీహెచ్ వైపున కూలిన ఓ ఖానా శ్లాబు

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరం లోని శంకర్‌విలాస్ పాత ఆర్‌వోబీ తొలగింపులో అసలు సిసలైన సమస్య ఇప్పుడు నిర్మాణ సంస్థకు ఎదురైంది. ఇప్పటివరకు రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా (అరండల్‌పేట, జీజీహెచ్) వైపున రీయిన్‌ఫోర్స్ మెంట్ గోడ వరకు అవలీలగానే బ్రిడ్జిని తొలగించారు. ఇరువైపులా రైల్వే సరిహద్దు వరకు వచ్చి బ్రిడ్జి తొలగింపు పనులు ఆగిపోయాయి. రైల్వేస్టేషన్ వైపు నుంచి జీజీహెచ్ వైపున రీయిన్‌ఫోర్స్‌మెంట్ వాల్ చివరి భాగం తొలగించేటప్పుడు ఒక ఖానా శ్లాబు కిందపడింది. ఈ దృష్ట్యా రైల్వే భాగంలో పాత బ్రిడ్జి పిల్లర్లు, శ్లాబులను తొలిగించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇప్పటివరకు రైల్వేబోర్డు నుంచి ఎలాంటి అనుమతులు కానీ, గుం టూరు - నల్లపాడు మార్గంలో బ్రేక్‌డౌన్ మంజూరు కాలేదు. దీంతో ప్రస్తుతం తొలిగించిన భాగం వరకే పిల్లర్లు నిర్మించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యం గా రైల్వే హైటెన్షన్ విద్యుత్ లేన్లు ఉన్నాయి. వాటిని కచ్చితంగా తొలగించాల్సిందే. అలానే కూల్చేటప్పుడు శిథిలాలు పట్టాలపై పడకుండా తాత్కాలికంగా ఏర్పాట్లు చేసుకోవాలి. లేదంటే రైల్వే యార్డు అంతా ధ్వంసమౌ తుంది. దానిని పునరుద్ధరించాలంటే రూ.కోట్ల నిధులుతో పాటు ఎక్కువ సమయం పడుతుంది. ఈ నేపథ్యం లో ప్రత్యేక యంత్ర సామగ్రిని వినియోగించాలి. ఇప్పటి వరకు రైల్వేభాగంలో బ్రిడ్జి తొలగింపునకు సంబంధించి కాంట్రాక్టర్ ఎలాంటి ప్లాన్ విడుదల చేయలేదు. ప్లాన్ వచ్చిన తర్వాతనే అందుకు అనుగుణంగా రైల్వే శాఖ చర్యలు చేపడుతుంది.



కుప్పకూలిన బ్రిడ్జి ఖానా శ్లాబు



బ్రిడ్జి రైల్వే భాగం

బ్రేక్‌డౌన్‌తో రైళ్ల రాకపోకలపై ప్రభావం

గుంటూరు నుంచి నిత్యం నడికుడి, నంద్యాల మార్గంలో 60కి పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. దూరప్రాంత రైళ్లను ఎట్టి పరిస్థితుల్లో రద్దు చేసేందుకు రైల్వేబోర్డు అంగీకరించదు. కొన్ని గంటల పాటు క్రమబద్ధీకరించడం/దారి మళ్లించి నడపడానికే అనుమతిస్తుంది. కేవలం మాచర్ల - గుంటూరు మధ్య ప్రయాణించే రైళ్లను మాత్రమే రద్దు చేసేందుకు అవకాశం కల్పిస్తుంది. బ్రేక్‌డౌన్ ఇచ్చినా రెండు, మూడు రోజులకు మించి రైల్వేబోర్డు సమయం ఇవ్వదు. ఈ దృష్ట్యా పకడ్బందీ ప్రణాళికతో బ్రిడ్జిని తొలగించాలి. లేకుంటే రోజుల తరబడి రైళ్ల రాకపోకలు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులు పడే ప్రమాదం పొంచి ఉంది.

జిల్లా అధ్యక్ష పదవికి.. పోటాపోటీ

గుంటూరులో త్రీమెన్ కమిటీ సమావేశం

- సమావేశానంతరం ఆశావహులతో కమిటీ భేటీ
- ఎంపికలో సామాజిక న్యాయం, సమర్థతకే పెద్దపీట

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో గుంటూరు పార్లమెంటు (జిల్లా) అధ్యక్ష పదవికి ఈసారి గట్టి పోటీ నెలకొంది. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం త్రీమెన్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా నేతలు, ప్రజాప్రతినిధులతో మైనార్టీ సంక్షేమ శాఖామంత్రి ఎన్ఎండీ ఫరూక్ నేతృత్వంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, విజయనగరం జిల్లా జీడీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున నేతృత్వంలోని త్రీమెన్ కమిటీ సమావేశమైంది. పార్లమెంటు, అనుబంధ కమిటీల ఏర్పాటు గురించి త్రీమెన్ కమిటీ స్థానిక నేతలు, ఎమ్మెల్యేలతో సుదీర్ఘంగా చర్చించింది. అనంతరం పార్టీ పార్లమెంటు కమిటీ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న ఆశావహులు పలువురు కమిటీ సభ్యులను కలిసి తమ అభ్యర్థనను తెలియజేశారు. జిల్లా అధ్యక్ష పదవికి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కమిటీకి టీడీపీ రాష్ట్ర స్థాయి నాయకత్వ శిక్షణా కేంద్రం (జీపీఎన్) డైరెక్టర్ దాసరి రాజామాస్టారు కోరారు. ప్రజా వైద్యశాల నిర్వాహకుడు నిమ్మల శేషయ్య, తాడిశెట్టి మురళీమోహన్, తాళ్ల వెంకటేష్ యాదవ్‌లు కమిటీ సభ్యులతో విడివిడిగా భేటీ అయ్యారు. మద్దిరాల మ్యాని, వాసిరెడ్డి జయరామయ్య, పోతినేని శ్రీనివాసరావు, రావిపాటి సాయి త్రీమెన్ కమిటీ వద్ద తమ ఆసక్తిని వ్యక్తపరిచారు. మంత్రి నారా లోకేశ్ బీసీ ప్రాబల్యం ఉన్న నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నేపథ్యంలో ఈ సారి అధ్యక్ష పదవి బీసీలకు దక్కుతుందనే ఊహాగానాల నేపథ్యంలో, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేరు అధ్యక్ష రేసులో వినిపిస్తోంది. అయితే ఇప్పటివరకూ ఎస్సీ సామాజిక వర్గం నుంచి తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్ష పదవిలో ఉన్న నేపథ్యంలో ఆ వర్గం వారికి ఎంతమేరకు అవకాశం లభిస్తుందన్నది అనుమానమే. అయితే సామాజిక న్యాయం, సమర్థతలనే పార్టీ అధిష్ఠానం ప్రామాణికంగా తీసుకోనున్నదని సమాచారం.





- గణేశ్ ఉత్సవ కమిటీల నుంచి దోపిడీ
- పేరుకే ఆన్‌లైన్ సింగిల్ విండో విధానం
- ఫోన్లు చేసి పిలిపించుకుని శాఖలవారీగా వసూళ్లు
- ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోదు.. కలవాల్సిందేనని హుకుం

అడిగినంత ఇస్తేనే.. అనుమతి

(తెనాలి - ఆంధ్రజ్యోతి)

పోలీస్: మీరు గణేశుని మండపం పెట్టుకునేందుకు అనుమ తికి దరఖాస్తు చేసుకున్నారు కదా! ఒకసారి స్టేషన్‌కు వచ్చి కలవండి.

కమిటీ: ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోతుందన్నారు కదా! మళ్లీ కలవడం ఎందుకు.

పోలీస్: ఆన్‌లైన్‌లో చేస్తే సరిపోదు.అఫిడవిట్ మేమెళ్లి తెచ్చుకోవాలా? వెంటనే వచ్చి కలిస్తే సరి.. లేకుంటే మీ ఇష్టం.

ఫైర్: హలో.. మేము అగ్నిమాపక కేంద్రం నుంచి ఫోన్ చేస్తున్నాం. ఫైల్ అందింది. వచ్చి తీసుకువెళ్లండి.

కమిటీ: అనుమతి పత్రం ఇస్తారా! తీసుకెళతాం.

ఫైర్: రూ.500 ఇచ్చి తీసుకెళ్లండి.

కమిటీ: అదేంటండీ డీడీ కట్టాం కదా?

ఫైర్: అది కాదు. మాకు ఇవ్వాల్సిన మామూళ్లు ఎవరిస్తారు. పండుగలప్పుడే కదా! మాకూ ఒక రూపాయి వచ్చేది. అవి ఇస్తే మీ కాగితం మీకిస్తాం.

ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని పోలీసు, ఫైర్ అధికారుల తీరు. వినాయక చవితి సమీపిస్తున్న క్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. గతంలో మాదిరిగా పోలీసు, ఫైర్, విద్యుత్ శాఖల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో సింగిల్ విండో విధానంతో తమ కష్టాలు తీరాయని చవితి ఉత్సవ కమిటీలు ఆనందపడ్డాయి. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సరిపోదని తమను వచ్చి కలిసి అడిగినంత ఇస్తేనే అనుమతి అంటూ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఆదేశాలతో గణేష్ ఉత్సవ కమిటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది మామూళ్ల పేరిట పట్టిపీడిస్తున్నారని కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి మరీ ఆయా అధికారులు పిలిపించుకుని దోచేస్తున్నారు. ఒక్కో మండపానికి అనుమతి తీసుకోవడానికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన (మిగతా 6వ పేజీలో)



గణేశ్ విగ్రహ కమిటీల నుంచి తీసుకుంటున్న అఫిడవిట్

అఫిడవిట్ పేరుతో వసూళ్లు

గణేశుని మండపం ఏర్పాటుకు సాధారణంగా పోలీస్ శాఖకు సంబంధించి మైకు అనుమతి కోసం రోజుకు రూ.200 చొప్పున చలానా చెల్లిస్తే సరిపోతుంది. కానీ పోలీసులు అది చాలదంటూ కొత్తగా అఫిడవిట్ సమర్పించాలని షరతులతో వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఈ అఫిడవిట్ కూడా స్టేషన్ల పరిధిలో రెండు, మూడు చోట్ల మాత్రమే తయారు చేయించుకొచ్చేలా షరతులు పెట్టారు. అఫిడవిట్‌కు జ్యుడిషియల్ స్టాంప్, ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. కానీ వీటికి అదనంగా రూ.1500 నుంచి రూ.2500 వరకు చెల్లించాల్సి వస్తుందని, అంతఎందుకంటే పోలీసులకు ఇవ్వాలని చెప్పడం విశేషం. ఒకవేళ మరొకచోట నుంచి అఫిడవిట్ తీసుకువెళ్లితే దానిని తిప్పి పంపుతున్నారు. లేదంటే బహిరంగంగానే స్టేషనరి, తెల్లకాగితాలు, పెన్నుల వంటివి తీసుకురావాలంటున్నారని ఉత్సవ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇంతా చెల్లించినా, నిమజ్జనం రోజున కానిస్టేబుల్‌ను పంపిస్తామని, ఎంతమంది వస్తే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున చెల్లించాలని ముందే చెప్పి పంపుతున్నారని కమిటీల సభ్యులు చెబుతున్నారు. ఫైర్ అధికారులకు రూ. 500 చెల్లిస్తేనే అనుమతి పత్రాన్ని ఇస్తున్నారని లేదంటే తిప్పుకుంటున్నారంటున్నారు. విద్యుత్ వినియోగానికి డీడీ కట్టినా లైన్‌మన్లు వసూళ్ల దందా చేస్తున్నారు. మొత్తంమీద ప్రభుత్వం సదుద్దేశంతో సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్ అను మతికి అవకాశం కల్పిస్తే, అధికారులు దోపిడీ మాత్రం ఆగటం లేదు.

ప్రాణాలు హరించే..
కలుపు మందు స్వాధీనం
- పార్సిల్ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు

ఎంబీబీఎస్ అడ్మిషన్స్‌లో..
బీసీడీ అభ్యర్థులకు అత్యధిక సీట్లు

గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

6

స్మార్ట్ కార్డులకు.. ముహూర్తం ఖరారు

ఎక్కడికక్కడ పంపిణీకి అధికారుల ఏర్పాట్లు

- రెండో దశలో గుంటూరు జిల్లాలో 30 నుంచి
- నాలుగో దశలో పల్నాడు, బాపట్లలో వచ్చే నెల 15..

సత్తెనపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నం, కుటుంబ పెద్ద ఫొటో, కార్డు నెంబరు, షాపు ఐడీ నెంబరు, క్యూఆర్ కోడ్, కుటుంబసభ్యుల వివరాలుతో ఏటీఎం తరహాలో రూపొందించిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత తీసుకు రావడంలో భాగంగా స్మార్ట్ కార్డులను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను డీలర్ల వద్ద ఉన్న ఈ పోసు యంత్రంతో స్కాన్ చేస్తే లబ్ధిదారుల వివరాలతో పాటు, సరుకుల వినియోగ సమాచారం కూడా తెలుసుకోవచ్చు. ఇలా సరికొత్త టెక్నాలజీతో రూపొందించిన స్మార్ట్ కార్డులను అందుకునేందుకు కార్డుదారులు కూడా ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో స్మార్ట్ కార్డుల పంపిణీని రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు దశల్లో చేపడుతుండగా గుంటూరు జిల్లాలో రెండో దశలో ఈ నెల 30న ప్రారంభించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. దీంతో జిల్లాలో 5.85 లక్షల (మిగతా 6వ పేజీలో)



సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నాహాలు

క్యాడర్ల వారీగా డీఎస్సీ అర్హులకు సమాచారం • ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1100 పోస్టులు.. 23 కమిటీలు

గుంటూరు(విద్య), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. క్యాడర్ల వారీగా అర్హుల జాబితా విడుదలైన నేపథ్యంలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులపాటు సర్టి ఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయితే ఆదివారం సా యంత్రం వరకు షెడ్యూల్ జారీ కాలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీజీటీ, టీజీటీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ తదితర పది విభాగాల్లో విభాగాల్లో 1100కి పైగా పోస్టులను భర్తీ చేయనున్నారు. క్యాడర్ల వారీగా మెరిట్ కం రోస్టర్ జారీ చేయడంతో పాటు అర్హులకు ఇప్పటికే సమాచారం పంపించారు. పరిశీలన కార్యక్రమం సోమవారం లేదా మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

ప్రత్యేక కమిటీలు

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు మండల స్థాయి నుంచి రీజనల్ స్థాయి వరకు దాదాపు ఉమ్మడి జిల్లాలో 23 కమిటీలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రతీ కమిటీలో ముగ్గురు అధికారు లు ఉంటారు. ఒక్కో కమిటీకి 50 మంది అభ్యర్థులను కేటాయించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. ఈ క్రమంలో ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, గుంటూరు డీఈవో రేణుక, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు ఆదివారం గుంటూరు ఏసీ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన అవసరమైన ట్రయల్ రన్ నిర్వహించారు.



గుంటూరు ఏసీ కళాశాలలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

ప్రాణాలు హరించే..
కలుపు మందు స్వాధీనం

● పార్సిల్ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు


కలుపు మందును పరిశీలిస్తున్న డీఏఓ నాగేశ్వరరావు, ఏడీఏ

గుంటూరు సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అమ్మోనియం సాల్ట్ ఆఫ్ గ్లైపో సెట్. ఇదొక కలుపు మందు. నిలువునా మనిషి ప్రాణాలు తీసేస్తుంది. వాతావరణం కలుషిత పరచి క్యాన్సర్ కారకంగా మారుతుంది. దీని తీవ్రత దృష్ట్యా ఈ మందును రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఆదివారం అధికా రులు మెరుపు దాడులు చేసి ఈ కలుపు మందు విక్రయాల గుట్టు రట్టు చేశారు. నగరంలోని పార్సిల్ కార్యాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించగా.. క్రాంతి ట్రాన్స్ పోర్టులో ఈ నిషేధిత కలుపు మందు పెద్ద మొత్తంలో దొరికింది. తిరుపతి జిల్లా నాయుడుపేటలోని శ్రీనివాస సీడ్స్ నుంచి గుంటూరుకు చెందిన శబరి క్రాప్ కేర్ సైన్స్ పేరుతో దిగుమతి చేసుకున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన మందు అని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. నిల్వలను సీజ్ చేసిచ కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏ డీఏ ఎస్.మోహన్ రావు, పురుగు మందుల ఇన్‌స్పెక్టర్ సుజాత పాల్గొన్నారు.

ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు

● తండ్రి వద్దకు చిన్నారిని చేర్చిన పోలీసులు


అనేక్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై సతీష్

తాడేపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గత శనివారం కూతురుని పుష్కర ఘాట్ మీద కూర్చో బెట్టి కృష్ణా నదిలో దూకి ఆత్మహత్య చేసు కున్న మహిళ కేసులో పోలీసులు కీలక వివరాలు సేకరించారు. తాడేపల్లి ఎస్సై సతీష్ వివరాల మేరకు.. ఎన్టీఆర్ జిల్లా కానూరుకు చెందిన రేటూరి విజయ భారతి(31)కి మతిస్థిమితం సరిగా లేదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తన కూతురు అనేక్య ఏంజిల్‌ను తీసుకొని సీతానగరం వద్దకు వచ్చి కృష్ణా నదిలో దూకిందని పేర్కొన్నారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పాపను తండ్రి నరేష్, తాత ఇమ్మానియేల్‌కి అప్పగించినట్లు తెలిపారు.


మంటలను ఆర్పుతున్న సిబ్బంది

పేలిన ట్రాన్స్‌ఫార్మర్.. 6 కార్లు దగ్ధం

పెదకాకాని, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆటో నగర్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ ఆదివారం పేలింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి పక్కనే ఉన్న ఆరు కార్లు దగ్ధమయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు కొన్ని వాహనాలను అక్కడి నుంచి బయటకు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఎంబీబీఎస్ అడ్మిషన్స్‌లో.. బీసీడీ అభ్యర్థులకు అత్యధిక సీట్లు

గుంటూరు మెడికల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంబీబీఎస్ అడ్మిషన్స్‌లో ఏయూ రీజియన్‌లో మొట్ట మొదటిసారిగా బీసీడీ అభ్యర్థులు ఓసీ అభ్యర్థుల కంటే ఎక్కువ సీట్లు సాధించారు. బీసీడీ అభ్యర్థులు మొత్తం 453 సీట్లు సాధించగా ఓసీ అభ్యర్థులు 447 సీట్లు సాధించారు. బీసీడీ అభ్యర్థులు తమకున్న ఏడు శాతం రిజర్వేషన్లకు అదనంగా ఓపెన్ కాంపిటీషన్లో రెండు రెట్ల కన్నా ఎక్కువ సీట్లు సాధించడం వల్ల ఇది సాధ్యమైంది. రిజర్వేషన్లు పొందే విద్యార్థులు కష్టపడి చదవరు అనే దురాభిప్రాయాన్ని చెరిపివేస్తూ.. బీసీడీ విద్యార్థులు ఆదర్శప్రాయంగా నిలిచినట్లు మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అభినందించారు. ఎంబీబీఎస్ అడ్మిషన్స్‌లో జీవో నంబరు 550ని సక్రమంగా అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



సభలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ఆంజనేయులు

వినుకొండ, ఆగస్టు 24, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్య సేవలు చాలా కీలకమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. నరసరావుపేట రోడ్డులో ఉన్న గంగినేని కల్యాణ మండపంలో ఆదివారం గ్రామీణ వైద్యుల ఐక్య వేదిక సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జీవీ ఆంజనేయులు పాల్గొని, మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పరంగా గ్రామీణ వైద్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద

● 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం శ్రీశైలం నుంచి 4,16,324 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 585.00 అడుగులు ఉంది. ఇది 297.43 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 9,019 , ఎడమ కాలువ ద్వారా 7,518, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,373, 26 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 3,63,714, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 4,16,324 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు వరద ఉధృతి

రెంటచింతల,ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు స్పిల్ వే నుంచి 4,01,905 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. 13 రేడియల్ క్రస్ట్ గేట్లను 4.5 మీటర్లు, 5 గేట్లను 4 మీటర్ల మేర ఎత్తామన్నారు. సాగర్ నుంచి 3,96,478 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తోందని తెలిపారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 74.28 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.820 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుదుత్పత్తి జరగడం లేదన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 34.15 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 3,91,650 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, పది గేట్ల ద్వారా 3,14,088, మొత్తం 3,31,088 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద

తాడేపల్లి టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్ట్, కీసర, మున్నేరు, వెలగలేరు తదితర ప్రధాన వాగుల నుంచి 3,83,916 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 3,65,725 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాల్వకు 10,187, పశ్చిమ డెల్టాకు 8,004 క్యూసెక్కులు వదులుతున్నారు.


నాగార్జున సాగర్ 6 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు


ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

భద్రత ప్రమాణాలపై మాక్ డ్రిల్

● సీడ్ యాక్సెస్ రోడ్డు జల్లెడ పట్టిన పోలీసు బలగాలు

తుళ్లూరు ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డులో భద్రత ప్రమాణాల సమీక్ష కోసం ప్రత్యేక మాక్ డ్రిల్ ఆదివారం నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌లో గుంటూరు జిల్లా భద్రతా విభాగం, ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ సంయుక్తంగా.. వీవీఐపీలు, వీఐపీలు ప్రయాణించే సీడ్ యాక్సెస్ రహదారిలో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచే విధంగా వివిధ భద్రతా చర్యలను అభ్యాసం చేశారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఎస్‌జీ ఎస్పీ భద్రయ్య, జిల్లా అదనపు ఎస్పీలు ఏటీవీ రవి కుమార్, హనుమంతు (ఏఆర్), తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, జిల్లా ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఎస్ఎస్‌జీ బీడీ టీం డీఎస్పీ రామకృష్ణ ఇతర భద్రతా అధికారులు మాక్ డ్రిల్‌ను పరిశీలించారు. ఆధునిక సాంకేతిక భద్రత పరికరాలు, శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలతో మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం నుంచి ఎన్- 9 జంక్షన్ వరకు సీడ్ యాక్సెస్ రోడ్డులోని డివైడర్లు, చెట్ల పొదలు, వంతెనలు, కల్వర్టులు, తూములు తదితర ప్రదేశాలను పూర్తిగా తనిఖీ చేశారు. ఎస్ఎస్‌జీ ఎస్పీ భద్రయ్య మాట్లాడుతూ వీవీఐపీలు, వీఐపీలు ప్రయాణించే సీడ్ యాక్సిస్ రోడ్డులో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా మాక్ డ్రిల్ నిర్వహించామని తెలిపారు. అనుకోని ఘటనలు సంభవించినపుడు భద్రతా సిబ్బంది ఎలా స్పందించాలి.. అనుమానితులు లేదా అనుమానిత వస్తువులు (పేలుడు పదార్థాలు) కనుగొన్నప్పుడు ఏ విధంగా వ్యవహరించాలి అనే అంశాలపై అభ్యాసం చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని మాక్ డ్రిల్స్ నిర్వహించి భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.


మాక్ డ్రిలల్‌లో పాల్గొన్న పోలీసు భద్రతా బలగాలు


జాగిలాలతో రోడ్డులో తనిఖీలు..


భద్రతా సామగ్రితో సిబ్బంది

స్మార్ట్ కార్డులకు.. ముహూర్తం ఖరారు

(5వ పేజీ తరువాయి)

మందికి స్మార్ట్ కార్డులు అందించేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కార్డుల పంపిణీని ప్రారంభిస్తారని సమాచారం. అయితే 30వ తేదీ వరకు మంత్రి షెడ్యూల్ బిజీగా ఉంది. ఈ నెల 31 నుంచి జిల్లాలో కార్డుల పంపిణీ ప్రారంభం అయ్యే అవకాశం కనిపిస్తోంది. నాలుగో దశలో పల్నాడు, బాపట్ల జిల్లాల్లో స్మార్ట్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. పల్నాడులో 6,39,282 మందికి, బాపట్ల జిల్లాలో 4.58 లక్షల మందికి స్మార్ట్ కార్డులను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

కొత్త కార్డుల పంపిణీపై సందిగ్ధం

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో సందిగ్ధం నెలకొంది. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో 5,99,558 రైస్ కార్డులు ఉండగా ప్రభుత్వం 5,85,000 స్మార్ట్ రైస్ కార్డులను అందజేసేందుకు సిద్ధం చేసింది. దీనిని బట్టి కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికి రైస్ కార్డుల జారీ కష్టమనే తెలుస్తోంది. ఇదే పరిస్థితి పల్నాడు, బాపట్లలోనూ నెలకొన్నట్లు సమాచారం.

మూడు దశల్లో యాక్టివేట్..

మొదటి రెండు దశల్లో యాక్టివేట్ ప్రక్రియ అనంతరం స్మార్ట్ కార్డులను రేషన్ డీలర్, సచివాలయ సిబ్బంది కలిసి లబ్ధిదారుకు అందజేస్తారు. మూడో దశలో ఈ-పోస్ యంత్రంలో కార్డును యాక్టివేట్ చేసుకోవాలి. ఈ దశలో కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను ఈ పోస్ మిషన్ ద్వారా స్కాన్ చేసి కార్డు యజమానితో ప్రామాణీకరించాలి. అప్పుడే కార్డు యాక్టివేట్ అవుతుంది. ఇలా మూడు దశల్లో కార్డును యాక్టివేట్ చేసుకోవడం ద్వారా ఈ కార్డు అత్యంత భద్రమైనదని ప్రభుత్వం చెబుతోంది.

అడిగినంత ఇస్తేనే.. అనుమతి

(5వ పేజీ తరువాయి)

మొత్తం కంటే పది రెట్లు అదనంగా మామూళ్ల రూపంలో చెల్లించుకోవాల్సి వస్తోందని సభ్యులు వాపోతున్నారు.

చెప్పేదొకటి... చేస్తున్నదొకటి

బుధవారం చవితి. దీంతో పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా గణేశుని విగ్రహాల ఏర్పాటుకు పందిళ్లు వెలుస్తున్నాయి. మండపాలకు సంబంధించి అనుమతి తప్పనిసరి అని ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు వీలుగా 'గణేశ్ ఉత్సవ్ 2025 ఆన్‌లైన్ పర్మిషన్' పేరుతో ఒక పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో దరఖాస్తుతో పాటు పోలీస్, ఫైర్ వంటివాటికి చెల్లించాల్సిన మొత్తాలను ఆన్‌లైన్‌లో చెల్లించేస్తే సరిపోతుంది. అయితే ఆన్‌లైన్ విధానంతో మామూళ్లురావని భావించిన పోలీసులు, ఫైర్, విద్యుత్ తదితర శాఖల అధికారులు సొంతంగా సరికొత్త షరతులు పెట్టారు. దీంతో ప్రభుత్వం చెప్పినట్లుగా సింగిల్ విండో విధానం జిల్లాలో ఎక్కడా అమలు కావడంలేదు.

30, 31 తేదీల్లో ర్యాంకింగ్ క్యారం టోర్నమెంట్

చిలకలూరిపేట, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ క్లబ్‌లో ఈ నెల 30, 31వ తేదీల్లో ఆంధ్ర రాష్ట్ర రెండవ ర్యాంకింగ్ క్యారం టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర రాష్ట్ర క్యారం సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుక్ జలీల్ ఆదివారం తెలిపారు. నాకౌట్ పద్ధతిలో మొదటి 6 స్థానాలను ఎంపిక చేసి రాష్ట్ర జట్టును ప్రకటిస్తామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

టెండర్ జామ్

(5వ పేజీ తరువాయి)

మాధవి ఇంజనీరింగ్ కన్‌స్ట్రక్షన్స్, శ్రీసాయినాథ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలు బిడ్లను వేశాయి. ఈ సంస్థలు అర్హతల ప్రకారం టెండర్లు వేశాయో లేదో ఏవాల్యుయేషన్ చేశాక.. ఆగస్టు 8న ఫైనాన్షియల్ బిడ్లను తెరవాలి. టెక్నికల్ బిడ్లను తెరిచిన సీఆర్‌డీఏ అధికారులు ఇప్పటి వరకు ఫైనాన్షియల్ బిడ్లను తెరవలేదు. కారణం ఎందుకో చెప్పడంలేదు. టెక్నికల్ బిడ్లను తెరిచారు కాబట్టి ఆరుగురు కాంట్రాక్టర్లు వచ్చారని తెలిసింది. ఒక్క కాంట్రాక్టర్రే టెండర్ వేస్తే వాయిదా వేశారనుకోవచ్చు. ఆరు సంస్థలు పోటీపడినపుడు గడువు పొడిగించాల్సిన అవసరం లేదు. ఫైనాన్షియల్ బిడ్లను తెరిస్తే తక్కువ కోట్ చేసిన కాంట్రాక్టు సంస్థను ఎల్ 1 గా ఎంపిక చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు కూడా ఫైనాన్షియల్ బిడ్లను ఓపెన్ చేయలేదు. దీనిపై కాంట్రాక్టు సంస్థలు భగ్గుమంటున్నాయి. టెండర్లను వేసి టెక్నికల్ బిడ్లను కూడా తెరిచి సాగదీయడంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ఎందుకు ఫైనాన్షియల్ బిడ్లను తెరవడం లేదని ప్రశ్నిస్తుంటే సీఆర్‌డీఏ అధికారులు సమాధానం చెప్పడం లేదని కాంట్రాక్టు సంస్థలు విమర్శిస్తున్నాయి.

చందాల వసూలులో ఘర్షణ.. కత్తితో దాడి


చికిత్స పొందుతున్న వెంకట ప్రసాదు

నూజెండ్ల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవత పోలేరమ్మ ఉత్సవాల నిర్వహణకు చందా వసూలు చేసే విషయంలో ఘర్షణ చోటుచేసుకోవడంతో..ఒకరు కత్తి పోటుకు గురయ్యారు. ఈ ఘటన మండలంలోని పి.అన్నవరంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామ దేవత పోలేరమ్మ ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఇంటికి రూ.500 చొప్పున చందా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ విషయంలో గ్రామ పెద్దలు ఒగ్గు రామ యోగయ్య.. భీమనాదం వెంకట ప్రసాదు, వెంకటేశ్వర్లును చందా డబ్బులు అడగడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. వీరి మధ్య విభేదాలు ఉండటంతో ఘర్షణకు దారి తీసింది. రామయోగయ్య, మనుమడు కొమ్మ గోపీ నాగేశ్వరరావులకు దెబ్బలు తగిలాయి. దీంతో గోపీ నాగేశ్వరరావు కత్తితో భీమనాదం వెంకట ప్రసాదుపై దాడి చేయడంతో తీవ్రంగా రక్త స్రావం జరిగింది. వెంకట ప్రసాదు అన్న వెంకటేశ్వర్లుకు కూడా దెబ్బలు తగిలాయి. వెంకట ప్రసాదును గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు ఘటనా స్థలాన్ని పరిశీలించి, గ్రామంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. వెంకట ప్రసాదు తండ్రి గురవయ్య, కొమ్మ గోపీ నాగేశ్వరరావు ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం నుంచి పడి వ్యక్తి మృతి


మృతి చెందిన ముష్కా శంకర్

రెంటచింతల,ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వాహనం నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం గోలి గ్రామ కూడలిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున వివరాల మేరకు.. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా లక్ష్మీపేట మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన ముష్కా శంకర్(55) పదిహేనుళ్లుగా పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ మైన్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెంటచింతలలో కూరగాయలు, ఇతర సరుకు కొనుగోలు చేసి వెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. అతను గుండెపోటుకు గురైనట్లు అంతా భావిస్తున్నారు. మృతుడికి భార్య లత, ఇద్దరు ఆడపిల్లలు న్నారు. లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ నెల 17న పి.రామయ్య అనే వ్యక్తి అక్కడే బైక్ మీద నుంచి పడి మృతి చెందడం గమనార్హం.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు..

కారంపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. బొల్లాపల్లి మండలం రేమిడిచర్లకు చెందిన రామాంజినాయక్ (31), బాణావత్ బాలాజీ నాయక్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వేపకంపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్తున్నారు. పెదకొదమగుండ్లకు చెందిన పల్లెగుంత అంజి ద్విచక్ర వాహనంపై వస్తూ రామాంజినాయక్ బైకును ఢీకొట్టారు. రామాంజినాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. కారంపూడి ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

పేదల ఆరోగ్య ప్రదాయిని సీఎంఆర్‌ఎఫ్

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ అనేది పేదల ఆరోగ్యప్రదాయినిగా మారి, ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ముగ్గురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే నసీర్ రూ.5 లక్షలు విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతటి అనారోగ్య సమస్య వచ్చినా ఆదుకుంటున్నామని చెప్పారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఏడాది కాలంలో దాతలు, ప్రభుత్వ సహకారంతో అధునాతన వైద్య పరికరాలు సమకూర్చామని తెలిపారు. వివిధ విభాగాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి, పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేస్తున్నామని అన్నారు.

ప్రజాభీష్టం మేరకు జిల్లాల పునర్నిర్మాణం జరగాలి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): భౌగోళిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలతో పాటు ప్రభుత్వ పాలనకు సౌలభ్యంతో జిల్లాల పునర్నిర్మాణం జరగాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు, సీపీఎం కార్యాలయంలో ఆదివారం సామాజిక రాజకీయ, ఉద్యమ నేతలు, కవులు, కళాకారులు, సాహితీ వేత్తలతో జాషువా జిల్లా సాధనకు ఆయన ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డొక్కా మాణిక్యవరప్రసాదు మాట్లాడుతూ జిల్లాల విభజనలో గత ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం గాకుండా చూడాలన్నారు. మహాకవి గుర్రం జాషువా పేరుతో గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు పేరు పెట్టాలన్నారు. ఈ డిమాండ్ సాధనకై జిల్లా, మండల కేంద్రాల్లో సభలు, సమావేశాలుతో పాటు కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. సమగ్ర సమాచారంతో ర్యాలీ నిర్వహించి మంత్రుల కమిటికి జాషువా చేసిన సేవలను వివరించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా సాధనకు డొక్కా మాణిక్య వరప్రసాదు ఛైర్మన్‌గా, కొరివి వినయ కుమార్ కన్వీనర్‌గా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, ఆలా వెంకటేశ్వర్లు, రాణిశివ శంకర్ శర్మ, సుబ్రహ్మణ్యం, కన్నా మాస్టారు, ఉదయభాస్కర్, చందువోలు శోభారాణి, ఎలిషా, కేశన శంకరరావు, మేళం భాగ్యరావు, బాలస్వామి, విప్పర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. త



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు, పాల్గొన్న పాపినేని శివశంకర్ తదితరులు

వాసవి క్లబ్ సేవలను మరింతగా విస్తృత పరుస్తాం

● అంతర్జాతీయ సభ్యులు ఎస్వీ రమణ రవిబాబు, జుజ్జూరు శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ సేవలను మరింతగా విస్తృత పరిచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆ క్లబ్ అంతర్జాతీయ సభ్యులు ఎస్వీ రమణ రవిబాబు, జుజ్జూరు శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం, స్థానిక ఆర్ అగ్రహారం, కన్యక పరమేశ్వరీ దేవాలయంలో కారంశెట్టి మోహన సుబేంద్ర గుప్తా సౌజన్యంతో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వృద్ధులకు పెన్షన్, ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మిగిలిన జిల్లాలకు గుంటూరు జిల్లా క్లబ్ సేవలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. జిల్లా అధ్యక్షుడు రాయవరపు అశోక్ కుమార్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో వృద్ధులకు పెన్షన్, బియ్యం పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేకరరావు, వేమూరి ప్రదీప్, రామారావు, చిరంజీవి, రమేష్, పవన్, వెంకటేశ్వరరావు, దొరడ్ల అనిల్, వీరాంజనేయులు, యువ, మహిళా వాసవి సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధులకు బియ్యం, పెన్షన్ పంపిణీ చేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

మరణించిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు

గ్రాట్యుటీ మంజూరు విధానం

● ఈదర వీరయ్య

గుంటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మరణించిన ఉద్యోగి కుటుంబ సభ్యులకు కూడా రిటైరైన ఉద్యోగికి రూలు-46లో అనుమతించిన ప్రకారం గ్రాట్యుటీ లభిస్తుందని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అయితే మరణించిన ఉద్యోగి 5 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసినట్లయితే 18 సంవత్సరాల సర్వీసు చేసినట్లు భావించి గ్రాట్యుటీ లెక్కకట్టాలని, ఒక సంవత్సరం సర్వీసు పూర్తి చేసి 5 సంవత్సరాల కన్నా తక్కువ సర్వీసు కలవారు 9 సంవత్సరాలు పూర్తి చేసినట్లు భావించి గ్రాట్యుట్ లెక్క కట్టాలన్నారు. సర్వీసులో చేరిన సంవత్సరంలోగానే చనిపోతే 3 సంవత్సరాల సర్వీసులో గ్రాట్యుటి లెక్కకట్టాలన్నారు. ఈ గ్రాట్యుటీ ఉద్యోగి జీవించి ఉండగా రూలు-49 ప్రకారం నామినేట్ చేసిన వారికి ఇవ్వబడుతుందన్నారు. భార్య/భర్త వివాహిత/అవివాహిత సంతానం, తండ్రి, తల్లి, సోదరుడు, పెళ్లి కాని విధవరాలైన సోదరి, తనకన్నా ముందే మరణించిన తన కుమారుని సంతానం, వీరందరిని గాని, వీరిలో ఎవరినైనా, తమ ఇష్టానువారం నామినేట్ చేయవచ్చన్నారు. ఇతరులను నామినేట్ చేయటానికి వీలు లేదన్నారు.

ఈ కుటుంబ సభ్యులు ఎవరూ లేనట్లయితే ఇతరులెవరికైనా, ఏ సంస్థకైనా గ్రాట్యుటీ ఇవ్వమని నామినేషన్‌లో సూచించవచ్చన్నారు. ఒకరి కన్నా ఎక్కువ మందిని నామినేట్ చేసినప్పుడు ఎవరి వాటా ఎంతో ఆ నామినేషన్‌లో తెలపాలని పేర్కొన్నారు. మైనర్ల వాటా వారి సంరక్షకులకు చెల్లించాలని, నామినేట్ చేసిన తన కుటుంబ సభ్యులు తన కన్నా ముందే మరణించినా, లేక ఆ తర్వాత గ్రాట్యుటీ తీసుకొనక ముందే మరణించినా గ్రాట్యుటీ ఎవరికి ఇవ్వాలో కూడా ఆ నామినేషన్‌లో తెలపాల్సి ఉంటుందన్నారు. భార్య/భర్త పునర్వివాహం లాంటి యాధృచ్ఛిక సంఘటనలను సూచిస్తూ ఆ సందర్భాల్లో నామినేషన్ చెల్లదని నిబంధన చేర్చవచ్చన్నారు. ఈ నామినేషన్లు 10 సంవత్సరాల కన్నా తక్కువ సర్వీసు చేసి రిటైరైన వారికిచ్చే సర్వీసు, గ్రాట్యుటీకి వర్తించదన్నారు. రిటైరైన ఉద్యోగి కమ్యుటేషన్ విలువ తీసుకోక ముందే మరణించినచో ఆ మొత్తం గ్రాట్యుటీ మాదిరిగానే తాను నామినేట్ చేసిన కుటుంబ సభ్యులకు లేనిచో తన న్యాయ వారసులకు చెల్లించాలన్నారు. పెన్షనర్లు అదృశ్యమైన సందర్భాలలో కుటుంబ పెన్షన్ ఎవరికి ఏ రేటుతో ఇవ్వాలో ముందే నిర్ణయించబడినందున పీపీవోలో సూచించబడిన వారు పైన పేర్కొన్న రికార్డులు పెన్షన్ మంజూరు చేసే అధికారికి దాఖలు చేయాలని వీరయ్య తెలిపారు.

చుట్టుగుంట పార్కు అభివృద్ధికి గ్రహణం

● కూటమి ప్రభుత్వం వచ్చినా ముందుకు సాగని పనులు
● అభివృద్ధికి చర్యలు తీసుకోవాలంటున్న వాకర్స్



నిరుపయోగంగా ఓపెన్ జిమ్ వస్తువులు

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చుట్టుగుంట పార్కు అభివృద్ధి మూడు అడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో అద్భుతంగా తీర్చిదిద్దుతామంటూ గొప్పలు చెప్పిన నేతల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. పైగా అభివృద్ధి పేరులో పార్కులో అనేకమైన పచ్చని వృక్షాలను ధ్వంసం చేయటంతో పాటు ఓపెన్ జిమ్ వస్తువులను నిరుపయోగంగా పక్కన పడేసి కళావిహీనంగా తయారు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చుట్టుగుంట పార్కు అభివృద్ధి జరుగుతుందని వాకర్స్ ఎంతో ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా అభివృద్ధి కొనసాగుతూ...ఉన్నట్లుగానే ఉంది తప్ప అందులో ఎటువంటి మార్పు కనిపించటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం మరుగుదొడ్ల సౌకర్యం లేక సాయంత్రం సమయాల్లో మహిళలు నరకయాతన పడుతున్నారు. ఇక చిన్నారులు, మహిళలు వ్యాయాయం చేసుకునే ఓపెన్ జిమ్ వస్తువులను నిరుపయోగంగా మూలన పడేశారు. ఆహ్లాదం పంచి పెట్టాల్సిన పార్కు ఎండిపోయిన గడ్డి, అధ్వానంగా ఉన్న వాకింగ్ ట్రాక్‌తో దర్శనమిస్తోంది.

ప్రమాదభరితంగా రివిట్‌మెంట్...

చుట్టుగుంట చెరువుకు తూర్పు వైపు ఇటీవల నిర్మించిన రివిట్‌మెంట్ ప్రమాదభరితంగా మారింది. ఇటీవల చిన్నారులు ఆడుకుంటుండగా అందులో ఒక బాలుడు పడి నీటిలో విలవిల్లాడిపోయాడు. వెంటనే తండ్రి చూసి నీటిలో దూకి పట్టుకోవటంతో కాపాడుకోగలిగాడు. ప్రమాదభరింగా ఉన్న రివిట్‌మెంట్‌కు చుట్టూ ఐరన్ ఫెన్సింగ్ నిర్మాణం చేపడితే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని వాకర్స్ కోరుతున్నారు.



అధ్వానంగా మారిన మరుగుదొడ్లు

వాహన చోరీలకు పాల్పడుతున్న

ఇద్దరు మైనర్లు సహా ముగ్గురు అరెస్టు

● పది ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, ముగ్గురు సీఐలు వెనుక నిందితుడు వెంకటేశ్వర్లు

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వాహన చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్లు సహా ముగ్గురిని నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. కేవీపీ కాలనీ రెండో లైన్‌కు చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ వాసుతోపాటు మరో ఇరువురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి పది ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆదివారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ కే అరవింద్ వివరాలు వెల్లడించారు. ఆదివారం ఉదయం పోలీసులు చుట్టుగుంట సెంటర్లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రధాన నిందితుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ వాసు పోలీసులను చూసి తన ద్విచక్ర వాహనాన్ని వెనక్కు తిప్పుకొని పారిపోయేందుకు ప్రయత్నిస్తుండడంతో అనుమానించిన పోలీసులు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల వ్యవహారం వెలుగు చూసింది. నగరంలో ఇళ్ల ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాలను అదేవిధంగా ఆటోలను ఈ ముఠా అపహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంకటేష్‌తో పాటు మరో ఇరువురు మైనర్లు కలిసి ఈ వాహన చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి మిగిలిన ఇరువురు మైనర్లను అదుపులోకి తీసుకుని ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ అరవింద్ నేతృత్వంలో నగరంలో వాహన చోరీలకు పాల్పడుతున్న ముఠాలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దీనిలో భాగంగా అరండల్‌పేట, నగరంపాలెం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు రాంబాబు, ప్రసన్నకుమార్, రామాంజనేయులు, సిబ్బంది వాహన చోరీలకు పాల్పడుతున్న నిందితులపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. దీనిలో భాగంగా నగరంపాలెం పరిధిలో నాలుగు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా పెదకాకాని పరిధిలో ఒక ద్విచక్రవాహనం, కొత్తపేట, నల్లపాడు పరిధిలో ఒక్కొక్కటి, పట్టాభిపురం పరిధిలో మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల ఖరీదు రూ.7 లక్షల వరకు ఉంటుందన్నారు. విలేకరుల సమావేశంలో సీఐలు గంగా వెంకటేశ్వర్లు, ఆరోగ్య రాజు, నజీర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ, పాల్గొన్న యూనియన్ నాయకులు

సామూహిక రాయబారాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడ, లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 15న జరిగే సామూహిక రాయబార కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు నార్నే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. బోర్డు పునరుద్ధరించడంతో పాటు, సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. జిల్లా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సం కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఖాసీం వలి, బాబురావు, కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళా సంస్థలు...కాంతి దీపాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కళా సంస్థలు, సాహిత్య సంస్కృతిక సంస్థలు జన చైతన్య దీపాలని అమరావతి సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు తెలిపారు. స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన తెలుగు కళా వేదిక సంస్థ ఆవిష్కరణ సభకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. కొత్త సంస్థలు ఎన్ని వస్తున్నా అన్నీ దీపాలే నని, ఉత్తమ సమాజ నిర్మాణానికి, దేశ వికాసానికి, ప్రపంచ శాంతికి దోహదం చేస్తాయన్నారు. మరో అతిథిగా డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిర్మాణాత్మకంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విమర్శలను సహృదయంతో స్వీకరిస్తూ గొప్ప కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సభలో సంస్థ వ్యవస్థాపకులు లంకా మాధవి, మేడిశెట్టి సుభద్రా కృష్ణ, చల్లా సత్యవతి, భద్ర వేణి, రేపల్లె రాజ్ కృష్ణ, గడల శివప్రసాద్, బలభద్రపాత్రుని ఉదయ్ శంకర్, మెట్టు శ్రీనివాసరెడ్డి, ఏ శంకర్, ఎం శ్రీనివాసరావు, చల్లా రవి పాల్గొన్నారు.



తెలుగు కళా వేదికను ఆవిష్కరిస్తున్న సాహితివేత్తలు

ఆకట్టుకున్న ఉచిత పౌరాణిక పద్య నాటకాలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువు, షిర్డీ సాయిబాబా ఆలయ కళా ప్రాంగణం వేదికపై శ్రీ గౌరీ శంకర కళా నాట్య మండలి సాంస్కృతిక సమాజ సేవా సంస్థ పర్యవేక్షణలో జరిగిన పౌరాణిక నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. హరిశ్చంద్రుడుగా సనిశెట్టి సాంబ శివరావు, నక్షత్రకుడుగా ఏ.ఎల్. చౌదరి, చంద్రమతిగా లక్ష్మీశ్రీ పాత్రధారులుగా సత్యహరిశ్చంద్ర అడవి సన్నివేశాన్ని ప్రదర్శించారు. అనంతరం శ్రీ కృష్ణుడుగా ఏవీ ఆదినారాయణరావు, నారదుడుగా చలువాది ప్రసాద్, వసంతకుడుగా ఎన్ వెంకటరామయ్య, రుక్మిణిగా లక్ష్మీజ్యోతి, సత్యభామగా జయ మాధురి, నళిని గా బీ శోభారాణి చక్కటి పద్యాలతో ప్రదర్శించిన శ్రీకృష్ణ తులాభారం కళాభిమానులను అలరించారు. వీరికి హార్మోనియం పై పాగల్లా సురేష్, చుండూరు శ్రీను, డోలక్ పై వీ. సాంబిరెడ్డి, క్లారినెట్ పై కోటేశ్వరరావులు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను సేవ సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.

గంజాయి కేసుల్లో పాత నేరస్తులకు డీఎస్పీ కౌన్సెలింగ్

● ముగ్గురు నిందితులపై పీడీ యాక్ట్‌కు ప్రభుత్వానికి ప్రతిపాదన
● వెస్ట్ డీఎస్పీ అరవింద్

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : మరోసారి గంజాయి కేసుల్లో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ హెచ్చరించారు. డీజీపీ, ఐజీ ఆదేశాల నేపథ్యంలో ఆదివారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో వెస్ట్ పరిధిలోని గంజాయి కేసుల్లో పాత నిందితులకు డీఎస్పీ అరవింద్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కౌన్సెలింగ్‌కు అరండల్‌పేట, పట్టాభిపురం, నగరంపాలెం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 51 మంది గంజాయి కేసుల్లో పాత నిందితులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ తదితర నేరాలకు సంబంధించి కఠిన చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసుల్లో పట్టుబడే నిందితుల భవిష్యత్తు నాశనమైనట్లే అన్నారు. ఆయా కేసుల్లో మరోసారి పట్టుపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో అదేపనిగా గంజాయి డ్రగ్స్ కేసుల్లో పట్టుబడుతున్న నిందితులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. దీనిలో భాగంగా తొలివిడత ముగ్గురు నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇప్పటికైనా గంజాయి కేసుల్లో నిందితులు ఆయా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు స్వస్తి పలకాలని, లేని పక్షంలో వారిపై కూడా పీడీ యాక్ట్ ప్రయోగించాల్సి వస్తుందన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షలు కూడా కఠినంగానే ఉంటాయన్నారు. గంజాయి విక్రయించినా, అక్రమ రవాణా చేసినా, సేవించినా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. గంజాయి కేసుల్లో నిందితులందరిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామన్నారు. ఆయా కేసుల్లో నిందితులు ఇక నుంచి ప్రతి ఆదివారం జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.



గంజాయి కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్ డీఎస్పీ కే అరవింద్

విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌ల ఏర్పాటు

గంజాయి, డ్రగ్స్‌పై యువతలో అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ అరవింద్ తెలిపారు. వివిధ ప్రసార మాధ్యమాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ అనేవి అత్యంత ప్రమాదకరమైనవన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తుండాలన్నారు.

బక్కెట్‌లో పడి చిన్నారి మృతి

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లచెరువు 25వ లైన్‌లో నివాసం ఉంటున్న అతీఫ్ ఖాన్ (16)నెలలు నీటి బక్కెట్‌లో పడి మృతి చెందాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన పటాన్ యూసఫ్ ఖాన్ వెల్డింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. కాగా ఆదివారం మధ్యాహ్నం తన కుమారుడైన అతీఫ్ ఖాన్ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బకెట్‌లో గల నీటిలో పడిపోయి మృతి చెందాడు. కాగా తండ్రి పటాన్ యూసఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లాలాపేట పోలీసులు తెలిపారు.

గంజాయి కేసుల్లో నిందితులకు కఠిన చర్యలు

గుంటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసుల్లో నిందితులు పద్ధతి మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. ఆయన ఆదివారం కొత్తపేట, లాలాపేట, పాతగుంటూరు పోలీస్ స్టేషన్‌లలో గంజాయి కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి కేసుల్లో గల ముద్దాయిలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసారు. కార్యక్రమంలో లాలాపేట సీఐ ఏవీ శివప్రసాద్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, పాతగుంటూరు సీఐ వెంకట ప్రసాద్, స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పక్కన మేయర్ రవీంద్ర, లక్ష్మణరావు తదితరులు

సేవా సంస్థలను ప్రోత్సహించాలి

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అనాధలను, అభాగ్యులను, మానసిక వికలాంగులను ఆదుకుంటున్న కార్మెల్ సేవా సదన్ లాంటి సంస్థలను ప్రోత్సహించడం మనందరి కర్తవ్యమని నరసరావుపేట లోక్ సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. గుంటూరులోని గోరంట్ల వద్ద గల కార్మెల్ సేవా సదన్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన ప్రహరీ గోడ ప్రారంభోత్సవం,సేవా సంస్థల ఆత్మీయ సమ్మేళనాన్ని లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభించి ప్రసంగించారు. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగిసూ భారతదేశం ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి లో 3వ స్థానానికి చేరుకోబోతుందని, మరోవైపు ఆర్థిక అసమానతలు, పేదరికం కొనసాగుతున్నాయని, వీటిని తొలగించేందుకు ప్రభుత్వాలతో పాటు సేవా కార్యక్రమాలను నిస్వార్థంగా నిర్వహిస్తున్న సేవా సంస్థలకు సంపూర్ణ తోడ్పాటును అందిస్తానని తెలిపారు. డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ, కేరళలో జన్మించిన జాక్ క్లమాకస్ కార్మెల్ సేవా సదన్‌ను స్థాపించి దాదాపు 400 మంది మానసిక వికలాంగులకు అండగా నిలిచారన్నారు. గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ కార్మెల్ సేవా సదన్ చేస్తున్న కృషి అభినందనీయమని,సేవా సంస్థలకు గుంటూరు నగర పాలక సంస్థ సంపూర్ణ తోడ్పాటును అందిస్తుందని ప్రకటించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నగరంలో దాదాపు 25 సేవా సంస్థలు బహుముఖ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని, వీటన్నింటినీ కలిపి ఐక్యంగా కృషి చేస్తే మరిన్ని సత్ఫలితాలు వస్తాయన్నారు. మాజీ శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు ప్రసంగిస్తూ నగరంలో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి చేస్తున్న సేవలు అద్వితీయమని, వారిని ఆదర్శంగా తీసుకొని నగరంలో ఉన్న ధనవంతులు దాతృత్వాన్ని ప్రదర్శించుకోవాలని కోరారు. శర్వాణి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డి ప్రసంగిస్తూ కార్మెల్ సేవా సదన్ ప్రహరీ గోడ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్ (గోతాల స్వామి) ప్రసంగిస్తూ కార్మెల్ సేవా సదన్‌కు దాదాపు రూ.16 లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మించిన దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్, కోవిడ్ ఫైటర్స్, రుద్రా చారిటబుల్ ట్రస్ట్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, నేస్తం ఫౌండేషన్, రేట్ పేయర్స్ అసోసియేషన్, అభినందన ఫౌండేషన్, చైల్డ్ హార్ట్ ఫౌండేషన్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, హ్యాపీ కేర్ ఓల్డ్ ఏజ్ హోమ్, బహుజన మహాసభ కేంద్రం, మాతృదేవోభవ సంస్థల ప్రతినిధులను ఘనంగా సత్కరించి, వారి సేవలను కొనియాడారు.

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు హామి ఇచ్చారు. ప్రభుత్వ డ్రైవర్ల జిల్లా సంఘం అధ్యక్షుడు వెంపాటి పాపారావు నేతృత్వంలో ఇటీవలే గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల కమిటీలకు ఎన్నికైన నాయకులు ఆదివారం బొప్పరాజుని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల్లో కొత్త వాహనాలను కొనుగోలు చేసేందుకు తాను ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. అలానే ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా నాయకులు బంగారి శ్రీనివాసరావు, ధనకొండ వెంకటేశ్వరరావు, కోసూరి శ్రీహరిబాబు, జీ సులేమాన్ రాజ్, జీ ఈశ్వరరావు, ఎస్.మల్లేశ్వరరావు, యండమూరి నాగరాజు, సీహెచ్ శ్రీనివాసరావు, ఆర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రభుత్వ డ్రైవర్లను అభినందిస్తున్న ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

మొబైల్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాబు



అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సెల్ బాబు, జుబేర్

గుంటూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మొబైల్ షాప్ ఓనర్స్ అండ్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సెల్ బాబు, జుబేర్ ఎన్నికయ్యారు. అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మొత్తం 390 ఓట్లకుగాను 353 ఓట్లు పోలైనట్లు ఎన్నికల పరిశీలకుడు మార్కండేయులు తెలిపారు. అధ్యక్షుడిగా సెల్ బాబు 185 ఓట్లు పొందగా, మరో అభ్యర్థి మోబిన్‌కు 160 ఓట్లు లభించినట్లు తెలిపారు. అలానే కార్యదర్శిగా పోటీ చేసిన జుబేర్‌కు 199 ఓట్లు రాగా టి వేణుకు 150 ఓట్లు దక్కినట్లు పేర్కొన్నారు. ఈ కార్యవర్గం 2027 వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం కోశాధికారిగా క్లాసిక్ జిలానిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడు సెల్ బాబు మాట్లాడుతూ మొబైల్ షాప్ ఓనర్స్ సమస్యల పరిష్కారానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సంద ర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ నాయకులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కొనకళ్ళ సత్యం, షేక్ సుభాని, ఈసీ సభ్యులు ఆర్.శ్రీధర్, జానీ, నరేష్, మున్నా, మార్కండేయులు, మస్తాన్‌వలీ తదితరులున్నారు.

చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

● డాక్టర్ వీవీకే సందీప్

గుంటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మనలో ప్రధానమైన చెవి, ముక్కు, గొంతు సమస్యలపై ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని డాక్టర్ వీవీకే సందీప్ సూచించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన మాట్లాడారు. చెవిలో గుబిలిని పిన్నీసులు, బడ్స్ అంటి పరికరాలను ఉపయోగించి తీసే ప్రయత్నం చేయకూడదన్నారు. ఇబ్బందిగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించి చెవిని శుభ్ర పరుచుకోవాలన్నారు. చెవిలో మూడు భాగాలుంటాయన్నారు. అలానే చెవి, ముక్కు, గొంతు సమస్యలపై సొంత వైద్యం చేయకూడాదన్నారు. ఒక్కో సందర్భంలో ఇబ్బందిగా పరిణమిస్తుందన్నారు. తద్వారా సమస్య మరింత పెద్దదయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాయిరామ్, చల్లా అంజిరెడ్డి, కళ్యాణం చంద్రశేఖరరావు తదితరులున్నారు.

నేడు అరండల్‌పేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అరండల్‌పేట ఒకటో లైను నుంచి 13వ లైను వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తఫా ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

దిక్సూచి

ఒకప్పుడు ఆర్ట్స్, కామర్స్ గ్రూపుల విద్యార్థులంటే చిన్న చూపు ఉండేది. చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ) లాంటి ప్రొఫెషన్స్ పాపులర్ అయ్యాక పరిస్థితి మారింది. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న సీఏల సంఖ్య కేవలం నాలుగు లక్షలు. 2050 నాటికి మన దేశానికి 50 లక్షల మంది సీఏలు అవసరం అని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' ప్రెసిడెంట్ చరణ్ జోత్ సింగ్ నంద ఇటీవలే ఒక మీడియా సమావేశంలో తెలిపారు. అంటే రాబోయే రోజుల్లో ఈ కోర్సుకు డిమాండ్ ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. పాతికేళ్లుగా మన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు విదేశాల్లో ఎలా విజయం సాధిస్తున్నారో, అదేమాదిరిగా భవిష్యత్తులో చార్టర్డ్ అకౌంటెంట్లు కూడా మారే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, మెడిసిన్‌తో పోలిస్తే ఈ కోర్సుకయ్యే ఖర్చు తక్కువ. ఉద్యోగం గ్యారంటీ. మారుతున్న అవసరాలు, మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా ఈ కోర్సులో మార్పులు చేర్పులు చోటుచేసుకున్నాయి.



సీఏ ఎవర్ గ్రీన్ కోర్సు

ఇటీవలి మార్పులు...

- గతంలో సీఏ ఇంటర్, ఫైనల్‌లో 8 పేపర్లు ఉంటే ఇప్పుడు అవి 6కి తగ్గాయి. విద్యార్థులు తరచూ ఫెయిల్ అయ్యే పేపర్లు తీసేశారు. ఒక ఎలక్టివ్ పేపర్‌ను జత చేశారు.
- ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ పరీక్షలు గతంలో సంవత్సరానికి రెండు సార్లు జరిపితే ఇప్పుడు ఏటా మూడు సార్లు నిర్వహిస్తున్నారు.
- అలాగే సీఏ ఫైనల్ చేస్తూ మూడు సంవత్సరాల పాటు ఆర్టికల్‌షిప్(ప్రాక్టికల్ ట్రైనింగ్) చేయాల్సి వచ్చేది. కొత్త విధానంలో ఇది రెండు సంవత్సరాలు మాత్రమే.

కమ్యూనికేషన్ స్కిల్స్‌కి పెద్దపీట

సీఏ కోర్సులోని మొదటి దశ సీఏ-సీపీటీ స్థానంలో ఇప్పుడు సీఏ ఫౌండేషన్ చేరింది. పాత సీపీటీలో పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, నెగెటివ్ మార్కింగ్‌లతో ఉండేది. కొత్త విధానంలో 50 శాతం ప్రశ్నలు వ్యాసరూపంలో, 50 శాతం ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఇవ్వనున్నారు. అంటే మొత్తం 4 పేపర్లలో 2 పేపర్లు డిస్క్రిప్టివ్ పేపర్లు. దీంతో నెగెటివ్ మార్కులకు అవకాశం లేదు.

- అలాగే సీపీటీ విధానం ఉన్నప్పుడు అందులోని నాలుగు పేపర్లకు ఒకేరోజు పరీక్ష నిర్వహించేవారు. కానీ కొత్త విధానంలో ఫౌండేషన్‌లోని 4 పేపర్లను నాలుగు రోజులు(ఒక్కోరోజు ఒక్కోపేపర్) పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్ష రాసే అవకాశం ఏర్పడింది. అలాగే 'ఆర్టికల్‌షిప్'(ప్రాక్టికల్ ట్రైనింగ్)లో కూడా కొన్ని మార్పులు చేశారు. ఒకప్పుడు ఐపీసీసీలో(ఇప్పటి సీఏ ఇంటర్మీడియట్) రెండు గ్రూపులు(లేదా) కనీసం మొదటి గ్రూపు పాస్ అయిన వారికే ఆర్టికల్‌షిప్‌కి అవకాశం ఉండేది. ఇప్పుడు సీఏ ఇంటర్‌లో రెండు గ్రూపులు పూర్తి చేసిన వారికి మాత్రమే ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో చేరే అవకాశం కల్పించారు.

రెండో దశ ఇంటర్

సీఏ ఫౌండేషన్ పూర్తి చేసినవారు ఇంటర్ చదవడానికి అర్హులు. గ్రాడ్యుయేట్లు/ సీఎంఏ ఇంటర్/ సీఎస్ ఇంటర్ పూర్తి చేసిన వారు ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా నేరుగా సీఏ ఇంటర్ పరీక్ష రాయవచ్చు. సీఏ ఇంటర్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 18,000/-. ఈ పరీక్షని మే నెలలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం సెప్టెంబరు 1లోగా, సెప్టెంబరులో రాయాలనుకుంటే అదే సంవత్సరం జనవరి 1లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. జనవరిలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం మే 1లోగా నమోదు చేయించుకోవాలి.

డిగ్రీ అర్హతతో: డిగ్రీ అభ్యర్థులు ఫౌండేషన్‌తో సంబంధం లేకుండా నేరుగా సీఏ ఇంటర్‌కు నమోదు చేయించుకోవచ్చు. కామర్స్ యూజీ/పీజీ అయితే 55శాతం మార్కులు, ఇతర డిగ్రీ/ పీజీ అయితే 60శాతం మార్కులు ఉండాలి. అయితే వీరు సీఏ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే నాలుగు వారాల ఐసీఐటీఎస్ఎస్(ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్) శిక్షణ తరగతులకు హాజరు కావాలి. దీని తరవాత ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రారంభించాలి. 8 నెలల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేసిన వారే సీఏ ఇంటర్ పరీక్షకు అర్హులు.

- ఇంటర్‌లోని 6 పేపర్లను 2 గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో 3 పేపర్లు ఉంటాయి. ఒక్కోక్క పేపరు 100 మార్కులకు ఉంటుంది. ఇంటర్ పాస్ కావాలంటే ప్రతి పేపరులో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి. సీఏ ఇంటర్ రెండు గ్రూపులూ పూర్తి చేసిన వారు రెండు ఏళ్ల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి చేయాలి.

ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఆర్టికల్‌షిప్): సీఏ ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను గతంలో ఆర్టికల్‌షిప్ అని పిలిచేవారు. గతంలో ఈ ప్రాక్టికల్ ట్రైనింగ్(ఆర్టికల్‌షిప్) మూడు సంవత్సరాలు ఉండేది. ఇప్పుడు దానిని రెండు సంవత్సరాలకు తగ్గించారు.

- సీఏ ఇంటర్ రెండు గ్రూపులూ పూర్తి చేసిన వారు ఇన్‌స్టిట్యూట్ వారి 4 వారాల ఏఐసీఐటీఎస్ఎస్(అడ్వాన్స్‌డ్ ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్) శిక్షణ కూడా తీసుకోవాలి. వీరికి ఉపకారవేతనం లభించే అవకాశం ఉంది.

మొదటి దశ ఫౌండేషన్

సీఏ ఫౌండేషన్ పరీక్ష సంవత్సరానికి మూడుసార్లు (జనవరి, మే, సెప్టెంబర్) నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 9,000/-. ఈ ఫౌండేషన్ పరీక్ష మే నెలలో రాయాలనుకుంటే అదే సంవత్సరం జనవరి 1లోగా, సెప్టెంబరులో రాయాలనుకుంటే అదే సంవత్సరం మే 1లోగా నమోదు చేయించుకోవాలి. ఇక జనవరిలో రాయాలనుకుంటే ముందు సంవత్సరం సెప్టెంబరు 1లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఇంటర్మీడియట్(లేదా), 10+2(లేదా) అందుకు సమానమైన పరీక్ష రాసిన వారు ఫౌండేషన్ కోర్సుకి నమోదు చేయించుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేసుకున్న నాలుగు నెలలకు ఫౌండేషన్ పరీక్ష రాయవచ్చు.

- ఇప్పటి సీఏ ఫౌండేషన్ స్థానంలో గతంలో నిర్వహించిన సీపీటీ పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల రూపంలోనే ఉండేది. కానీ, ప్రస్తుత ఫౌండేషన్ పరీక్షలో 50 శాతం మార్కులను డిస్క్రిప్టివ్ పరీక్షగా, మరో 50 శాతం మార్కులను మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుగా పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇక ఫౌండేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలన్న విద్యార్థి ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం మార్కులు సాధించాలి అలాగే 4 పేపర్లు కలిపి 400 మార్కులకు గాను 50 శాతం మార్కులు అంటే 200 మార్కులు సాధించాలి.

మూడో దశ ఫైనల్

సీఏ ఇంటర్ తదుపరి రెండు సంవత్సరాల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేసిన వారు సీఏ ఫైనల్‌కు నమోదు(రిజిస్ట్రేషన్) చేయించుకోవచ్చు. దీని రిజిస్ట్రేషన్ ఫీజు 22,000/-. ఫైనల్ నమోదుకి తుది గడువు అంటూ ఏమీలేదు. ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి కాబోతున్న సమయంలో ఫైనల్‌కి నమోదు కావచ్చు. అంటే ఫైనల్ పరీక్షకు దరఖాస్తు చేసేలోగా రిజిస్ట్రేషన్ పూర్తి కావాలి. ఫైనల్ పరీక్షను కూడా సంవత్సరానికి మూడు సార్లు అంటే జనవరి, మే, సెప్టెంబరు నెలల్లో నిర్వహిస్తారు.

- ఈ పరీక్ష మొత్తం 6 పేపర్లు. 2 గ్రూపులుగా(గ్రూపుకి 3 పేపర్ల చొప్పున) ఒక్కోక్క పేపర్ 100 మార్కులకు మొత్తం 600 మార్కులకి ఉంటుంది. విద్యార్థి వీలును బట్టి 6 పేపర్లు ఒకేసారి లేదా ఒక్కో గ్రూపు విడివిడిగా రాసుకోవచ్చు.
- ఇందులో పాస్ కావాలంటే ప్రతి పేపరులో 40 శాతం మార్కులు, గ్రూపు మొత్తం మీద 50 శాతం మార్కులు రావాలి.

రిజిస్ట్రేషన్ కోసం: www.icai.org/post/studentsservices లేదా 98851250001, 98851250003 హెల్ప్ లైన్ నెంబర్లని సంప్రదించవచ్చు.



ప్రకాశ్
డైరెక్టర్, మాస్టర్ మైండ్స్

జామ్ 2026



'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్'(జామ్-2026) నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 22 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ(టెక్నాలజీ), ఎంఎస్ రిసెర్చ్, ఎంఎస్సీ ఎంటెక్, జాయింట్ పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ(డ్యూయల్ డిగ్రీ) కోర్సులో అడ్మిషన్లు జరుపుతారు. ఈసారి ఎంట్రెన్స్‌ను ఐఐటీ బాంబే నిర్వహించనుంది. 2025 సెప్టెంబరు 5 నుంచి దరఖాస్తులు దాఖలు చేయవచ్చు. ఎంట్రెన్స్ 2026 ఫిబ్రవరి 15న జరుగుతుంది. ఫలితాలు మార్చి 18న వెలువడుతాయి.

అర్హత: నిర్దేశిత విభాగాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా అర్హులే.

సబ్జెక్టులు: బయో టెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మేథ్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి

దరఖాస్తులకు తుది గడువు: 2025 అక్టోబర్ 12 **వెబ్‌సైట్:** https://jam2026.iitb.ac.in

కేసీ మహీంద్రా స్కాలర్‌షిప్

'మహీంద్రా ఆల్ ఇండియా టాలెంట్ స్కాలర్‌షిప్-2025' కోసం కె.సి. మహీంద్రా ఎడ్యుకేషన్ ట్రస్ట్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో డిప్లొమా కోర్సులు అభ్యసించేందుకు వెనుకబడిన వర్గాల విద్యార్థులకు సహాయం చేయడానికి స్కాలర్‌షిప్‌లను అందించనున్నారు.



- ఏటా రూ. 10,000 చొప్పున 550 మంది విద్యార్థులకు గరిష్ఠంగా 3 సంవత్సరాలపాటు ఈ స్కాలర్‌షిప్ అందజేస్తారు.
- 10/12వ తరగతి లేదా తత్సమాన పరీక్షలలో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలి. అలాగే డిప్లొమా కోర్సు కోసం ప్రభుత్వ/ గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశం పొంది ఉండాలి. కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులు.
- **చివరి తేదీ:** 2025 ఆగస్ట్ 27.
- **వెబ్‌సైట్ :** www. kcmet.org

జాబ్ కార్నర్

హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్), హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్) గ్రూప్-సీ నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ నోటిఫికేషన్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతోంది.

బీఎస్ఎఫ్‌లో 1121 హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

- హెడ్ కానిస్టేబుల్(రేడియో ఆపరేటర్) 910
- హెడ్ కానిస్టేబుల్(రేడియో మెకానిక్) 211

వయస్సు: 18 నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.

చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 23

వెబ్‌సైట్: https//rectt.bsf.gov.in/

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకులో లోకల్ ఆఫీసర్లు


పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌లో దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో తెలంగాణలో 50, ఆంధ్రప్రదేశ్‌లో 80 ఖాళీలు ఉన్నాయి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. **చివరి తేదీ:** 2025 సెప్టెంబర్ 4

వెబ్‌సైట్: punjabandsindbank.co.in/

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మదరాసి యాక్షన్



అమరన్ చిత్రం ఘన విజయం తర్వాత శివ కార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మదరాసి'. ఏ.ఆర్ మురగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజాగా చిత్రబృందం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసింది. 'నీలాగే ఇతరులను ప్రేమించు... అందరినీ నీ కుటుంబమే అనుకో' అంటూ హీరోయిన్ రుక్మిణి వసంత్ పలికిన డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆకట్టుకునేలా ఉంది. డైలాగ్ పూర్తయిన వెంటనే పవర్‌ఫుల్ లుక్, పవర్‌ప్యాక్డ్ యాక్షన్‌తో కథానాయకుడిని పరిచయం చేశారు. ఆయుధ అక్రమ రవాణా నేపథ్యంలో మురగదాస్ కథను తీర్చిదిద్దారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఈ చిత్రంలో విద్యుత్ జమ్వాల్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. సెప్టెంబర్ 5న 'మదరాసి' ప్రేక్షకుల ముందుకు రానుంది.

రానా ఆవిష్కరించిన గీతం



అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి ముఖ్య తారాగణంగా మున్నా ధులిపూడి తెరకెక్కిస్తోన్న వినోదాత్మక చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్‌లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఇలా చూసుకుంటానే..' అంటూ సాగే గీతాన్ని హీరో రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ఆవిష్కరించారు. చంద్రబోస్ సాహిత్యానికి అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. 'ఈ పాటను జమ్మూ కశ్మీర్, మలేసియాలోని ప్రకృతి అందాలలో చిత్రీకరించామని, పూర్తిగా ఇది వినోద భరిత చిత్రం' అని యూనిట్ పేర్కొంది.

రెండో పాటతో రెడీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. సెప్టెంబర్ 25న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం మరో అప్‌డేట్‌ను పంచుకుంది. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 27న 'ఓజీ' నుంచి 'సువ్వీ సువ్వీ' అంటూ సాగే గీతాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రియాంక మోహన్‌తో కలసి పవన్ కల్యాణ్ కోనేటిలో దీపాలు వదులుతున్న లుక్‌ను పంచుకున్నారు.

విశాల్ 'మకుటం'



హీరో విశాల్ 35వ ప్రాజెక్టుకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రానికి 'మకుటం' అనే పేరును మేకర్స్ ఖరారు చేసి టైటిల్ టీజర్‌ని రిలీజ్ చేశారు. రవి అరసు దర్శకత్వంలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌పై ఆర్‌బీ చౌదరి నిర్మిస్తున్నారు. విశాల్ సరసన అంజలి కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌ను గమనిస్తే..ఇది సముద్రం నేపథ్యంలో నడిచే ఓ మాఫియా కథ అని అర్థమవుతోంది. జీవీ ప్రకాశ్ కుమార్ ఆర్ఆర్ అదిరిపోయింది. ఈ మూవీకి ఎన్.బి.శ్రీకాంత్ ఎడిటర్‌గా, దురైరాజ్ కళా దర్శకుడిగా, ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం.నాథన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోందని, ఇతర వివరాల్ని త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాలకృష్ణ



- భారతీయ సినీరంగంలో హీరోగా 50 సంవత్సరాల కెరీర్
- అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు, లోకేశ్

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే గోల్డ్ ఎడిషన్‌లో ప్రముఖ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేరు నమోదైంది. భారతీయ సినిమాలో 50 సంవత్సరాల పాటు హీరోగా సుదీర్ఘ కెరీర్‌ను సాధించినందుకు ఆయన పేరును నమోదు చేశారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సీఈవో సంతోష్ శుక్లా ఓ ప్రకటనలో.. బాలకృష్ణ ఐదు దశాబ్దాల సినిమా సేవలు లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రశంసించారు. ఈ నెల 30న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు సంబంధించిన గుర్తింపు పత్రాన్ని హైదరాబాద్‌లో స్వయంగా బాలకృష్ణకు అందించనున్నట్లు శుక్లా తెలిపారు. లండన్ ప్రధాన కార్యాలయంగా ఉన్న వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థ. బాలకృష్ణకు దక్కిన గుర్తింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. బాలకృష్ణ అసాధారణ సినీ ప్రస్థానానికి దక్కిన గుర్తింపుగా చంద్రబాబు కొనియాడారు. బాలయ్యకు అభినందనలు తెలిపారు. మంత్రి లోకేశ్ కూడా బాలకృష్ణకు అభినందనలు తెలిపారు.


అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఆ రోజే 'ఏం జరుగుతుందో..'

రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తోన్న సినిమా 'ది గర్ల్‌ఫ్రెండ్'. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్‌ని మేకర్స్ అనౌన్స్ చేశారు. 'ఏం జరుగుతోంది...' అంటూ సాగే గీతాన్ని ఈనెల 26న విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాకేందు మౌళి సాహిత్యం అందించగా, చిన్మయి పాడారు. దీన్ని ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌గా రూపొందించామని, సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.



సీనియర్ కార్టూనిస్టు దర్శకుడు శంకు కన్నుమూత



సీనియర్ వ్యంగ్య చిత్రకారుడు, రచయిత, దర్శక, నిర్మాత సంపర భీమ శంకర కుమార్ అలియాస్ శంకు(78) ఇకలేరు. ఆయన ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో గుండెపోటుతో బాగ్ అంబర్ పేటలోని స్వగృహంలో హఠాన్మరణం చెందారు. శంకు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా తణుకు. బాపూ బొమ్మల స్ఫూర్తితో 1962లో తన 16వ ఏట కుంచె పట్టిన శంకు ఆంధ్ర పత్రికకు రెండు దశాబ్దాలు బొమ్మలు, కార్టూన్లు గీశారు. ఉన్నత విద్య అనంతరం ప్రఖ్యాత దర్శకుడు బాపు దగ్గర తొమ్మిది సినిమాలకు దర్శకత్వ శాఖలో పని చేశారు. ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌లో కొంతకాలం పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 'మిస్టర్ పెళ్లాం' సినిమాకు నిర్మాతగా వ్యవహరించినా, ఉద్యోగ నిబంధనల కారణంగా టైటిల్స్ లో మాత్రం సహ నిర్మాతగా వేయించినట్లు తానే ఓ సందర్భంలో చెప్పారు. మునిమాణిక్యం 'కాంతం కథలు', శంకరమంచి 'అమరావతి కథలు', వంశీ 'మా పసలపూడి కథలు', సయ్యద్ సలీం కథలను టెలివిజన్ ధారావాహికలుగా రూపొందించారు. అందుకుగాను నాలుగు నంది పురస్కారాలు అందుకున్నారు. తెలుగు కార్టూనిస్టులందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడంలో శంకు ప్రముఖ పాత్ర పోషించారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 13 మంది కార్టూనిస్టుల జీవితంపై 'ఎమినెంట్ కార్టూనిస్ట్స్ ఆఫ్ ఇండియా' పేరుతో దూరదర్శన్‌కు డాక్యుమెంటరీ చిత్రాలు తీశారు. క్రోక్విల్ హాస్య ప్రియ పేరుతో ఓ మాస పత్రికను కూడా నిర్వహించారు. క్రోక్విల్ అకాడమీ ద్వారా వ్యంగ్య చిత్రకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణం ఇతివృత్తంగా శంకు గీసిన కార్టూన్‌కు బెల్జియంలోని నాకీస్ట్ అంతర్జాతీయ పురస్కారం లభించింది. సాహిత్య, కళా రంగాలలో శంకు అందించిన సేవలకుగాను 2015లో తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారంతో సత్కరించింది. శంకు భార్య పేరు ఎల్లాప్రగడ శోభారాణి. ఆమె దూరదర్శన్ లో న్యూస్ రీడర్ గా, సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సేవలందించారు. వీరికి ఇద్దరు పిల్లలు, కుమార్తె సత్య, కుమారుడు చైతన్య. శంకు భౌతికకాయానికి సినీ ప్రముఖులు వంశీ, బ్రహ్మానందం, రచయితలు బ్నిం, సుధామ, కార్టూనిస్టు సరసి తదితరులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆదివారం సాయంత్రం అంబర్ పేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

దుబాయ్‌లో 'గామా' వేడుక



'గామా'(గల్ఫ్ అకాడెమీ మూవీ అవార్డ్స్) అవార్డులకు టాలీవుడ్‌లో ఓ ప్రత్యేకత ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇప్పుడు ఐదో ఎడిషన్ వేడుకలను ఈనెల 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యూరీ సభ్యులు, ప్రముఖ దర్శకులు ఏ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, హీరోయిన్లు ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గామా' సీఈవో సౌరభ్ కేసరి మాట్లాడుతూ 'ఇది కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న ఈవెంట్ కాదు. కళాకారులపై మా నాన్న త్రిమూర్తులుకు ఉన్న అభిమానంతో అవార్డులు ఇస్తున్నాం. వచ్చే ఏడాది మరింత ఘనంగా నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం. అలాగే ఇతర దేశాల్లోనూ గామా అవార్డులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రపంచంలోని తెలుగు వారందర్నీ అబ్బురపరిచేలా ఈవెంట్‌ను నిర్వహించబోతున్నాం' అని చెప్పారు.

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం 25 ఆగస్టు 2025

సంస్కృతి



సంప్రదాయ సోయగం... అచ్చమైన తెలుగుదనం... ఎమ్మిగనూరు చేనేత వస్త్రం. ఇక్కడి కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకొనే జరీ అంచు సీకో, పట్టు, కాటన్ చీరలు వేటికవే ప్రత్యేకం. కోటగుమ్మాలు, బుట్టలు, ఏనుగులు, పూలు... విభిన్న అంచులతో... నవీన హంగులతో... ఆకట్టుకొంటున్న ఈ చేనేతకు దేశవిదేశాల్లోనూ మంచి ఆదరణ ఉంది. అరుదైన ఈ కళకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే ఉద్దేశంతో... ఇటీవల ఓ సంస్థ జియోగ్రాఫికల్ ఇండెక్స్ (జీఐ) కోరుతూ నివేదిక పంపింది. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు చేనేతలపై 'నవ్య' ప్రత్యేక కథనం.

ఎమ్మిగనూరు చేనేత...
మన సంస్కృతికి చిహ్నం

కర్నూలు జిల్లాలో చేనేతపురిగా ఖ్యాతి పొందింది... ఎమ్మిగనూరు పట్టణం. మూడు వేల కుటుంబాలు ఇక్కడ చేనేతపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ అరుదైన కళకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. 1930ల్లో పేదరికం, నిరుద్యోగం, కరువు, ఆకలి చావులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న వేళ మగ్గం ఆదుకుంది. ఆకలి తీర్చింది. పద్మశ్రీ పురస్కార గ్రహీత, దివంగత మాచాని సోమప్ప 1938లో 'ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం లిమిటెడ్'ను స్థాపించారు. స్వాతంత్ర్యానికి ముందే సహకార వ్యవస్థకు బీజం వేశారు. నేతన్నలకు ఉపాధి కల్పించారు. ఆయన కృషితో అత్యుత్తమ చేనేత వస్త్రాలకు ఎమ్మిగనూరు ఒక బ్రాండ్‌గా ఎదిగింది. జిందగీ దుప్పట్లు, బర్ఫ్ ఐ తువాళ్లు, లుంగీలు, చేతి రుమాళ్లు, దోమతెరలు, దోతీలు, చీరల తయారీకి కేంద్రంగా మారింది. ఎప్పటికప్పుడు వినూత్న హంగులు అద్దుతూ ఆకట్టుకొంటున్న నేతన్నలు... తరువాతి కాలంలో జరీ అంచు కుట్టు సీకో, పట్టు, కాటన్ చీరలు రూపొందించడం ప్రారంభించారు. సహజసిద్ధమైన రంగులు, సంప్రదాయ సొగసులతో విభిన్న డిజైన్ల చీరలు నేస్తున్నారు. వారసత్వంగా వస్తున్న కళకు జీవం పోస్తూ... ప్రత్యేకతను చాటుకొంటున్నందుకు గానూ గతంలో జాతీయ పురస్కారం సైతం అందుకున్న ఘనత ఇక్కడి కళాకారులది.

ఎంతో ప్రత్యేకం...

సీకో, పట్టు చీరల తయారీకి బెంగళూరు, ధర్మవరం, రాయదుర్గం నుంచి నాణ్యమైన పట్టును నేతన్నలు దిగుమతి చేసుకొంటున్నారు. వీరు తయారు చేసే చీరలకు మరో ప్రత్యేకత ఉంది. అదే 'కుట్టు'. అంటే అల్లిక. సాధారణంగా చీర నేసేటప్పుడు ఈ చివర నుంచి ఆ చివరకు ఒకే దారం వేస్తారు. కానీ ఇక్కడ అంచును, చీర బాడీని విభిన్న రంగు దారాలతో కలుపుతూ కుట్టు వేస్తారు. ఈ చీరలను హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, బెంగళూరు, కోల్‌కత్తా తదితర ప్రధాన నగరాలకు సరఫరా చేస్తారు. అక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ తదితర దేశాలకు కూడా ఎగుమతి అవుతాయి.

ఐదు వేల కుటుంబాలకు...

ఒక చీర నేయడానికి డిజైన్, జరీ బుట్టల సంఖ్యను బట్టి ఐదు నుంచి పన్నెండు రోజుల సమయం పడుతుంది. జరీ అంచు కాటన్ చీరకు రూ.3 వేలు, సీకో చీరకు రూ.3,500 నుంచి రూ.4 వేలు, పట్టు చీరకు రూ.5 నుంచి 8 వేలు, టర్నింగ్ బోర్డర్ చీరకు గరిష్టంగా రూ.12 వేల వరకు కూలీ చెల్లిస్తారు. ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని ప్రాంతాల్లో 120 మందికిపైగా మాస్టర్ వీవర్స్ ఉన్నారు. దాదాపు ఐదు వేల చేనేత కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు.

అంతర్జాతీయ గుర్తింపు కోసం...

స్వాతంత్ర్యానికి పూర్వమే ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు ఎనలేని గుర్తింపు తీసుకువచ్చారు మాచాని సోమప్ప. చెక్క మగ్గంపై నేతన్నలు ఉత్పత్తి చేసే జిందగీ దుప్పట్లు, బర్ఫ్ ఐ తువ్వాళ్లు వారి నైపుణ్యానికి అద్దం పడతాయి. 'నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' పంపిణీ చేసే మృదువైన నూలు దారాలను వీటి తయారీకి ఉపయోగిస్తున్నారు. ఇక్కడ మాత్రమే ఉత్పత్తి చేసే ఈ చేనేతలకు అంతర్జాతీయ గుర్తింపును ఇచ్చే జియోగ్రాఫికల్ ఇండెక్స్ (జీఐ) లేదు. దాని కోసం హైదారాబాద్‌కు చెందిన 'రిజల్యూట్ బీ2బీ' సంస్థ ఎమ్మిగనూరులో క్షేత్ర స్థాయిలో పర్యటించింది. ఒక నివేదిక సిద్ధం చేసి, జీఐ కోసం సంబంధిత శాఖకు పంపించింది. అంతేకాదు... కేంద్ర ప్రభుత్వం 2025-26కు 'ఒక జిల్లా- ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) కింద ఎమ్మిగనూరు చేనేతలను ఎంపిక చేసింది.

'మిస్ వరల్డ్'లో మెరుపులు...

గద్వాల పట్టు చీరలుగా మార్కెట్‌లో అమ్మకాలు సాగించే ఎమ్మిగనూరు చేనేతలు 'మిస్ వరల్డ్'లో పోటీపడ్డ అందగత్తెల మనసు దోచుకున్నాయి. హైదరాబాద్‌లో ఈ ఏడాది మేలో జరిగిన ఈ మెగా ఈవెంట్‌కు వచ్చిన విదేశీ భామలు... ఓరుగల్లు, వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయాలను సందర్శించారు. ఆ సమయంలో కొందరు అందగత్తెలు ఎమ్మిగనూరు పట్టు చీరలు, పరికిణీలు ధరించి అలరించారు.

● గోరంట్ల కొండప్ప, కర్నూలు
ఫొటోలు, ఎస్ఎండీ రఫీ

బతుకుతూ... బతుకునిస్తూ...



నేను మాస్టర్ వీవర్‌ని. జరీ అంచు పట్టు, సీకో చీరలు తయారు చేస్తున్నాను. మగ్గమే నాకు ఆధారం. నేనే కాకుండా... మరో యాభై మంది మహిళలకు కూడా ఉపాధి కల్పిస్తున్నాను. అందుకు నాకు ఎంతో సంతృప్తిగా, సంతోషంగా ఉంది. మా అమ్మ లక్ష్మమ్మ, నాన్న కాశీనాథప్పలది నందవరం గ్రామం. మేం ముగ్గురు సంతానం. అందరికీ చేనేతే జీవనాధారం. ఈ కళ నాకు వారసత్వంగా వచ్చింది. నేను ఆరో తరగతిలో ఉండగా, చదువు మాన్పించి ఇంట్లో వాళ్లు మగ్గంపై నేయడం నేర్పించారు. తరువాత ఎమ్మిగనూరుకు చెందిన ఈరన్నకు ఇచ్చి నా పెళ్లి చేశారు. మాకు ఇద్దరు కూతుళ్లు, కొడుకు. అత్తింటివారికి కూడా మగ్గమే ఆధారం. నేను, మావారు పట్టు చీరలు నేసేవాళ్లం. మాస్టర్ వీవర్ అయిన మావారు... ఆర్థిక స్థోమత లేని కార్మికులకు మగ్గాలు ఇచ్చి ఆదుకున్నారు. అంతా ఆనందంగా సాగిపోతుందనుకున్న సమయంలో అనారోగ్యంతో మావారు మరణించారు. అప్పటి నుంచీ కుటుంబ భారం నా మీద పడింది. ఆత్మస్థైర్యంతో నిలబడ్డాను. నా కళకు మరింత సృజన జోడించి మాస్టర్ వీవర్‌గా రాణిస్తున్నాను. నెలకు దాదాపు వంద చీరలు నేస్తున్నాను. హైదరాబాద్, గద్వాలకు సరఫరా చేస్తున్నాను. అయితే మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహమూ లేదు. అన్‌సీజన్‌లో తక్కువ వడ్డీలకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఆదుకొంటే... ఈ కళను నమ్ముకుని జీవిస్తున్న మాలాంటి కుటుంబాలకు భరోసా కలుగుతుంది.

- జొల్లి శాంతి ఈరమ్మ, మాస్టర్ వీవర్

ఆరోగ్యానిచ్చే అటిక మామిడి!

చాలా అనారోగ్యాలకు సహజ పరిష్కారాలు మన చుట్టూనే ఉన్నా చాలామందికి వాటి గురించి తెలియదు. అలాంటి ఓ మొక్క 'అటిక మామిడి'. ఈ మొక్క గురించి వివరాలు తెలుసుకుందాం..



ఈ మొక్కను పునర్నవ మొక్క అని కూడా అంటారు. ఇది రోడ్ల పక్కన, పొలాల్లో, ఖాళీ స్థలాల్లో విరివిగా పెరుగుతుంది. ఇది భారతదేశంతో పాటు ఆసియా, ఆఫ్రికా, అమెరికా దేశాలలోనూ పెరుగుతుంది. ఈ మొక్కకు చిన్నని గులాబీ రంగు పువ్వులు పూస్తాయి. ఈ మొక్కను ఆయుర్వేద వైద్యంలో వినియోగిస్తారు. దీనిని మూత్రపిండాల సమస్యలను తగ్గించేందుకు వాడతారు.

కాలేయ సమస్యలు, రక్తహీనత, ఉబ్బసం, వాపులు తగ్గించేందుకు కూడా వినియోగిస్తారు. ఇంకా ఈ మొక్క వేరులను అధిక మూత్ర విసర్జన సమస్యకు పరిష్కారంగా వాడతారు. ఈ మొక్క మధుమేహం, రక్తపోటును నియంత్రణలో ఉంచేందుకు ఉపయోగపడుతుంది. అలాగే నేలంతా పరుచుకుని నేల కోతకు గురి కాకుండా కాపాడుతుందీ మొక్క.

● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

నోటి పూత తగ్గేదెలా?




శరీరంలో పోషకాలు తగ్గితే రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. అందులో నోటిపూత కూడా ఒకటి. కొందరికి తరచూ ఈ సమస్య తలెత్తుతుంది. దీని వలన తినడానికి, తాగడానికే కాదు మాట్లాడడానికి కూడా చాలా ఇబ్బంది అవుతుంది. దీని నుంచి ఎలా ఉపశమనం పొందాలో తెలుసుకుందాం..

- తేనెలో ఉండే యాంటీ మైక్రోబియల్ గుణాలు నోటిపూత నుంచి ఉపశమనం కలిగిస్తాయి. కాబట్టి నోటిలో పుండ్లకు తేనె రాయాలి.
- కొబ్బరి నీరు తాగడం వలన కూడా నోటి పూతను తగ్గించుకోవచ్చు. అలాగే కొబ్బరి నూనె రాయడం, కొబ్బరి నమలడం వలన కూడా ప్రయోజనం ఉంటుంది.
- నోటి అపరిశుభ్రత వలన కూడా నోటి పూత వస్తుంది. కాబట్టి ప్రతిరోజూ రెండుసార్లు బ్రష్ చేసుకోవాలి.
- నోటి పూతకు ఓ ముఖ్య కారణం బి విటమిన్ లోపం. కాబట్టి బి విటమిన్, పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలి.

మైలురాయి రంగుల మర్మం ఇదే..!

మనం రోడ్డు మీద నడుస్తున్నప్పుడు, బస్సు లేదా రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు రకరకాల రంగుల్లో ఉన్న మైలురాళ్లను చూస్తూ ఉంటాం. మైలురాయి కింది భాగంలో తెలుపు రంగు ఉంటుంది. దీనిమీద నిర్ణీత నగరానికి లేదా గ్రామానికి ఉన్న దూరం.. కిలోమీటర్లలో రాసి ఉంటుంది. పై భాగంలో పసుపు, ఆకుపచ్చ, నీలం, కాషాయం రంగుల్లో ఒకటి ఉంటుంది. దీనిమీద కొన్ని ఆంగ్ల అక్షరాలు, కొన్ని నెంబర్లు ఉంటాయి. ఇలా మైలురాయి మీద ఉన్న ఒక్కో రంగు... ఆ రహదారికి సంబంధించిన సమాచారాన్ని సూచిస్తుంది. ఆ వివరాలు...



- పసుపు-తెలుపు రంగుల మైలురాయి ఉంటే ఆ రహదారి నేషనల్ హైవే అని అర్థం. ఇలాంటి రోడ్లు దేశంలోని ప్రధాన నగరాలను, రాష్ట్రాలను కలుపుతుంటాయి. వీటిని సుదూర ప్రయాణాలు, వేగంగా వెళ్లే వాహనాలకు అనుకూలంగా రూపొందిస్తారు. ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా పసుపు రంగు స్పష్టంగా కనిపిస్తుంది. కాబట్టి మైలురాయిమీద పసుపు రంగు వేసి ఎన్‌హెచ్ (నేషనల్ హైవే) నెంబరు రాస్తారు.



- ఆకుపచ్చ-తెలుపు రంగుల మైలురాయి కనిపిస్తే ఆ రహదారి స్టేట్ హైవే అని అర్థం. ఈ రోడ్లు రాష్ట్రంలోని నగరాలను, పట్టణాలను కలుపుతాయి. వీటి మీద ఎస్‌హెచ్(స్టేట్ హైవే) నెంబరు ఉంటుంది.



- నీలం లేదా నలుపు-తెలుపు రంగుల మైలురాయి... సిటీ రోడ్ లేదా డిస్ట్రిక్ట్ రోడ్‌లను సూచిస్తుంది. ఇవి పట్టణ కేంద్రాలు, మునిసిపాలిటీలను అనుసంధానిస్తాయి.



- కాషాయం-తెలుపు రంగుల మైలురాయి... విలేజ్ రోడ్‌ను సూచిస్తుంది. ఈ రోడ్లు జిల్లాలోని గ్రామాలను కలుపుతుంటాయి. నారింజ రంగును గ్రామీణాభివృద్ధికి సూచికగా పరిగణిస్తారు. అందుకే గ్రామాల మధ్య రాకపోకలకు అనువుగా ఈ రోడ్లను నిర్మిస్తారు.





ఫ్యాషన్ వరల్డ్‌లో దశ దిశలా...

విశ్వవేదికపై భారత్‌కు ప్రాతినిధ్యం వహించడమంటే సాధారణ విషయం కాదు. అందులోనూ ఫ్యాషన్ వరల్డ్ అంటే పోటీ తీవ్రంగా ఉంటుంది. అటువంటి పోటీల్లో తొలిసారి పాల్గొని ఓవరాల్ విన్నర్‌గా నిలిచింది విశాఖకు చెందిన దిశ పల్నాటి. దుబాయ్ వేదికగా జరిగిన మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్ పోటీల్లో పాల్గొని దిశ తన ప్రతిభను చాటింది. ఈ సందర్భంగా 'నవ్య'తో పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లో...

"మాది విశాఖపట్నం. నాన్న పీఎస్ రవికుమార్ ఇండియన్ నేవీలో కెప్టెన్‌గా పని చేస్తున్నారు. అమ్మ వాలంటీనాకు ఫ్యాషన్ రంగంతో సంబంధం ఉంది. జాతీయ స్థాయిలో నిర్వహించిన అనేక కల్చరల్ ఫెస్ట్‌లకు అమ్మ డైరెక్టర్‌గా వ్యవహరించింది. చిన్నప్పటి నుంచి అమ్మను చూస్తూ పెరిగిన నాకు తెలియకుండానే ఫ్యాషన్ రంగం పట్ల ఆసక్తి పెరిగింది. నేను నాలుగో తరగతి చదువుతున్న సమయంలో దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో 'లిటిల్ మోడల్ ఎర్త్' పోటీల్లో పాల్గొన్నా. చిన్నపిల్లల కేటగిరిలో 'సూపర్ గ్రాండ్ ప్రీ' విన్నర్‌గా నిలిచాను. ఆ తరువాత 2016లో గ్రీస్‌లో నిర్వహించిన 'లిటిల్ మిస్ యునైటెడ్ వరల్డ్' పోటీల్లో పాల్గొన్నా. దాంట్లో కూడా రెండు విభాగాల్లో నాకు బహుమతులు దక్కాయి. ఈ పురస్కారాలు నాలో కొత్త ఉత్సాహాన్ని రేకెత్తించాయి. 2018లో టర్కీలో జరిగిన లిటిల్ మిస్ యూనివర్స్ పోటీల్లో 'క్వీన్ ఆఫ్ యూనివర్స్' టైటిల్ దక్కించుకున్నా. ప్రస్తుతం నేను మణిపాల్ జైపూర్ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ చేస్తున్నా.

దేశాన్ని ప్రతిబింబించేలా..

ఇటీవల దుబాయ్ వేదికగా నిర్వహించిన మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్-2025 కాంపిటీషన్‌లో పాల్గొన్నా. ఈ పోటీల్లో 19 దేశాల నుంచి లిటిల్, టీన్, మిస్, మిసెస్ కేటగిరీల నుంచి 60 మంది పాల్గొన్నారు. ఈ పోటీల ప్రత్యేకత ఏమిటంటే- వీటిలో వ్యక్తిగతంగా ఎవరికీ గుర్తింపు ఉండదు. అందరూ తమ తమ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. తొలిరోజు క్యాట్‌వాక్ సెషన్ జరిగింది. ఆ తరువాత నేషనల్ కాస్ట్యూమ్ రౌండ్ నిర్వహించారు. ఈ రౌండ్‌లో ఇన్‌క్రెడిబుల్ ఇండియా థీమ్‌తో దేశాన్ని ప్రతిబింబించేలా కాస్ట్యూమ్ వేసుకున్నా. బ్లూ శారీ, వింగ్స్. తలపై కిరీటం పెట్టుకున్నా. దానిపై జాతీయ పక్షి నెమలి ఉండేట్టు చూసుకున్నా. 'నీ బట్టలకు నేవీ బ్లూ ఎందుకు వాడారు?' అని జడ్జీలు ప్రశ్నించారు. "తాతగారు నేవీలో పనిచేశారు. నాన్న ఇప్పుడు పనిచేస్తున్నారు. అందుకోసమే.. వారికి గౌరవ సూచకంగా ఈ రంగు బట్టలు వేసుకున్నా" అని చెప్పాను. ఆ తర్వాత- " చీర అంటే ఏమిటి " అని అడిగారు. " శరీరాన్ని చూపించకుండా అందాన్ని చూపించేది చీర.. మా దేశ సంప్రదాయానికి ప్రతీక" అని చెప్పాను. జడ్జీలు మెచ్చుకొని నాకు బెస్ట్ కాస్ట్యూమ్ అవార్డు ఇచ్చారు. ఆ తర్వాత ఇంటర్వ్యూ రౌండ్, గ్రాండ్ సీ కాస్ట్యూమ్ రౌండ్, టాలెంట్ రౌండ్‌లు జరిగాయి. అన్ని కేటగిరీలు పూర్తయిన తరువాత విజేతల ప్రకటన దశ వచ్చింది. మూడు కేటగిరీల్లో విజేతలను ప్రకటించారు. టీన్ కేటగిరీ పేరు అనౌన్స్ చేయగానే అంతా ఇండియా అంటూ నినాదాలు చేశారు. అయితే అనూహ్యంగా బల్గేరియాకు టీన్ కేటగిరీ విన్నర్ అవార్డును ఇచ్చారు. దాంతో నాకు అవార్డు రాలేదని నిరాశ చెందా. బాధపడ్డా. ఆ తర్వాత ఈ సారి ఓవరాల్ విన్నర్ అవార్డులు ఇస్తున్నామని ప్రకటించారు. అందులో ఇండియా పేరును ప్రకటించడంతో నా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఇండియన్ నేవీలో చేరతా..

ఫ్యాషన్ పట్ల చిన్నప్పటి నుంచి అమ్మను చూసి ఆసక్తి పెరిగింది. ఆసక్తి ఉన్న రంగంలోనే ఎదగాలని.. ఎవరో ఏదో అనుకుంటారని ఆగిపోకూడదని అమ్మ నాన్న చెప్పేవారు. నేను ఆ దారిలోనే ప్రయాణిస్తున్నా. నాకు ఫ్యాషన్ ఒక హాబీ. కానీ నేవీలో చేరడమనేది నా కల. ఇక మీదట దాని కోసమే ప్రయత్నిస్తా.

● బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

తాజా కూరగాయలను ఇలా గుర్తించాలి...!




బజార్లో కూరగాయలు కొనేటప్పుడు అన్నీ బాగున్నట్లే కనిపిస్తుంటాయి. కానీ ఇంటికి తెచ్చిన మరుసటి రోజే పాడైపోతూ ఉంటాయి. అలాకాకుండా చిన్న చిట్కాలతో తాజా కూరగాయలను ఎలా గుర్తించాలో తెలుసుకుందాం...

- బంగాళ దుంపలు గుండ్రంగా, గోధుమ రంగులో ఉండాలి. ఆకుపచ్చ లేదా నల్లని మచ్చలు ఉన్న వాటిని కొనకూడదు. దుంప గట్టిగా ఉండాలి. ఏమాత్రం మెత్తగా అనిపించినా అవి తొందరగా పాడవుతాయని గుర్తించాలి.
- నాలుగు లేదా అంతకుమించి తమ్మెలు ఉన్న క్యాప్సికమ్... ఎక్కువ గింజలతో తియ్యగా ఉంటుంది. మూడు తమ్మెలు ఉన్నవి ఒక్కోసారి చేదుగా ఉండవచ్చు.
- టమాటాలు కొనేటప్పుడు లేత పసుపు రంగులో గుండ్రంగా గట్టిగా ఉన్నవాటిని ఎంచుకోవాలి. ఎర్రగా మెత్తగా ఉండేవి తొందరగా పాడవుతాయి. ఆకుపచ్చగా కనిపించేవి చేదుగా ఉండవచ్చు.
- బీన్స్ కొనేటప్పుడు ఒకదాన్ని మధ్యకు విరిస్తే తేలికగా విరిగినట్లయితే అవి తాజావని గుర్తించాలి. ఆకుపచ్చని రంగులో సన్నగా నిటారుగా ఉన్నవి కూరకు బాగుంటాయి. లేత పసుపు రంగులో కాస్త లావుగా ఉంటే అవి ముదిరినవని అర్థం.
- పొట్లకాయ, సొరకాయలను బొటనవేలి గోటితో గుచ్చినప్పుడు లోతైన ఆకుపచ్చని గుర్తు ఏర్పడితే అవి తాజా కాయలని చెప్పవచ్చు.
- బెండకాయలు నున్నగా, సన్నగా ఉంటే లేత కాయలని తెలుసుకోవచ్చు. వీటి కొనలను చేత్తో విరిస్తే విరుగుతాయి. అలా విరగకపోయినా వాటిపై సన్నని నూగు కనిపిస్తున్నా, మరీ లావుగా ఉన్నా వాటిని ముదురు కాయలుగా గుర్తించాలి.
- దోసకాయలు.... గట్టిగా ముదురు ఎరుపు రంగులో ఉన్నవాటిని మాత్రమే తీసుకోవాలి. ఇవి పులుపు లేదా తీపి రుచుల్లో ఉంటాయి. బంగారు లేదా లేత పసుపు రంగులో ఉండేవి, ఆకుపచ్చని చారలు ఉన్నవి ఒక్కోసారి చేదుగా ఉండవచ్చు.
- దొండకాయలు కొనేటప్పుడు గట్టిగా ఉన్నవాటినే ఏరుకోవాలి. మెత్తగా ఉంటే పండినవని గుర్తించాలి.

మేకప్

దీపికలా దేదీప్యంగా...



బాలీవుడ్ నటి దీపికా పడుకొనె కాటుక కళ్లకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. అందుకోసం ఆమె అనుసరించే మేకప్ చిట్కాలను తెలుసుకుందాం!

మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవాలన్నా, ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండాలన్నా ముఖం శుభ్రంగా ఉండాలి. కాబట్టి ముఖాన్ని సబ్బుతో కడిగి నునుపుదనం కోసం, మెరిసే బేస్ కోసం హైడ్రేటింగ్ మాయిశ్చరైజర్ పూసుకోవాలి. ఆ తర్వాత మేకప్ నిలిచి ఉండేలా ప్రైమర్‌ను అప్లై చేసుకోవాలి.

- చర్మపు ఛాయను మెరుగుపరిచేలా లైట్‌వెయిట్ ఫౌండేషన్‌ను ఎంచుకుని, నీళ్లలో తడిపి పిండిన స్పాంజ్‌తో ఫౌండేషన్‌ను ముఖం మీద అద్దుకోవాలి.
- కళ్ల దిగువన కన్‌సీలర్‌ను పూసుకుని, మచ్చలు చర్మంలో కలిసిపోయేలా సరి చేసుకోవాలి
- కనురెప్పలకు షిమ్మరింగ్ గోల్డ్ ఐల్యాషెస్ పెట్టుకోవాలి. కోల్ పెన్సిల్‌తో పైన, కింద కనురెప్పలను దిద్దుకోవాలి. తర్వాత వాల్యూమైజింగ్ మస్కారాతో కనురెప్పలను ఒత్తుగా మలుచుకోవాలి
- మెత్తని కాంటూర్ పౌడర్ లేదా క్రీమ్‌తో చెక్కిళ్ల ఎముకలు, దవడ ఎముకలు, నుదురులను చక్కని ఆకృతిలో మలుచుకోవాలి
- ఎత్తైన ప్రదేశాలైన కాలర్‌బోన్స్, ముక్కుల పైన హైలైటర్ అద్దుకోవాలి
- కనుబొమలను బ్రష్ చేసి, ఖాళీ జాగాల్లో బ్రో పెన్సిల్‌తో దిద్దుకోవాలి. క్లియర్ లేదా టింటెడ్ బ్రో జెల్ అద్దుకోవాలి
- న్యూడ్ లేదా మావ్ లిప్ లైనర్‌తో పెదవులకు ఆకృతినివ్వాలి. తర్వాత గ్లాసీ మావ్ లిప్‌స్టిక్‌ను అప్లై చేసి పెదవులను అందంగా తీర్చిదిద్దుకోవాలి
- చివర్లో, సెట్టింగ్ స్ప్రేతో మేకప్‌ను చెక్కుచెదరకుండా లాక్ చేసేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే అందానికి అందం సమకూరడంతో పాటు దీర్ఘకాలం పాటు చెక్కుచెదరని మేకప్ మీ సొంతమవుతుంది.

చికిత స్వర్ణ చరిత్ర

- ఆర్చరీ వరల్డ్ యూత్ చాంపియన్‌షి‌ప్‌లో సత్తా చాటిన తెలుగమ్మాయి
- సూరజ్‌కు రజతం

విన్నిపెగ్ (కెనడా): తెలుగమ్మాయి, యువ ఆర్చర్ తాని పర్తి చికితరావు స్వర్ణ చరిత్ర సృష్టించింది. ఆదివారం కెనడాలో ముగిసిన ఆర్చరీ ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ కాంపౌండ్ విభాగం అండర్-21లో చికిత పసిడి పతకం కొల్లగొట్టింది. ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా ఆర్చర్ చికితానే కావడం విశేషం. హోరాహోరీగా సాగిన ఫైనల్లో 20 ఏళ్ల చికిత 142-133తో స్పెయిన్ ఆర్చర్ పౌలా డియాజ్ మోరిల్లాస్‌పై విజయం సాధించింది. అంతకుముందు సెమీస్‌లో చికిత 142-136తో పార్క్ యెరిన్ (రిపబ్లిక్ ఆఫ్ కొరియా)పై, క్వార్టర్స్‌లో ఆసియా చాంపియన్, భారత్‌కే చెందిన పర్నీత్ కౌర్‌పై 146-143తో గెలిచింది. ఇక, పురుషుల అండర్-18 టీమ్ ఈవెంట్‌లో తెలుగు సంతతికి చెందిన అమెరికా ఆర్చర్ నాళం సూరజ్ కార్తికేయ బృందానికి రజత పతకం లభించింది. సూరజ్ తల్లిదండ్రుల స్వస్థలం రాజమండ్రి. సూరజ్ కూడా గతంలో రాజమండ్రిలో శిక్షణ తీసుకొన్నాడు.



ఆఖరి నిమిషం వరకు టెన్షన్..

'ఆంధ్రజ్యోతి'తో చికిత

మా స్వస్థలం తెలంగాణలోని పెద్దపల్లి. నాన్న శ్రీనివాస రావు రైతు. బాల్యం నుంచి ఆర్చరీపై మక్కువ. దీంతో విలు క్రీడనే కెరీర్‌గా ఎంచుకున్నా. గత రెండు జాతీయ క్రీడల్లో రజత, కాంస్య పతకాలు సాధించా. ఈ ఏడాది జరిగిన ఆసియాకప్‌లో నాలుగో స్థానంలో నిలిచి, త్రుటిలో పతకం కోల్పోయా. అమెరికాలో జరిగిన గత వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించినా వీసా సమస్యతో బరిలోకి దిగలేకపోయా. ఈసారి వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌నకు వీసా లభించినా కెనడా ఎయిర్‌లైన్స్ సమ్మె కారణంగా మా ప్రయాణ షెడ్యూల్ మొత్తం తలకిందులైంది. ఆఖరి నిమిషం వరకు కెనడా వెళ్లేందుకు మార్గం సుగమం కాలేదు. భారత్ నుంచి మొత్తం 36 మందితో కూడిన బృందం అక్కడికి వెళ్లాల్సి ఉండగా సమ్మె కారణంగా విడతల వారీగా వెళ్లాల్సి వచ్చింది. చివరి విడతకు వచ్చేసరికి ప్రయాణ అవకాలన్నీ దాదాపుగా మూసుకుపోగా 'సాయ్' అధికారుల గట్టి ప్రయత్నంతో నాతో పాటు మరో ఐదుగురు ఆర్చర్లు పోటీలకు కొన్ని గంటల ముందు కెనడాలో అడుగు పెట్టాం. సరైనా విశ్రాంతి లేకుండానే తొలి రెండు రౌండ్లలో పాల్గొన్నా. ఉత్కంఠభరితంగా జరిగిన క్వార్టర్స్‌లో ఆసియా చాంపియన్ పర్నీత్ కౌర్‌పై గెలిచాక పసిడి పతకం గెలుస్తానన్న నమ్మకం కలిగింది. అదే ఆత్మవిశ్వాసంతో సెమీస్, ఫైనల్‌లో పోటీపడి ఫలితం రాబట్టా. సీనియర్ క్రీడాకారుడు అభిషేక్ వర్మ సలహాలు సూచనలతో ఈ విజయం సాధించగలిగా.





అనిమేశ్.. అదిరెన్!

- 200 మీటర్ల రేసులో ప్రపంచ చాంపియన్‌షిప్ బెర్త్
- ఈ ఘనత సాధించిన తొలి భారత పురుష స్ప్రింటర్

న్యూఢిల్లీ: యువ స్ప్రింటర్ అనిమేశ్ కుజుర్ రికార్డు సృష్టించాడు. 200 మీటర్ల రేసులో ప్రపంచ చాంపియన్‌షిప్ బెర్త్ దక్కించుకున్నాడు. చెన్నైలో జరుగుతున్న జాతీయ అంతరాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చత్తీస్‌గఢ్‌కు చెందిన అనిమేశ్.. 200 మీటర్ల రేసును 20.63 సెకన్ల రికార్డు టైమింగ్‌తో అధిగమించి స్వర్ణం సాధించాడు. ఈ ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో మెరుగైన అనిమేశ్.. వచ్చేనెల 13 నుంచి టోక్యో వేదికగా జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాడు. ప్రపంచ టోర్నీలో 200 మీటర్ల రేసులో మొత్తం 48 మంది అథ్లెట్లు పోటీపడతారు. అయితే వీరిలో కొందరు కటాఫ్ టైమింగ్ (20.15 సెకన్లు)తో నేరుగా ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైతే, మరికొందరికి ర్యాంకింగ్స్ ఆధారంగా బెర్త్ దక్కుతుంది. అంతరాష్ట్ర టోర్నీకి ముందు ప్రపంచ టోర్నీ రేసులో 42వ స్థానంలో ఉన్న అనిమేశ్.. తాజా ప్రదర్శనతో ర్యాంకింగ్స్‌లో ముందుకెళ్లి బెర్త్ సాధించినట్టు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది. ఈ క్రమంలో ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన తొలి పురుష స్ప్రింటర్‌గా 22 ఏళ్ల అనిమేశ్ చరిత్ర సృష్టించాడు.

నందిని దూరం

తెలుగు అథ్లెట్ నందిని అగసర ప్రపంచ చాంపియన్‌షిప్ నుంచి వైదొలిగింది. తెలంగాణకు చెందిన నందిని ఇప్పటికే హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో ప్రపంచ టోర్నీకి ఎంపికైనా.. గాయం కారణంగా టోక్యో క్రీడల్లో పాల్గొనడం లేదని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన నందిని.. ఆ ప్రదర్శనతో ప్రపంచ టోర్నీకి బెర్త్ దక్కించుకుంది. అయితే, ఆసియా చాంపియన్‌షిప్ సందర్భంగానే మోచేతికి గాయమైందనీ, తానింకా కోలుకోకపోవడంతోనే టోక్యో ఈవెంట్‌కు దూరమవుతున్నట్టు 22 ఏళ్ల నందిని స్పష్టం చేసింది.





రెండు స్వర్ణాలూ మనవే!

- ఐశ్వరీ, అడ్రియన్‌కు టైటిళ్లు
- ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్ సీనియర్, జూనియర్ విభాగాల్లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. ఆదివారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3-పీ సీనియర్, జూనియర్ విభాగాల స్వర్ణ పతకాలు రెండూ మనోళ్లే కొల్లగొట్టారు. సీనియర్ పురుషుల 50 మీ. రైఫిల్ 3-పీ విభాగం తుది పోరులో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ టోమర్ 462.5 పాయింట్లతో పసిడి అందుకున్నాడు. చైనా, జపాన్ రజత, కాంస్యాలు నెగ్గాయి. అంతకుముందు..ఐశ్వరీ ప్రతాప్, చెయిన్ సింగ్, షెరాన్ త్రయం 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్స్ టీమ్ విభాగంలో రజత పతకం చేజిక్కించుకుంది. జూనియర్ పురుషుల 50 మీ. రైఫిల్ 3-పీ కేటగిరీ ఫైనల్లో అడ్రియన్ కర్మాకర్ (463.8) ఆసియా రికార్డుతో స్వర్ణం సొంతం చేసుకున్నాడు. హాన్ (చైనా) రజతం, వేదాంత్ నితిన్ (భారత్) కాంస్య పతకాలు సాధించారు. వేదాంత్, అడ్రియన్, రోహిత్‌తో కూడిన భారత జట్టు 50 మీ. రైఫిల్ 3-పీ టీమ్ పసిడి పతకం నెగ్గింది.

అమ్మాయిలు.. అదే జోరు

- భారత్ హ్యాట్రిక్ విజయం
- శాఫ్ అండర్-17 చాంపియన్‌షిప్

థింపూ (భూటాన్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 చాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిల దూకుడు కొనసాగుతోంది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ప్రత్యర్థిని చిత్తుచేసి హ్యాట్రిక్ విజయాన్నందుకున్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన పోరులో భారత్ 8-0తో ఆతిథ్య భూటాన్‌ను ఓడించింది. అనుష్క కుమారి (53వ, 61వ, 73వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించి భారత్ భారీ గెలుపులో కీలకపాత్ర పోషించింది. అభిస్త బాస్నెట్ (23వ, 89వ) రెండు.. పెర్ల్ ఫెర్నాండెజ్ (71వ), దివ్యాని లిండా (77వ), వలైనా ఫెర్నాండెజ్ (90+2వ నిమిషం) తలో గోల్ కొట్టారు. దీంతో టోర్నీలో ఓటమన్నదే లేని భారత అమ్మాయిలు.. మూడు విజయాలతో మొత్తం 9 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. బంగ్లాదేశ్, నేపాల్ చెరో మూడు పాయింట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఉక్కు సంకల్పం

చటేశ్వర్ పుజార.. టెస్టు క్రికెట్‌కు అసలు సిసలైన పర్యాయపదం. యుద్ధభూమిలో సైనికుడి మాదిరి పట్టుదల, ఓర్పు అతడి సొంతం. ఓవైపు వికెట్లు పడుతున్నా నేనున్నాగా అనే భరోసాతో క్రీజులో గంటలకొద్దీ పాతుకుపోయి అతనాడిన ఇన్నింగ్స్ ఎన్నెన్నో. అతడికి బంతులు వేసీ వేసీ బౌలర్ల భుజాలు నొప్పి పుట్టాల్సిందేగానీ అతను మాత్రం అంత సులువుగా పెవిలియన్ చేరడు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలో బౌన్సీ, సీమ్ పిచ్‌లపై పేసర్ల బుల్లెట్‌లాంటి బంతులకు ఒళ్లు హూనమవుతున్నా బెదరకుండా శతకాలతో జట్టును గెలిపించిన ధీరుడు. టీమిండియా నయా వాల్‌గా మన్ననలందుకున్న ఈ సౌరాష్ట్ర హీరో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.

నయా వాల్ నిష్క్రమణ

క్రికెట్‌కు పుజార వీడ్కోలు

వన్‌డౌన్‌లో తిరుగులేని బ్యాటర్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఆశలు కొడిగడుతున్న వేళ.. అలుపెరుగని యోధుడిలా అవకాశాలు సృష్టిస్తాడు. ప్రత్యర్థుల దెబ్బకు జట్టు అల్లకల్లోలమైనా.. నేనున్నానంటూ ధీశాలిలా ఎదురొడ్డుతాడు. ఓర్పు.. నేర్పుతో పరిస్థితులను చక్కదిద్దుతాడు.. తర్వాతి బ్యాటర్లకు భరోసాగా నిలుస్తాడు. అతడే భారత జట్టు నయా వాల్ చటేశ్వర్ పుజార. దశాబ్దానికి పైగా టీమిండియాకు పెట్టని కోటగా నిలిచిన పుజార శకం ముగిసింది.

కోహ్లీలా కవర్ డ్రైవ్ ఆడలేడు.. రిషభ్ పంత్‌లా విధ్వంసం సృష్టించనూలేడు. బంతిని బలంగా బాదుతూ.. వీక్షకులకు వెర్రెత్తిస్తున్న టీ20 జమానాలో.. క్లాసిక్ క్రికెట్‌కు మచ్చుతునక! టీమిండియా వాల్ రాహుల్ ద్రవిడ్ రిటైరైనప్పుడు.. నేనున్నానంటూ జట్టుకు అండగా నిలిచాడు. నిస్వార్థం, ఉక్కు సంకల్పంతో.. మూడో నెంబర్‌లో గుబాళించాడు. ఆటగాడిగా పెద్దగా స్టార్‌డమ్ లేకపోవచ్చు.. అంతులేని అభిమాన గణం మాత్రం అతని సొంతం.

ఫోర్లు, సిక్సులు, స్ట్రయిక్ రేట్‌తో పుజార సేవలను కొలవలేం. జట్టు కోసం సర్వస్వం ధారపోస్తాడు. ప్రపంచంలోని అత్యుత్తమ బౌలింగ్‌ను ఎదుర్కొని.. జట్టును ప్రమాదం నుంచి గట్టెక్కించేందుకు శతవిధాలా పాటుపడతాడు. బుల్లెట్‌లాంటి బంతులు శరీరాన్ని తాకుతున్నా.. అదరడు.. బెదరడు. కోహ్లీ లాంటి వాళ్లు టెస్టుల్లో శాతకాల మీద శతకాలు బాదొచ్చు.. కానీ, దానికి బలమైన పునాది మాత్రం పుజారానే!

మాజీ రంజీ ఆటగాడు అరవింద్ కుమారుడే చటేశ్వర్ పుజార. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన పుజారకు చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ ఉండేది. చిన్నవయసులోనే తల్లిని కోల్పోవడంతో.. పుజారకు అరవింద్ అన్నీ తానై చూసుకొన్నాడు. అసలుసిసలు టెస్టు క్రికెట్ మనస్తత్వాన్ని అతడిలో నాటుకొనేలా చేశాడు. తన తల్లి మరణించినప్పుడు కూడా పుజార ఆ బాధను బయటకు కనిపించకుండా తనలోనే తాను దిగమింగుకోవడం అతడి సహనశీలతకు నిదర్శనమని అరవింద్ ఒకానొక సమయంలో చెప్పాడు. అండర్-14 క్రికెట్‌లో త్రిశతకం బాదిన పుజార ఇంగ్లండ్‌లో అండర్-19 విభాగంలో డబుల్ సెంచరీ సాధించాడు. స్ట్రోక్ ప్లేయర్ కాకపోయినా.. పటిష్టమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి బౌలర్లను అలసిపోయేలా చేస్తాడు. గంటల కొద్దీ క్రీజులో ఉన్నా ఏమాత్రం అలసట దరిచేరనీయకుండా ఆడడం అతడి ప్రత్యేకత. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించిన చటేశ్వర్.. 2010లో బెంగళూరులో ఆస్ట్రేలియాపై అరంగేట్రం చేశాడు. పదేళ్లకుపైగా భారత టెస్టు క్రికెట్‌కు వెన్నుముకగా నిలిచిన పుజార 2023లో చివరగా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడాడు. గాయాలు, వరుస వైఫల్యాలతో జట్టులో చోటు కోల్పోయాడు.

మాటల్లో పొదుపు..



'ద డైరీ ఆఫ్ ఏ క్రికెటర్స్ వైఫ్: ఎ వెరీ అన్ యూజువల్ మెమోయిర్' పుస్తకంలో తన భర్త స్వభావం గురించి పుజార భార్య పూజ కొన్ని విషయాలు పంచుకొంది. 'తక్కువగా మాట్లాడతాడు. చిరునవ్వుతో పనైపోతుందనుకొంటే.. మౌనం పాటిస్తాడు. అతడి నోటి వెంట పదాలు పొదుపుగా వెలువడతాయి. ఈ తరం క్రికెటర్లకు భిన్నం' అని రాసింది. పుజార కెరీర్ కోసం అతని కుటుంబం చేసిన త్యాగాల గురించి రాసుకొచ్చింది. ఇక భగవద్గీత తమ జీవితాల్లో చూపిన ప్రభావం గురించి తన పుస్తకంలో వివరించింది.



న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో సీనియర్ల రిటైర్మెంట్ కొనసాగుతూనే ఉంది. తాజాగా చటేశ్వర్ పుజార 15 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకొంటున్నట్టు ఆదివారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. సౌరాష్ట్రకు చెందిన 37 ఏళ్ల పుజార 2010లో ఆస్ట్రేలియాపై బెంగళూరులో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. దశాబ్దానికి పైగా వన్‌డౌన్ స్థానంలో జట్టుకు నమ్మదగ్గ బ్యాటర్‌గా సేవలందించాడు. ఈక్రమంలో జట్టుకు ఇంటా, బయటా చిరస్మరణీయ విజయాలు అందించాడు. కెరీర్‌లో ఆడిన 103 టెస్టుల్లో 43.60 సగటుతో 7,195 పరుగులు సాధించాడు. ఇందులో మూడు డబుల్ సెంచరీలు, 16 శతకాలున్నాయి. ఇక ఐదు వన్డేల్లో 51 పరుగులున్నాయి. జూన్, 2023లో జరిగిన వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ పుజార కెరీర్‌లో చివరిది. ఆ తర్వాత కొత్త తరం ఆటగాళ్లపై మేనేజ్‌మెంట్ దృష్టి సారించడంతో అతనికి ద్వారాలు మూసుకుపోయాయి. అయినా దేశవాళీల్లో సౌరాష్ట్ర, కౌంటీల్లో ససెక్స్ తరపున కొనసాగాడు. ఓవరాల్‌గా కెరీర్ మొత్తంలో పుజార 278 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 51.82 సగటుతో 66 శతకాలు, మూడు ట్రిపుల్ సెంచరీలతో 21,301 పరుగులు చేశాడు.

మారథాన్ ఇన్నింగ్స్‌తో..

ద్రవిడ్ రిటైర్మెంట్ తర్వాత మూడో స్థానంలో పుజార జట్టుకు ఆశాకిరణంగా మారాడు. 2012, జూన్‌లో తొలి టెస్టు సెంచరీ కొట్టాడు. రెండు నెలల తర్వాత స్వదేశంలోనే ఇంగ్లండ్‌పై తొలి డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అయితే క్రీజులో సుదీర్ఘ సమయం గడపడంలో తనను మించిన వారు లేరనే చెప్పవచ్చు. 2013 జొహాన్నెస్‌బర్గ్ టెస్టులో ఆరు గంటలపాటు క్రీజులో నిలిచి 153 పరుగులు సాధించడమే కాదు మ్యాచ్‌ను ఉత్కంఠభరిత డ్రాగా ముగించాడు. 2015లో కొలంబోలోనూ 289 బంతులనెదుర్కొని 145 పరుగులు చేశాడు. ఇక 2017లో రాంచీలో పుజార ఆడిన ఇన్నింగ్స్ గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. ఆసీస్‌తో జరిగిన ఈ టెస్టులో తను ఏకంగా 11 గంటలపాటు పట్టు వదలకుండా పోరాటం సాగించి డబుల్ సెంచరీతో నిలిచాడు. ఈక్రమంలో భారత్ తరపున రికార్డు స్థాయిలో 525 బంతుల (87.5 ఓవర్లు)ను ఆడడం విశేషం. అదే ఏడాది ఈడెన్ గార్డెన్స్‌లో శ్రీలంకపై ఐదు రోజుల పాటు క్రీజులో నిలిచి అరుదైన ఫీట్ సాధించాడు. భారత్ తరపున ఎంఎల్ జైసింహ, రవిశాస్త్రి తర్వాత ఈ ఘనత అందుకున్న మూడో భారత ఆటగాడిగా పుజార రికార్డులకెక్కాడు.

ఆసీస్ గడ్డపై తొలిసారి..

భారత క్రికెట్ చరిత్రలో 2018-19 ఆస్ట్రేలియా పర్యటన చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. ఎందుకంటే ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా తొలిసారి టెస్టు సిరీస్ సాధించగలిగింది. ఈ ఘనతలో పుజారదే కీలక పాత్ర. అడిలైడ్, మెల్‌బోర్న్, సిడ్నీలలో శతకాలు బాదిన తను అత్యధికంగా 521 పరుగులతో జట్టుకు తొలి సిరీస్ విజయాన్నందించాడు. ఆ తర్వాత రెండేళ్లకు భారత్ అక్కడ మరో సిరీస్ గెల్చుకోగలిగింది. ఈసారి పుజార నాలుగు అర్ధశతకాలతో అండగా నిలిచాడు. బ్రిస్బేన్ టెస్టులో ఆసీస్ బౌలర్లు అతడి శరీరాన్ని లక్ష్యంగా చేసుకున్నా నొప్పిని భరిస్తూనే 200కి పైగా బంతులు ఆడి 56 రన్స్ చేయడం గమనార్హం.

క్రికెట్ నాకెంతో ఇచ్చింది..

"రాజ్‌కోట్‌లాంటి పట్టణం నుంచి వచ్చిన నేను చిన్నతనం నుంచే భారత జట్టులో చోటు కోసం కలలు కన్నాను. కానీ క్రికెట్ నాకెంతో ఇవ్వబోతున్నదనే విషయం అప్పట్లో నాకు తెలీదు. కాలక్రమంలో భారత జెర్సీ ధరించి జాతీయ గీతాలాపన చేయడం, జట్టుకు నా తరపున అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించడం.. ఇవన్నీ మాటల్లో వర్ణించలేని అనుభవాలు. కానీ ఎప్పుడైనా సరే ఇలాంటి మధుర అనుభూతులకు కూడా ముగింపు పలకాల్సిందే. అందుకే అపారమైన కృతజ్ఞతతో అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికీ నా ధన్యవాదాలు. కెరీర్ ఆసాంతం నాకు అండగా నిలిచిన బీసీసీఐ, సౌరాష్ట్ర క్రికెట్ సంఘానికి ధన్యవాదాలు. నా మార్గదర్శకులు, కోచ్‌లు, మెంటార్, ఆధ్యాత్మిక గురువు నా ఎదుగుదలలో తోడ్పడ్డారు. ముఖ్యంగా నా తల్లిదండ్రులు, భార్య, కూతురు, ఇతర కుటుంబ సభ్యుల అండ లేకుంటే ఇక్కడిదాకా వచ్చేవాణ్ని కాదు. సహచర క్రికెటర్లు, సహాయక సిబ్బంది, నెట్ బౌలర్లు, అంపైర్లు అనలిస్టులు, గ్రౌండ్ స్టాఫ్, మేనేజ్‌మెంట్‌ల సహకారం కూడా మరువలేనిది." - పుజార

పుజార కెరీర్ ఇలా..

ఫార్మాట్	మ్యాచ్‌లు	పరుగులు	సెంచరీలు
టెస్టులు	103	7,195	19
వన్డేలు	5	51	0
ఫస్ట్ క్లాస్	278	21,301	66

- మూడో స్థానంలో నువ్వు బ్యాటింగ్‌కు వెళ్తున్నప్పుడల్లా అదే భరోసా. ఆడిన ప్రతిసారీ టెస్ట్ క్రికెట్ స్థాయిని పెంచావు. నీ బలమైన టెక్నిక్, సంయమనంతో జట్టుకు మూలస్తంభంగా నిలిచావు. 2018లో ఆస్ట్రేలియాపై గెలుపు నువ్వు లేకుంటే సాధ్యమయ్యేదే కాదు. -సచిన్ టెండూల్కర్
- కష్టకాలంలో జట్టుకు గోడలా అడ్డు నిలిచావు. ఆశలు ఆవిరవుతున్న వేళ.. పోరాటంతో స్ఫూర్తిని రగిలించావు - గంభీర్
- గాబాలో నీ ఆటతో ఫ్యాన్‌గా మారిపోయా. జట్టు కోసం ఏదైనా చేస్తావు. సెకండ్ ఇన్నింగ్స్‌లో నీకు మరిన్ని శుభాలు కలగాలి. - వీవీఎస్ లక్ష్మణ్
- నిజమైన పోరాట యోధుడు. నా హయాంలో జట్టు నెం.1 ర్యాంక్‌ను సొంతం చేసుకోవడంలో పుజారది ముఖ్య భూమిక. ఆస్ట్రేలియాపై వరుసగా సిరీస్ నెగ్గడంలో నీ ప్రదర్శన అమోఘం. - రవిశాస్త్రి
- నిస్వార్థం, దృఢ సంకల్పానికి నిలువెత్తు నిదర్శనం. టెస్ట్ క్రికెట్ స్ఫూర్తిని కొనసాగించావు. అకుంఠిత దీక్షతో జట్టుకు గోడలా నిలిచావు. నిబద్ధతతో దేశ క్రికెట్‌కు సేవలందించావు. - బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా
- క్రికెట్‌కు అత్యుత్తమ రాయబారివి. నీ ఘనతలను చూసి గర్విస్తున్నాం. నీతో కలసి పనిచేసే అవకాశం దక్కడం గొప్పగా భావిస్తున్నా. - కుంబ్లే

సింధు, సేన్‌కు సవాల్





ప్రపంచ చాంపియన్‌షిప్ నేటి నుంచి

పారిస్: ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది. చాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు సాధించిన సింధు ఈ సీజన్‌లో పేలవ ఫామ్‌లో సాగుతోంది. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్స్ చేరడమే ఆమె అత్యుత్తమ ప్రదర్శన. సోమవారం నుంచి జరిగే ప్రపంచ టోర్నీ తొలి రౌండ్‌లో కలోయానా నల్బంటోవాతో సింధు తలపడనుంది. ఒకవేళ ముందుకు సాగితే ప్రీక్వార్టర్స్‌లో వరల్డ్ నెం.2 వాంగ్ జి యి రూపంలో సింధుకు గండం పొంచి ఉంది. లక్ష్య సేన్, ప్రణయ్ ప్రదర్శన కూడా అంతంత మాత్రంగానే ఉంది. పారిస్ ఒలింపిక్స్ సెమీస్‌లో ఓటమి తర్వాత సేన్ కోలుకోలేక పోతున్నాడు. తొలి రౌండ్‌లో షి యు కితో సేన్, జోయాకిమ్‌తో ప్రణయ్ ఆడనున్నారు. డబుల్స్‌లో 9వ సీడ్ సాత్విక్-చిరాగ్, మిక్స్‌డ్‌లో ధ్రువ్-తనీషా జంటలకు తొలిరౌండ్‌లో బై లభించింది. హరిహరన్-రుబన్, ప్రియ-శ్రుతి, రితు-శ్వేత, రోహన్-రుత్విక శివాని జోడీలు బరిలో ఉన్నాయి.

రికార్డుల హోరు

సఫారీలపై ఆఖరి వన్డేలో 276 రన్స్‌తో ఆస్ట్రేలియా గెలుపు



హెడ్ (142)

మెకే (ఆస్ట్రేలియా): దక్షిణాఫ్రికాతో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఆస్ట్రేలియా నామమాత్రమైన మూడో వన్డేలో దుమ్ము రేపింది. టాప్-3 బ్యాటర్లు హెడ్ (142), కెప్టెన్ మిచెల్ మార్ష్ (100), కామెరూన్ గ్రీన్ (118 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కిన వేళ రికార్డులతో హోరెత్తించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఏకంగా 276 పరుగులతో సఫారీలపై ఘన విజయం సాధించింది. తద్వారా వన్డేలలో దక్షిణాఫ్రికాకు అత్యంత భారీ ఓటమిని రుచి చూపించింది. తొలుత ఆతిథ్య జట్టు 50 ఓవర్లలో 431/2 స్కోరు చేసింది. వన్డేలలో ఆసీస్‌కిది రెండో అత్యధిక స్కోరు. అనంతరం యువ స్పిన్నర్ కూపర్ కొనొలీ (5/22) ధాటికి దక్షిణాఫ్రికా 24.5 ఓవర్ల 155 పరుగులకే కుప్పకూలింది. బ్రేవిస్ (49), జోర్జి (33) ఆదుకోకపోతే పర్యాటక జట్టు పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. మొత్తంగా..తొలి రెండు వన్డేలలో ఓడి సిరీస్ చేజార్చుకున్న ఆస్ట్రేలియా ఆఖరి మ్యాచ్‌లో గెలిచి ఓదార్పు దక్కించుకుంది.

కొద్దిలో రికార్డు చేజారింది: అంతకుముందు ఆస్ట్రేలియా వన్డేలలో తమ అత్యధిక స్కోరు 434/4ను తిరగరాసే అవకాశాన్ని 4 పరుగుల తేడాతో కోల్పోయింది. ఆ స్కోరును కూడా సౌతాఫ్రికాపైనే 2006లో సాధించడం గమనార్హం. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఓపెనర్లు హెడ్, మార్ష్ విరుచుకుపడ్డారు. 34 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 250 పరుగులు జత చేశారు. ఎంపాక 6 ఓవర్లలో 73, ముల్డర్ 7 ఓవర్లలో 93, ముత్తుసామి 9 ఓవర్లలో 75 రన్స్ సమర్పించుకున్నారు. 35వ ఓవర్లో హెడ్‌ను కేశవ్..కొద్దిసేపటికే మార్ష్‌ను ముత్తుసామి అవుట్ చేశారు. ఆ తర్వాత గ్రీన్.. బౌలర్ల భరతం పట్టాడు. దాంతో చివరి 10 ఓవర్లలో ఆసీస్ 126 రన్స్ రాబట్టింది. ఈక్రమంలో గ్రీన్ సెంచరీ, కేరీ హాఫ్ సెంచరీ పూరించారు.

ఆస్ట్రేలియా: 50 ఓవర్లలో 431/2 (హెడ్ 142, మార్ష్ 100, గ్రీన్ 118 నాటౌట్, కేరీ 50 నాటౌట్, కేశవ్ మహరాజ్ 1/57, ముత్తుసామి 1/75).

దక్షిణాఫ్రికా: 24.5 ఓవర్లలో 155 ఆలౌట్ (బ్రేవిస్ 49, జోర్జి 33, కొనొలీ 5/22, అబాట్ 2/27, బార్ట్‌లెట్ 2/45).

దిగ్గజాల సరసన..

హాల్ ఆఫ్ ఫేమ్‌లో షరపోవా, బ్రయాన్ బ్రదర్స్



న్యూపోర్ట్ (యూఎస్): మాజీ టెన్నిస్ స్టార్ మరియా షరపోవా, డబుల్స్ లెజెండ్స్ బ్రయాన్ బ్రదర్స్‌కు టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటుదక్కింది. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో షరపోవాతోపాటు మైక్, బాబ్ బ్రయాన్‌ల పేర్లను దిగ్గజాల సరసన చేర్చారు. ఈ కార్యక్రమానికి అమెరికా టెన్నిస్ క్వీన్ సెరెనా విలియమ్స్ ప్రత్యేక అతిథిగా హాజరై అందరినీ ఆశ్చర్యపర్చింది. స్టేజ్ వెనుక నుంచి రంగప్రవేశం చేసిన సెరెనా.. 'మాజీ ప్రత్యర్థి, మాజీ అభిమాని.. చిరకాల స్నేహితురాలు' అంటూ షరపోవాను సభకు పరిచయం చేసింది. ప్రతిష్ఠాత్మక హాల్ ఆఫ్ ఫేమ్‌లో మరియా షరపోవాను చేర్చుతున్నట్టు ప్రకటించింది.



సెరెనాతో షరపోవా

షెల్టన్, రదుకాను శుభారంభం: మాజీ చాంపియన్ ఎమ్మా రదుకాను, ఆరో సీడ్ బెన్ షెల్టన్ యూఎస్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రదుకాను 6-1, 6-2తో షిబహారాపై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో వోండ్రుసోవా 6-3, 7-6 (3)తో సెలెఖమెటోవాని, 31వ సీడ్ ఫెర్నాండెజ్ 6-2, 6-1తో మరీనోను ఓడించి రెండో రౌండ్‌కు చేరారు. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో షెల్టన్ 6-3, 6-2, 6-4తో బుసెపై , 16వ సీడ్ మెన్సిక్ 7-6(5), 6-3, 6-4తో జారీపై, 18వ సీడ్ డవిడోవిచ్ 6-1, 6-1, 6-2తో షెవ్‌చెంకోపై నెగ్గారు.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి!

(మొదటి పేజీ తరువాయి)

ఎరువుల సరఫరా విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చేసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎరువుల లభ్యత, సరఫరాపై ఆదివారం సీఎస్, డీజీపీ, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా ఎరువుల లభ్యత, సరఫరాపై ఆరా తీశారు. ఖరీఫ్ అవసరాలకు తగ్గట్లు ఎరువులు, యూరియా అందుబాటులో ఉంచుకున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఎంత మేరకు ఎరువులను సరఫరా చేస్తున్నారని అధికారులను సీఎం అడిగారు. అనంతరం మాట్లాడుతూ... 'ప్రైవేట్ డీలర్లకు ఎరువుల కేటాయింపు తగ్గించి, మార్క్‌ఫెడ్ ద్వారానే రైతులకు ఎక్కువగా సరఫరా జరిగేలా చూడాలి. మార్క్‌ఫెడ్ ద్వారా 70శాతం ఎరువులు రైతులకు అందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. రాష్ట్రానికి వచ్చే ఎరువులు పక్కదారి పట్టకుండా చూడాలి. యూరియా, ఇతర ఎరువుల నిల్వలపై విజిలెన్స్ తనిఖీలు ముమ్మరం చేయాలి. యూరియాతో సహా అన్ని ఎరువుల నిల్వలనూ తనిఖీ చేయాలి. వ్యవసాయేతర అవసరాలకు యూరియా తరలిపోకుండా ఎక్కడికక్కడ కట్టడి చేయాలి. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే.. కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడొద్దు. ధరలు పెంచి అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి. ఎరువులను పక్కదారి పట్టించిన డీలర్ల లైసెన్సులను రద్దు చేయండి' అని సీఎం ఆదేశించారు. అలాగే, ఐఎంఎఫ్ఎస్ పోర్టల్‌లో ఏమేరకు సమాచారం అప్‌డేట్ అవుతోందని సీఎం ఆరా తీశారు.

నాడు చెప్పాను.. నేడు చేసి చూపించాను

- హంద్రీ-నీవా జలాలపై సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): 'శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా సీమకు కృష్ణా నది జలాలు ఇస్తాం. హంద్రీ-నీవాకు నీళ్లు ఇస్తాం.. వైసీపీ నేత జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులకూ నీరు ఇస్తాం. జగన్ అడ్డంగా పడుకున్నా నీళ్లు ఇస్తాం'.. -2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు చెప్పిన మాటలివి. కూటమి ప్రభుత్వం వచ్చాక పైన పేర్కొన్న అన్ని ప్రాంతాలకూ ప్రస్తుతం నీరిస్తున్నారు. దీనిపై ఆయన ఆదివారం స్పందిస్తూ.. 'నాడు చెప్పాను.. నేడు చేసి చూపించాను' అని 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. నాటి తన మాటల వీడియోను, ఆయా ప్రాంతాలకు నీరు ప్రవహిస్తున్న దృశ్యాలను షేర్ చేశారు.

పోలీసుల అదుపులో పలువురు రౌడీషీటర్లు

- శ్రీకాంత్, అరుణ దందాలపై పోలీసుల దూకుడు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ శ్రీకాంత్, కి'లేడీ' అరుణ దందాలపై పోలీసులు దూకుడు పెంచారు. ఇప్పటికే అరుణ కాల్ లిస్ట్ ఆధారంగా ఆమెతో తరచూ మాట్లాడుతున్న రౌడీషీటర్లను గుర్తించి వారిలో కొందరిని అదుపులోకి తీసుకున్నారు. మరి కొంతమంది పరారీలో ఉన్నారు. నెల్లూరు వేదాయపాలెం స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు సీహెచ్ భూపతి, అరవ సురేంద్ర, కె.జగదీశ్‌ను పోలీసులు గంజాయి కేసులో అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇంకోవైపు.. కోవూరు పోలీసులు అరుణను తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. నేడో రేపో నిర్ణయం వెలువరించనుంది.

టీటీడీపై భూమన వ్యాఖ్యలు సరికాదు: టీటీడీ

తిరుమల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంపై వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని టీటీడీ ఆక్షేపించింది. 'అలిపిరికి 4 కిలోమీటర్ల దూరంలోని టూరిజం భూమిని తీసుకుని 2.5 కిలోమీటర్ల దూరంలోని భూమిని ఏపీ టూరిజానికి బదలాయించడం సరైన పద్ధతి కాదు. అత్యంత విలువైన ఈ స్థలాన్ని టూరిజం శాఖకు ఎందుకు కేటాయించారు?' అంటూ భూమన ఆదివారం విమర్శలు చేయడంపై టీటీడీ స్పందించింది. 'గత ప్రభుత్వంలో అలిపిరిలోని పవిత్రమైన భూమిలో 20 ఎకరాలు ఒబెరాయ్ హోటల్‌కు టూరిజం శాఖ కేటాయించింది. దీనిపై అభ్యంతరాలొచ్చాయి. ఈ నేపథ్యంలో అలిపిరిలో స్వామి పాదాల వద్ద ఉన్న టూరిజం భూమిని టీటీడీకి, అలాగే రోడ్డుకు దక్షిణంగా ఉన్న టీటీడీ భూమిని టూరిజం శాఖకు బదలాయించేందుకు జూలై 22న బోర్డు సమావేశంలో ఆమోదం లభించింది.' అని టీటీడీ వివరించింది.



సురవరం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, చిత్రంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



సురవరం సుధాకర్‌రెడ్డి అంతిమ యాత్ర దృశ్యం

సుధాకర్‌రెడ్డికి తుది వీడ్కోలు

- మఖ్దూం భవన్‌లో చంద్రబాబు, రేవంత్, వెంకయ్య సహా పలువురు ప్రముఖుల నివాళి
- అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర
- పోలీసుల మార్చ్.. ఎర్ర సైన్యం కవాతు
- గాంధీ వైద్య కాలేజీకి భౌతిక కాయం అప్పగింత
- సురవరం పేరు నిలిచిపోయేలా చేస్తాం
- అందుకు ఏం చేయాలో చర్చిస్తాం: రేవంత్
- సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు: చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలికింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. అక్కడ ప్రజలు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు సురవరం భౌతిక కాయానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించేందుకు అంతిమ యాత్ర మొదలైంది. ఇందులో భాగంగా హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు పోలీసుల మార్చ్ సాగింది. అక్కడి నుంచి రెడ్ వాలంటీర్లు కవాతు చేశారు. నారాయణగూడ చౌరస్తా, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ముషీరాబాద్ మీదుగా యాత్ర సాగింది. సాయంత్రం 4.45 గంటలకు సురవరం భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా విప్లవ జోహార్లు అంటూ కార్యకర్తలు పాటలు పాడుతూ సుధాకర్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికారు.

రేవంత్, చంద్రబాబు నివాళి..

సీపీఐ దిగ్గజ నేత సురవరం సుధాకర్ రెడ్డి పేరును శాశ్వతంగా గుర్తుండేలా చేస్తామని, ఈ మేరకు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. మఖ్దూం భవన్‌లో సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి రేవంత్ నివాళులు అర్పించారు. సురవరం మృతి సీపీఐకి, దేశానికి తీరని లోటని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి చంద్రబాబు అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురవరంతో తనకు సుదీర్ఘ స్నేహం ఉందని చంద్రబాబు తెలిపారు. ఆయనకు అనేక ఉద్యమాలు నడిపిన అనుభవం ఉందని అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించి, సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సురవరం మా తొలి ప్రొఫెసర్

- గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర

సుధాకర్ రెడ్డి భౌతిక కాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించడం స్ఫూర్తిదాయకం. ఆయన గాంధీ కళాశాల విద్యార్థులకు తొలి అనాటమీ ప్రొఫెసర్ అవుతారు. ఆయన శరీరం ద్వారా ఎంతో మంది విద్యార్థులు వైద్య శాస్త్రాన్ని నేర్చుకుంటారు. ఆయన కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

28 నుంచి విశాఖలో జనసేన సమావేశాలు



- మూడ్రోజులు నిర్వహణ.. పవన్ హాజరు
- 30న విస్తృత భేటీ.. బహిరంగ సభ
- పోస్టర్‌ను ఆవిష్కరించిన నాదెండ్ల, నేతలు

మహారాణిపేట (విశాఖపట్నం), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశాలను పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు విశాఖలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విశాఖ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 28వ తేదీ నుంచి ఇవి మూడ్రోజులు జరుగుతాయన్నారు. సమావేశాల ఏర్పాట్లను ఆదివారం ఆయన పోలీసులు, జీవీఎంసీ అధికారులతో పాటు పరిశీలించారు. జనసేన ఎమ్మెల్యేలు, నేతలతో కలిసి 'సేనతో సేనాని' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మాట్లాడుతూ.. 28న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ ఉంటుందని.. మర్నాడు పార్లమెంటు నియోజకవర్గాలవారీగా ఆది నుంచీ పార్టీ కోసం కష్టపడి, వైసీపీపై పోరాటం చేసిన కార్యకర్తలు, ఆహ్వానితులతో సమావేశం ఉంటుందని... చివరి రోజు 30న పార్టీ రాష్ట్రస్థాయి క్రియాశీల కార్యకర్తల విస్తృతస్థాయి భేటీ జరుగుతుందని.. మధ్యాహ్నం ఒంటి గంటకు బహిరంగ సభ ప్రారంభమవుతుందని, సాయంత్రం ఆరు గంటలకు పవన్ కల్యాణ్ ప్రసంగిస్తారని వెల్లడించారు. ఈ సమావేశాల్లో మహిళల బాధ్యత, అందరికీ రక్షిత నీరు, ఉపాధి కల్పన తదితర అంశాలతో పాటు కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనపై చర్చించనున్నట్లు తెలిపారు. జనసేన నేతలు, కార్యకర్తలు.. కూటమిలో మిగిలిన 2 పార్టీల నేతలతో కలి సి ఏ విధంగా పనిచేయాలి... సోషల్ మీడియా వేదికగా వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను ఎలా తిప్పికొట్టాలో చర్చ జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం పై తమ అధినేత దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

కలెక్టర్లకు మరింత పవర్!

(మొదటి పేజీ తరువాయి)

ఏమీచేయలేక పోతున్నారు. ముఖ్యంగా భూ సంబంధిత విషయాల్లో నిర్ణయాల కోసం ప్రభుత్వం వద్దకు పరిగెత్తాల్సి వస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో.. 2012లో ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు పాలసీని ఖరారు చేసే సమయంలోనే ఈ అంశంపై చర్చ జరిగింది. భూ సంబంధిత విషయాల్లో కలెక్టర్లకు అధికారం ఇచ్చే అంశంపై అప్పట్లోనే దృష్టి పెట్టారు. కానీ, ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. భూకేటాయింపుల ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో కేంద్రీ కృతం చేశారు. ఇప్పుడు ఆ విధానం వచ్చి 13 ఏళ్లు పూర్తికావొస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లకు కీలక అధికారాలు ఇచ్చి, కొన్ని అంశాల్లో పాలనా నిర్ణయాలను మరింత సులభతరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, విభాగాలకు వాటికి అవసరం ఉన్న మేరకు భూములను జిల్లా స్థాయిలోనే కలెక్టర్ కేటాయించేలా, ఆ భూముల ధరలను నిర్ణయించేలా అధికారం కల్పించాలని భావిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ సంస్థలకు 5 ఎకరాల మేరకు భూమిని కేటాయించే అధికారం కలెక్టర్లకు ఉంది. అదేవిధంగా భూమి ధరను రూ.50 లక్షల వరకు ఖరారు చేసే అధికారం కూడా ఇచ్చారు. కానీ, రాష్ట్రస్థాయిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ భూ నిర్వహణ సంస్థ(ఏపీఎల్ఎంఏ) ఆ బాధ్యతను తీసుకుంది. దీంతో కలెక్టర్లకు అధికారం ఉన్నా అది ఆచరణలోకి రాలేదు. ఫలితంగా కలెక్టర్లు ఇప్పటికీ భూ సంబంధిత కీలక ప్రతిపాదనలు ఏపీఎల్ఎంఏకే పంపిస్తున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం: జిల్లా స్థాయిలో ప్రభుత్వ సంస్థలు, విభాగాలకు భూములు ఇవ్వడం, ధరను ఖరారు చేయడం వంటి అధికారాలను కలెక్టర్లకు ఇవ్వాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. ఒకవేళ ఇప్పటికే ఆ అధికారాలు ఉంటే మరింతగా వాటిని పెంచి అమలు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ఈ దిశగా రెవెన్యూ శాఖ తాజాగా కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జిల్లా అభివృద్ధికి అవసరమైన మేరకు ప్రభుత్వ విభాగాలు, సంస్థలు, ఇతర అవసరాలకు భూములు కేటాయించే అధికారం కలెక్టర్లకే ఉండాలని, అది సరిగ్గా అమలుకాని పక్షంలో ఇకపై ఖచ్చితంగా అమలయ్యేలా విధివిధానాలు ఉండాలని రెవెన్యూశాఖ ప్రతిపాదనల్లో పేర్కొంది. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు, విభాగాలు, పరిశ్రమ లు, ఇతర అవసరాలకు భూములు ఇచ్చే అధికారం కలెక్టర్‌కు ఉండాలని స్పష్టం చేసింది. అయితే, ఎవరికి ఎంత భూమి కేటాయించే అధికారం ఉండాలి?. వాటి ధరను ఎంత మేరకు కలెక్టర్ ఖరారు చేసే అధికారం ఇవ్వాలన్న దానిపై ప్రభుత్వ స్థాయిలోనే నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది.

ప్రతిపాదనల్లోని కీలక అంశాలు

1. ప్రభుత్వ పాఠశాల, కాలేజీ, ఆస్పత్రులు, ఆఫీసు భవనాల కోసం జిల్లాస్థాయిలో 10-15 ఎకరాలు, అంతకు మించి కేటాయించే అధికారం.

2) కేటాయించే భూమి ధరను సగటున ఎకరం రూ.50 లక్షల నుంచి కోటి వరకు ఖరారు చేసే అధికారం.

3) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, చట్టబద్ధమైన సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న వ్యవస్థలకు వాటి ప్రాథమిక అవసరాలను బట్టి కలెక్టర్ 10-15 ఎకరాలకు కేటాయించే అధికారం.

4) ప్రైవేటు కంపెనీలు, సంస్థలకు భూములు ఇవ్వాలనుకుంటే, అందుకు అవసరమైన ప్రతిపాదనలను రాష్ట్రస్థాయిలో ఏపీఎల్ఎంఏ ఆమోదానికి కలెక్టర్ నివేదించాలి.

5) ఆ తర్వాత మంత్రివర్గం ఆమోదం కోసం ఏపీఎల్ఎమ్ఏ ఫైలును పంపించాలి.





పెద్దాపురంలో సీఎం చంద్రబాబు స్వచ్ఛ ర్యాలీ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల ముందు భాగం, ఫ్లెక్సీలకు వెనుక నల్లగా ఉన్న భాగం.. దీనినే బారికేడ్లుగా జగన్ పత్రిక రాసింది

వాస్తవాలకు పరదా

- సీఎం పెద్దాపురం పర్యటనపై జగన్ పత్రిక విష ప్రచారం

కాకినాడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై అడ్డగోలు అబద్ధాలతో బురద జల్లుతున్న జగన్ పత్రిక.. సీఎం చంద్రబాబు జిల్లాల పర్యటనలపైనా విష ప్రచారం చేస్తోంది. వాస్తవాలను మరుగు పరిచి.. అబద్ధాలు, అసత్యాలను సృష్టించి.. ప్రజలు ఏమనుకుంటారోనన్న ఇంగితం లేకుండా, అడ్డంగా దొరికిపోయి విమర్శల పాలవుతామన్న వెరపు లేకుండా వ్యవహరిస్తోంది. దీనికి నిలువెత్తు ఉదాహరణే.. కాకినాడ జిల్లా పెద్దాపురంలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటనపై జగన్ పత్రిక అల్లిన కట్టుకథ!. 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు పెద్దాపురంలో స్వచ్ఛ ర్యాలీ నిర్వహించారు. దీనిలో వైద్యులు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఈ క్రమంలో అధికారులు పెద్దాపురం మెయిన్ రోడ్డుపై డివైడర్ల మధ్యలో 250 మీటర్ల మేర 'స్వచ్ఛ ర్యాలీ'కి సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రహదారిపై ఎడమవైపు సీఎం చంద్రబాబు ర్యాలీ, కుడివైపు సాధారణ ప్రజలు, వాహనాల రాకపోకల కోసం కేటాయించారు. కానీ, జగన్ పత్రిక మాత్రం సీఎం పర్యటనపై విషం కక్కింది. అడ్డగోలుగా అబద్ధాలు అచ్చేసింది. 'సీఎం పర్యటనలో పరదాలు' అంటూ నిస్సిగ్గుగా నిజాలు దాచి అబద్ధాలు వండి వార్చింది. ర్యాలీ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెనుక నుంచి ఫొటోలు తీసి(ఫ్లెక్సీలపై ఎక్కడైనా ఒకవైపే సంబంధిత కార్యక్రమం వివరాలను ముద్రిస్తారు. రెండో వైపు నలుపో, తెలుపో అలానే వదిలేస్తారు.) వాటినే పరదాలంటూ పేర్కొంది. వాస్తవానికి ర్యాలీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వెనుకభాగం అంతా నలుపు రంగులో ఉన్నాయి. ప్రముఖుల పర్యటనల్లో ఫ్లెక్సీల నాణ్యత కోసం ఎక్కువ ఖర్చుతో వెనుక భాగం నలుపు రంగు ఉండేలా చేస్తారు. అలా చేయడంవల్ల బ్యాక్ లైటింగ్ ఫ్లెక్సీ మీద పడకుండా నాణ్యత ఎక్కువగా ఉండి అందంగా కనిపిస్తుంది. అదే వెనుక తెలుపు రంగు ఉంటే బ్యాక్ లైటింగ్ ప్రభావం ఫ్లెక్సీ ఎదుట భాగంపై పడి ఆకర్షణీయంగా కనిపించదు. ఈ విషయం తెలిసి కూడా జగన్ పత్రిక అబద్ధాలు రాసేసింది. ఫ్లెక్సీల వెనుక భాగాన్ని ఏకంగా పరదాలుగా పేర్కొంటూ సీఎం చంద్రబాబు పాల్గొన్న ర్యాలీపై బురద జల్లింది.

పరదాల సీఎం జగనే!

వాస్తవానికి పరదాల సంస్కృతి ప్రారంభించింది గత వైసీపీ ప్రభుత్వంలోనే. అప్పటి సీఎం జగన్ ఎక్కడ పర్యటనకు వెళ్లినా కిలోమీటర్ల కొద్దీ రహదారులకు ఇరువైపులా ఇనుప బారికేడ్లు బిగించేవారు. పరదాలు కట్టేవారు. వచ్చిన జనాన్ని కదలకుండా నిర్బంధించేలా వ్యవహరించారు. అంతేకాదు, ఎక్కడికక్కడ చెట్లను నరికేసేవారు. దీంతో అప్పట్లో జగన్‌కు 'పరదాల సీఎం'గా రాష్ట్రవ్యాప్తంగా చెడ్డ పేరొచ్చింది. గత ఎన్నికల్లో ప్రభుత్వం మారి చంద్రబాబు సీఎం అయ్యాక వీటన్నింటికీ చెక్ పెట్టారు. అసలు పరదాల ప్రస్తావన కాదు కదా చెట్ల జోలికి కూడా పోవడం లేదు. అప్పట్లో జగన్ వస్తే రహదారులపై ట్రాఫిక్ మళ్లించేసి నానా ఇబ్బందులు పెట్టారు. కానీ, ఇప్పుడు అలాంటిదేమీ లేకుండా రహదారికి ఒకవైపు సీఎం భద్రత సిబ్బంది, వాహనాలు ఉంటున్నాయి. రోడ్డుకు రెండోవైపు సాధారణ ప్రజల వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు. శనివారం పెద్దాపురంలో మెయిన్‌రోడ్డుపై ఒకవైపు మాత్రమే, అదీ సీఎం పర్యటించే ప్రాంతంలో రహదారిని మూసి పక్కన రెండోవైపు ఆటోలు, కార్లు, లారీలు, ట్రాక్టర్లు, ద్వి చక్రవాహనాలు వెళ్లేలా ఎలాంటి ఆంక్షలు లేకుండా వ్యవహరించారు. జనాన్ని నిలిపివేయడంతో ట్రాఫిక్ ఆగిందని జగన్ పత్రిక రాసింది. అయితే, సీఎం చంద్రబాబు కాన్వాయ్ ప్రజావేదిక సభకు వెళ్లే క్రమంలో 10 నిమిషాలు మాత్రమే ట్రాఫిక్‌ను నిలిపివేశారు. వీవీఐపీలు ప్రయాణించిన సమయంలో ఇలా చేయడం సర్వసాధారణం. కానీ, జగన్ పత్రిక ఇదంతా దాచేసి నిస్సిగ్గుగా బురద జల్లేసి.. ప్రజల కళ్లకు విషపు రాతలతో గంతలు కట్టే ప్రయత్నం చేసింది.

నాడు అరాచకం నేడు అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ సర్కారుకు, కూటమి ప్రభుత్వానికి కొండంత తేడా ఉంది. నాడు అడ్డగోలుగా అప్పులు చేశారు. ప్రభుత్వ ఆస్తులు తాకట్టుపెట్టారు. ప్రతి మంగళవారం అప్పు కోసం తిరిగారు. అయినా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీన సక్రమంగా జీతాలు ఇవ్వలేకపోయారు. ఐదేళ్లూ ప్రతినెలా జీతాలు, పెన్షన్ల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి. ఇక అభివృద్ధి అన్న మాటే లేదు. జగన్ ఆర్భాటంగా బటన్ నొక్కినా ఆ సంక్షేమ పథకాలనూ అరకొరగా అమలు చేశారు. మరి ఆ లక్షల కోట్లు ఏమయ్యాయో? రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళకరంగా ఉందని జగన్ విమర్శిస్తున్న కూటమి ప్రభుత్వంలో ప్రతినెలా ఠంచనుగా జీతాలు, పెన్షన్లు ఇస్తున్నారు. అభివృద్ధిని మళ్లీ పట్టాలెక్కించారు. గతంలో కంటే రెట్టింపు సంక్షేమం అమలు చేస్తున్నారు. నాడు జగన్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బిల్లులను కూడా చెల్లిస్తున్నారు. అప్పులు చేసినా నాటి వైసీపీ పాలనకు, నేటి కూటమి ప్రభుత్వానికి ఎంతో తేడా ఉంది.

కూటమిపై జగన్ 'భారం'

- జగన్ వదిలి వెళ్లిన రూ.1.35 లక్షల కోట్లకు పైగా పెండింగ్ బిల్లుల భారం కూడా చంద్రబాబు ప్రభుత్వమే మోస్తోంది. రెగ్యులర్‌గా ఉండే బిల్లులు చెల్లిస్తూనే, మరోవైపు పెండింగ్ బిల్లులను ఇప్పటి వరకు దాదాపు రూ.25,000 కోట్లు చెల్లించింది.
- జగన్ హయాంలో నిలిచిపోయిన 75 కేంద్ర ప్రభుత్వ పథకాలను చంద్రబాబు ప్రభుత్వం రూ.8,000 కోట్లు ఖర్చు చేసి పునరుద్ధరించింది.

నాడు విధ్వంసం

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భారీ వడ్డీలతో లక్షల కోట్ల అప్పులు తెచ్చారు. వాటివల్ల రాష్ట్రానికి గాని, ప్రజలకు గాని ఏ ఉపయోగం లేదు. జగన్ అమలు చేసిన ఆర్థిక విధ్వంసక విధానాల వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుని, అభివృద్ధిలో 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. భారీగా అప్పులు తెచ్చి కూడా ఒక్క రోడ్డు కూడా వేయలేదు. ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి ప్రాజెక్టును ప్రారంభించలేదు. అప్పటికే అమల్లో ఉన్న ఏ ప్రాజెక్టునూ ముందుకు తీసుకెళ్లలేదు. పోలవరం ప్రాజెక్టును నాశనం చేవారు. అమరావతిని కాదని మూడు రాజధానులంటూ ఐదేళ్లూ గడిపేశారు. ఐదేళ్లలో 3 సార్లు రిజిస్ట్రేషన్ చార్జీలు, 6 సార్లు కరెంటు చార్జీలు, 3 సార్లు ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచారు. ఇవి చాలవన్నట్టు చెత్తపన్ను పేరుతో జనాల జేబులు గుల్ల చేశారు. లిక్కర్ స్కామ్‌లో దోపిడీకి అంతేలేదు. ఇలా ఒకవైపు లక్షల కోట్ల అప్పులు చేస్తూ.. మరోవైపు జనాల జేబులకు చిల్లులు పెట్టారు. బటన్ నొక్కుతున్నాం, ప్రజల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామంటూ ప్రకటనలు ఊదరగొడుతూ.. మరోవైపు లబ్ధిదారుల జాబితాలో కోత పెట్టారు. మరి లక్షల కోట్ల అప్పులను జగన్ ఏం చేశారో?

నేడు వికాసం

ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పులు చేస్తున్నా జగన్‌తో పోల్చితే వడ్డీ రేట్లు తక్కువ. జగన్ తెచ్చిన ఎక్కువ వడ్డీరేట్లను తగ్గించుకోవడానికి బ్యాంకులతో మాట్లాడుతున్నారు. ఈ అప్పులతో, రాష్ట్రానికి వస్తున్న ఆదాయంలో 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తున్నారు. రూ.10,000 కోట్లతో తల్లికివందనం, 3,173 కోట్లతో అన్నదాత సుఖీభవ పథకంతో పాటు ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కూడా ప్రారంభించారు. పోలవరాన్ని పట్టాలెక్కించారు. రూ.1,000 కోట్లతో డయాఫ్రమ్ వాల్ కడుతున్నారు. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సాయం చేశాయి. అమరావతిలో గ్రామకంఠాల్లో గల 29 గ్రామాల్లో రూ.904 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. సీఆర్‌డీఏ నిధులతో విజయవాడ, గుంటూరులో భూగర్భ డ్రైనేజీ పనులు చేసేలా టెండర్లు పిలవబోతున్నారు. అమరావతిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జగన్ చేసిన అప్పులపై చంద్రబాబు ప్రభుత్వం ప్రతినెలా అసలు, వడ్డీలు చెల్లిస్తోంది. ఏడాదికి ఈ మొత్తం దాదాపు రూ.70,000 కోట్లకు పైనే. జగన్ 12 నుంచి 13 శాతం వడ్డీరేట్లకు ఎడాపెడా అప్పులు తెచ్చారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారింది. ఆర్‌బీఐ నేరుగా అసలు, వడ్డీని రాష్ట్ర ఖజానా నుంచి మినహాయించుకుంటుంది. అప్పుల అసలు, వడ్డీలు చెల్లించాక మిగిలిన డబ్బుతోనే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, జీతాలు, పెన్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులన్నింటినీ తీసుకొచ్చి రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగిస్తున్నారు. గతంలో జగన్ కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను కూడా దారి మళ్లించడంతో ఆ పథకాలు నిలిచిపోయాయి. దీంతో కేంద్రం నుంచి నిధులు ఆగిపోయాయి. వాటిని చంద్రబాబు ప్రభుత్వం పునరుద్ధరించింది.

పింఛన్లపై పీక్స్‌కు ఫేక్

- ఆర్థిక బాధలతో దంపతుల ఆత్మహత్య
- వారి కుమార్తె, గ్రామస్థులు చెప్పింది ఇదే
- కానీ, దివ్యాంగ పింఛన్ నిలిపివేయడమే కారణమంటూ ఫేక్ సైకోల విషం

గార రూరల్, శ్రీకాకుళం, కోడూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అర్హులైనవారిలో ఏ ఒక్కరి పింఛను కూడా తొలగించరాదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. పింఛన్లకు అర్హత విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులను పదేపదే ఆదేశిస్తోంది. అయినా, అధికారుల నిర్లక్ష్యంతో అక్కడక్కడ పొరపాట్లు జరుగుతున్నాయి. మరోవైపు, పింఛన్లపై ఫేక్ ప్రచారాలు జోరందుకున్నాయి. వడపోతలో దివ్యాంగులు కాదని తేలినవారి పింఛన్లను ప్రభుత్వం తొలగిస్తే.. అదేదో నేరం, ఘోరం అయినట్టు వైసీపీ సోషల్ మీడియా గగ్గోలు పెడుతోంది. అర్హులు కానివారిని అర్హులుగా చిత్రీకరిస్తూ.. ఫేక్ ఫొటోలు, మార్ఫింగ్ చిత్రాలతో విషం కక్కుతోంది. శ్రీకాకుళం జిల్లా గార మండలం అంపోలులో ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. అయితే, దివ్యాంగ పింఛన్ తీసివేయడం వల్ల మనస్తాపం చెంది బలవన్మరణం చెందారని ఫేక్ సైకోలు తప్పుడు కథనాలు అల్లారు. అంపోలుకు చెందిన కొల్లి అప్పారావు(45), కొల్లి లలిత(42) దంపతులు. వీరికి ఇంటర్ చదువుతున్న కుమార్తె దేవి ఉంది. అప్పారావు ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడు. ఆయనకు కళ్లు సరిగ్గా కనబడవు. అంధత్వ సమస్య పెరగడంతో ఉద్యోగం మానేశారు. దీంతో లలిత కూలి పనికి వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేది. కుటుంబ అవసరాల కోసం దొరికినకాడకు అప్పులు చేశారు. వృద్ధురాలైన అప్పారావు తల్లి ఇటీవల మృతి చెందింది. దీంతో ఉమ్మడి ఆస్తిగా ఉన్న ఇంటిని ఖాళీ చేయాలని అన్నదమ్ముల నుంచి అప్పారావుపై ఒత్తిడి వచ్చింది. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని అప్పారావు, లలిత, దేవి నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి వారు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆదివారం తెల్లవారుజామున వారి ఇంట్లోకి స్థానికులు వెళ్లిచూడగా అప్పారావు, లలిత విగతజీవులుగా పడి ఉన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న దేవిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి తరలించారు. చికిత్స పొందుతున్న దేవిని పోలీసులు విచారించగా.. "ఎలుకల మందు తాగినట్లు తల్లి దండ్రులు చెప్పారు. నేను ఒక్కదాన్ని ఉండి ఏమి సాధిస్తానని మిగిలి ఉన్న మందు తాగాను." అని తెలిపారు.

ఆత్మహత్యకూ, పింఛన్లకూ సంబంధం లేదు

అంపోలులో చోటుచేసుకున్న కుటుంబ ఆత్మహత్య ఘటనకు ఆస్తి వివాదమే కారణమని అధికారులు తేల్చారు. పింఛన్ నిలిపేయడంతో ఆత్మహత్య చేసుకున్నట్టు సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న ప్రచారం అసత్యమని తెలిపారు. దంపతుల ఆత్మహత్యకు, పింఛన్ సమస్యకు సంబంధంలేదని నిర్ధారణ అయిందన్నారు. దివ్యాంగ పింఛను లబ్ధిదారులకు వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా నోటీసులు ఇచ్చినట్టే అప్పారావుకు కూడా ఇచ్చామేగానీ, ఆయన పింఛను తొలగించలేదని వివరణ ఇచ్చారు. దీనిపై కలెక్టరేట్ ప్రకటన వెలువరించింది. ఇదే అంశంపై విచారణ చేసి శ్రీకాకుళం ఆర్డీవో నివేదిక సమర్పించారు. అప్పారావు కుమార్తె దేవి పోలీసులకు ఇచ్చిన సమాచారంలో కుటుంబ ఆస్తి వివాదమే కారణమని పేర్కొన్నారు.

ఆమె దైన్యం 'కనిపించలేదా'?



ఈ చిత్రంలో గాజుకన్నును చూపిస్తున్న మహిళ పేరు భూపతి నాగమణి. కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు గ్రామం. 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్నదంటూ ఈమెకు ఉన్న పింఛనును తొలగిస్తూ నోటీసు ఇచ్చారు. దీంతో నాగమణి కన్నీరుమున్నీరు అవుతున్నారు. 2006నుంచి ఆమె దివ్యాంగ పింఛను తీసుకుంటున్నారు. తనకు ఒక కన్ను లేదంటూ ఆదివారం గాజుకన్నును తీసి చూపించారు. ఆమె పరిస్థితిని కోడూరు ఎంపీడీవో సుధా ప్రవీణ్ పరిశీలించి పింఛన్ కోసం మళ్లీ అప్పీలు చేస్తామన్నారు. అటు.. ఫేక్‌లపై సమరం.. ఇటు అధికారుల పొరపాట్ల దిద్దుబాటు ప్రభుత్వం ముందున్న ప్రధాన సమస్య అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అండాల కోసం అడ్డదారిలో..

(మొదటి పేజీ తరువాయి)

మహిళల్లో ఆరోగ్యకరమైన అండాల విడుదలలో అడ్డంకులు ఎదురవుతున్నాయి. గతంలో.. మూడు పదులు దాటిన మహిళల్లో ఈ సమస్య ఉంటే.. ఇప్పుడు 20-30ఏళ్ల మధ్య వయసున్న వారిలోనూ ఇబ్బందులు కనిపిస్తున్నాయి. ప్రతీ నాలుగు జంటల్లో ఒకటి ఇలా అండాలు విడుదల కాకపోవడం.. ఒకవేళ విడుదలైనా.. ఆరోగ్యకరంగా లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. ఇలాంటి జంటలు ఐయూఐ, ఐవీఎఫ్, సరగసీ పద్ధతులను ఎంచుకుంటున్నాయి. అండాలు అవసరమైన దంపతుల సంఖ్య వేలల్లో ఉంటే.. దాతలు మాత్రం పదుల్లో ఉంటున్నారు. ఈ పరిస్థితులను దళారులు ఆసరాగా తీసుకుని దందా కొనసాగిస్తున్నారు.

ఇదీ పద్ధతి..

ఆరోగ్యకరమైన దంపతుల్లో పెళ్లైన రెండేళ్లలోపే సంతానం కలుగుతుంది. ఆ తర్వాత కూడా సంతానం కలగకుంటే.. హార్మోన్ ఇంజక్షన్ల ద్వారా ప్రయత్నిస్తామని వైద్య నిపుణులు చెబుతున్నారు. అప్పటికీ సంతానసాఫల్యం కలగకుంటే.. కృత్రిమ మార్గాలను సూచిస్తామంటున్నారు. "తొలుత ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్(ఐయూఐ) పద్ధతిని సూచిస్తాం. ఈ ప్రక్రియలో భర్త నుంచి సేకరించిన వీర్యకణాల్లో చురుగ్గా, అత్యంత క్రియాశీలంగా ఉండేవాటిని ల్యాబ్‌లో వేరు చేస్తాం. వాటిని భార్య గర్భాశయంలోకి ప్రవేశపెడతాం. ఈ పద్ధతి విఫలమైతే.. ఇన్ విట్రో ఫర్టిలైజేషన్(ఐవీఎఫ్)ను ప్రారంభిస్తాం. అంటే.. భార్య అండాన్ని, భర్త వీర్యాన్ని ల్యాబ్‌లో ఫలదీకరణ చేసి.. భార్య గర్భాశంలో ప్రవేశపెడతాం. ఐవీఎఫ్ కూడా విఫలమైతే సరగసీ పద్ధతిని ఆశ్రయించాల్సి ఉంటుంది" అని ఫర్టిలిటీ కేంద్రాల నిపుణులు వివరించారు.

దాతలు లేక.. దళారుల దందా

సరగసి చట్టం-2021 మేరకు ఇద్దరు పిల్లలుండి.. 23-33 ఏళ్ల వయసున్న వివాహిత ఒక్కసారి మాత్రమే అండాన్ని దానం చేయాలి. దాతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు, జన్యులోపాలు ఉండకూడదు. ఆరోగ్యవంతమైన వివాహితలు స్వచ్ఛందంగా అండదానం చేయొచ్చు. అయితే అపోహల కారణంగా చాలా తక్కువ మందే ముందుకొస్తుంటారు. దీంతో సంతానార్థులైన దంపతులు దాతల కోసం కొన్నేళ్లపాటు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీన్ని దళారులు అవకాశంగా మార్చుకుంటారు. మహిళా ఏజెంట్లను రంగంలోకి దింపి.. కాలేజీలకు వెళ్లే అవివాహిత యువతులకు డబ్బు ఆశ చూపి అండాలను సేకరిస్తారు. సంతానసాఫల్యం కోసం ఎదురు చూసే దంపతులకు ఒక్కో అండాన్ని రూ.25 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తుంటారు. అయితే దాతలకు ఎక్కువ అండాలు విడుదలయ్యేందుకు ఇచ్చే హార్మోన్ ఇంజక్షన్లతో రోగ్యం దెబ్బతింటుందని, భవిష్యత్‌లో వారిక అండాలు విడుదల కాని పరిస్థితులు నెలకొంటాయని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ముందు చూపుతో అండాలు ఫ్రీజ్..

కొందరు సెలబ్రిటీలు, ఐటీ ఉద్యోగులు, సంతానసాఫల్యంపై అవగాహన ఉన్నవారు తమ అండాలను ఫ్రీజ్ చేయిస్తున్నారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులున్నవారు కూడా యుక్తవయసులోనే ఆరోగ్యకరమైన అండాలను ఫ్రీజ్ చేయించుకుంటున్నారు. ఇలా ఫ్రీజ్ చేసిన అండాలను పదేళ్లలో ఎప్పుడైనా వాడుకుని, సంతానాన్ని పొందవచ్చు. అండాల ఫ్రీజింగ్‌కు రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చవుతుంది.

15-20% మందిలో అండాల లేమి!

సంతానం కోసం తమ వద్దకు వచ్చే మహిళల్లో 15-20% మందిలో అసలు అండాలే విడుదలవడం లేదని హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ సంతానసాఫల్య కేంద్రానికి చెందిన మహిళా డాక్టర్ 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు. 20 ఏళ్ల వయసున్న వారికీ అండాల సమస్య ఏర్పడుతున్నట్లు తెలిపారు. జీవనశైలి, ఒత్తిళ్లు, కాలుష్యం వంటి కారణాలతో ఆరోగ్యకరమైన అండాలు విడుదల కావడంలేదని వెల్లడించారు. అండదానంపై మహిళలకు అవగాహన ఉండటం లేదని వివరించారు.

గో'దారి' మళ్లించాలి!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ఉధృతి

గోదావరి.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చి సముద్రంలో కలుస్తుంది. ఏటా గోదావరి వరద నీరు వృథాగా పోతోంది. వేలాది టీఎంసీలు సముద్రంలో కలిసి పోతున్నాయి. పోలవరం ప్రాజెక్టు పూర్తయినా ఇదే పరిస్థితి ఉంటుంది. వృథాగా పోతున్న ఈ వరద నీటిని తాగు, సాగు అవసరాలకు సద్వినియోగం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఆ ప్రాంతంలో వరదలు తగ్గుతాయనే అభిప్రాయం కూడా వ్యక్తం చేస్తున్నారు. మిగులు జలాలను వాడుకోవడం వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదని అంటున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఏటా వరదల సమయంలో దాదాపు 2 వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతుండగా.. మరోవైపు గోదావరి జిల్లాల్లో ఇంకా లక్షల ఎకరాల భూమి మెట్టగానే ఉంది. బోర్లు, వర్షాధారంతోనే సాగు చేస్తున్నారు. వందల గ్రామాలు, కొన్ని పట్టణాలకు తాగడానికి గోదావరి నీరు అందడం లేదు. బోరు నీరు తాగుతున్నారు. ప్రస్తుతం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ కెపాసిటీ 3 టీఎంసీలు. బ్యారేజీ నీటిమట్టం 11 అడుగులు. సాధారణంగా వరదల సమయంలోనే ఈ మేరకు నిల్వ ఉంటుంది. ధవళేశ్వరం సర్కిల్‌లోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ డెల్టాల్లో సుమారు 10 లక్షల ఎకరాల సాగు, తాగునీరు, పారి శ్రామిక, చేపల చెరువుల అవసరాలకు ఒక పంట సీజన్‌కు దాదాపు 110 టీఎంసీల నీరు కావాలి. గోదావరి వరదతో ఖరీఫ్ సీజన్‌లో సరిపడా నీరున్నా రబీ సీజన్‌కు ఉండడం లేదు. సీలేరు నుంచి తెచ్చుకోవాల్సి వస్తుంది. ధవళేశ్వరం బ్యారేజీ దాటి వెళ్లిన నీటిని ఉపయోగించడం చాలా తక్కువ. ఎందుకంటే సముద్రం ఆటుపోటుల వల్ల గోదావరి పాయలలోకి సముద్రపు ఉప్పునీరు రావడం వల్ల అవి వినియోగానికి పనికిరావు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి డెల్టా కాలువల ద్వారా పంపిన నీటినే ప్రజలు వినియోగిస్తారు.

1986లో అతిపెద్ద వరద

1953 నుంచి వరద ప్రవాహాన్ని లెక్కిస్తున్నారు. 1953 ఆగస్టు 16న ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 22.75 అడుగులకు చేరడంతో పాటు 30,03,100 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి పోయింది. అప్పట్లో కోనసీమతో పాటు బ్యారేజీ దిగువన అనేక గండ్లు పడ్డాయి. ఈ వరదను ప్రాతిపదికగా తీసుకుని ఏటిగట్లు పటిష్ఠం చేశారు. 1986లో గోదావరికి అతిపెద్ద వరద వచ్చింది. ఆ ఏడాది ఆగస్టు 16వ తేదీన ఏకంగా బ్యారేజీ నీటిమట్టం 24.55 అడుగులకు చేరడంతో పాటు 35,06,380 క్యూసెక్కుల వరద వచ్చింది. క్యూసెక్కు అంటే సెకన్‌కు వరదం ప్రవాహం. అప్పట్లో బ్యారేజీ నుంచి సెకన్‌కు 35,06,380 క్యూసెక్కుల నీరు ప్రవహించినట్టు లెక్క. ఆ ఒక్క రోజునే 302.92 టీఎంసీల నీరు సముద్రంలోకి పోయింది. అప్పట్లో కూడా గండ్లు పడ్డాయి. ఈ వరదను ప్రాతిపదికగా తీసుకుని అప్పటికి 5 మీటర్ల ఎత్తు ఉన్న ఏటిగట్లను 7 మీటర్లకు పెంచారు. గోదావరికి సుమారు 420 కిలోమీటర్ల ఏటిగట్టు ఉండగా.. రాజోలు, పి.గన్నవరం మండలాలు, ఇతర ప్రాంతాల్లో సుమారు 30 కిలోమీటర్ల గట్టు ఎత్తు చేయలేదు. ఇది ఇప్పటికీ సమస్యగానే ఉంది. ఆ తర్వాత ఇంత పెద్ద వరద ఇప్పటి వరకూ రాలేదు. 2022 జూలై 17న నీటిమట్టం 21.70 అడుగులకు చేరడంతో పాటు బ్యారేజీ నుంచి 25,80,963 క్యూసెక్కుల వరద సముద్రంలోకి పోయింది. 2009 ఆగస్టు 30న అతి తక్కువగా 3,78,257 క్యూసెక్కుల వరద నమోదైంది. అప్పుడు నీటిమట్టం 9.90 అడుగులు మాత్రమే నమోదైంది.

21 సార్లు మూడో ప్రమాద హెచ్చరిక

1953 నుంచి 2024 సెప్టెంబరు వరకూ మొత్తం 21 సార్లు పెద్ద వరదలు వచ్చాయి. దీంతో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 1954లో మినహా 1953 నుంచి 1959 వరకూ వరుసగా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసే స్థాయిలో వరదలు వచ్చాయి. 26 సార్లు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఐదుసార్లు మొదటి ప్రమాద హెచ్చరిక వరకే వరద వచ్చింది. 18 సార్లు ఏ విధమైన హెచ్చరికలు జారీ చేయకుండానే సాధారణ వరద వచ్చి వెళ్లిపోయింది.

- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఏటా వరద సమయంలో దాదాపు 2 వేల టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రం పాలవుతోంది. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు 20 వరకూ 1400 టీఎంసీల నీరు సముద్రంలోకి పోయింది. అంతకుముందు నాలుగేళ్లలో 15,680 టీఎంసీలు వృథా అయ్యాయి.
- నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు కెపాసిటీ 190 టీఎంసీలు. ప్రాజెక్టు పూర్తయినా ఇంకా వేల టీఎంసీల నీరు సముద్రం పాలు కావాల్సిందే. ఈ నేపథ్యంలో తాగు, సాగు నీటి అవసరాల కోసం గోదావరి జలాలను వాడుకుంటే అభ్యంతరాలు ఎందుకని నిపుణులు అంటున్నారు.

హెచ్చరికలు ఇలా..

బ్యారేజీ వద్ద నీటిమట్టం, మిగులు జలాల స్థాయిని బట్టి హెచ్చరికలు జారీ చేస్తారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 11.75 అడుగులకు నీటిమట్టం చేరినా, 10 లక్షల క్యూసెక్కులు మిగులు జలాలు ఉన్నా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 13.75 అడుగులు నీటిమట్టం ఉన్నా, 13 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు ఉన్నా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 17.75 అడుగులకు నీటిమట్టం చేరినా, 15 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు ఉన్నా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. మూడో ప్రమాద హెచ్చరిక అనేది చాలా ప్రమాదకర స్థాయి హెచ్చరిక.

నాలుగేళ్లలో 15,680 టీఎంసీల వృథా

ఏటా జూన్ నుంచి మే నెల వరకూ వాటర్ ఇయర్ అంటారు. కానీ సాధారణంగా జూన్ నుంచి డిసెంబరు వరకే గోదావరికి నీరు ఉంటుంది. ఏటా వేల టీఎంసీల నీరు వృథా అవుతోంది. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు 1400 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి. 2021లో 2,493 టీఎంసీలు, 2022లో 6,246 టీఎంసీలు, 2023లో 2,821 టీఎంసీలు, 2024లో 4120 టీఎంసీలు కలిపి.. ఆ నాలుగేళ్లలో 15,680 టీఎంసీల గోదావరి నీరు సముద్రం పాలైంది. ఇరిగేషన్ అధికారుల లెక్క ప్రకారం... ప్రతీ 4 సంవత్సరాలకు 20 లక్షల క్యూసెక్కులకు మించిన వరద, ప్రతీ 10 సంవత్సరాలకు 25 లక్షలకు మించిన వరద వస్తుంది. కానీ వాతావరణ కలుషితం, ఆక్రమణల వల్ల ఈ లెక్క తప్పినట్టు కనిపిస్తోంది. ఒక్కోసారి అధికంగా వరద వచ్చేస్తోంది.

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేపై త్వరలో సీఎంల భేటీ!

- 'హైదరాబాద్-అమరావతి' రహదారి ఎంట్రీ పాయింట్లపై సమాలోచనలు
- త్వరలో ఉభయ రాష్ట్రాల సీఎంల భేటీ

హైదరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే వ్యవహారం ఎటూ తేలడం లేదు. ఈ రహదారి అలైన్‌మెంట్‌పై కసరత్తు జరుగుతోంది. కానీ, ఏపీలోని అమరావతి, తెలంగాణలోని ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర ఎంట్రీ పాయింట్ల (రోడ్డు నిర్మాణం ఎక్కడి నుంచి మొదలుపెట్టాలి? ఎక్కడ అనుసంధానించాలి?)ను నిర్ధారించలేదు. ఈ విషయం తేలితేనే దీనికి సమాంతరంగా నిర్మించాలని భావిస్తున్న హై స్పీడ్ రైలు మార్గానికి కూడా లైన్ క్లియర్ అవుతుంది. ఎంట్రీ పాయింట్లపై త్వరలోనే ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కీలక సమావేశం ఉంటుందని అధికార వర్గాలు అంటున్నాయి. ఆ సమావేశంలోనే ఇరు రాష్ట్రాల్లో ఎక్కడి నుంచి రోడ్డును నిర్మించాలనే విషయం ఖరారవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రంగారెడ్డి, నల్లగొండ జిల్లాకు కుడివైపుగా ప్రాథమికంగా మూడు రకాల ప్రతిపాదనలతో కూడిన రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఓఆర్ఆర్.. ఆర్ఆర్ఆర్.. ఏది ప్రామాణికం?

విభజన చట్టంలో హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలనే హామీ ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫ్యూచర్‌సిటీ నుంచి అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేతో పాటు ఇదే ప్రాంతంలో నిర్మించాలని భావిస్తున్న డ్రైపోర్టు నుంచి మచిలీపట్నం పోర్టు వరకు కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరుతోంది. ఈ రోడ్డు, రైలు మార్గాన్ని హై స్పీడ్ కారిడార్‌గా నిర్మించాలని కోరింది. అటు ఏపీ కూడా ఈ రోడ్డును మంజూరు చేయాలని ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఫలితంగా ఇటీవల ఏపీ వెళ్లిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రతిపాదిత మార్గం వివరాలను సమర్పించాలని సూచించారు. ఈ రహదారి నిర్మిస్తే పొరుగు రాష్ట్రాలకు వెళ్లేందుకు ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ఎగుమతులు, దిగుమతులకు కూడా ఉపయోగపడనుంది. హైదరాబాద్‌కు ఇప్పటికే ఔటర్ రింగు రోడ్డు ఉండగా, దీనికి కొంత దూరంలో రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), రీజినల్ రింగు రైలు రానున్నాయి. ఈ నేపథ్యంలో అమరావతి గ్రీన్‌ఫీల్డ్ కోసం ఓఆర్ఆర్ నుంచి ఎంట్రీ పాయింట్ ఇవ్వాలా లేక ఆర్ఆర్ఆర్ నుంచి ఇవ్వాలా అనేదానిపై సమాలోచనలు జరుగుతున్నాయి. ఒకవేళ ఆర్ఆర్ఆర్ నుంచి ఇవ్వాలనుకుంటే ఫ్యూచర్‌సిటీకి దగ్గర్లో ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. కానీ, ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌కు కేంద్రం పచ్చజెండా ఊపితే.. దాని ప్రకారం అమరావతి హైవేకు ఎంట్రీ పాయింట్ కూడా ఖరారవుతుందని అధికారవర్గాలు అంటున్నాయి. లేదంటే ప్రస్తుతమున్న ఓఆర్ఆర్ నుంచే ఫ్యూచర్‌సిటీకి దగ్గరగా ఉండేలా ఒకట్రెండు ఎంట్రీ పాయింట్లను గుర్తించాల్సి ఉంటుంది. ఉభయ రాష్ట్రాల పరిధిలో ఎంట్రీ పాయింట్లు తేలితేనే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ పనులు వేగవంతమవుతాయి.

విశాఖలో ప్రకృతి వైద్య కళాశాల

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటనలో వెల్లడించారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ ప్రకృతి వైద్య కళాశాలలో ప్రవేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. విశాఖ, కాకినాడలో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రులు సిద్ధమవుతున్నాయని చెప్పారు. విశాఖలోనే ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగశాల కూడా రాబోతోందన్నారు. కేంద్రం 2016-17లో నేచర్ క్యూర్ ఆస్పత్రి, రెండు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని, అప్పటి టీడీపీ ప్రభుత్వం చేసిన కృషిని.. ఆ తర్వాత వైసీపీ సర్కారు కొనసాగించకుండా బాధ్యతారహితంగా వ్యవహరించిందని మండిపడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చూపుతున్న చొరవతో కాకినాడ ఆస్పత్రికి రూ.7.17 కోట్లు, విశాఖలో ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రికి రూ.14.85 కోట్లు, ప్రకృతి వైద్య కళాశాలకు రూ.4.08 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. విశాఖలోని విమ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ప్రకృతి వైద్య కళాశాలలో 2026-27 నుంచి 'బ్యాచిలర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగా సైన్సెస్' కోర్సుల్లో తరగతులు ప్రారంభమవుతాయని, ఈ కోర్సుల్లో 50 సీట్ల భర్తీకి కేంద్రం ఆమోదం తెలుపుతుందని అన్నారు. ఈ కళాశాల పక్కనే రూ.14.85 కోట్ల వ్యయంతో 50 పడకలతో చేపట్టిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రి నిర్మాణ పనులు కూడా పూర్తయ్యే దశలో ఉన్నాయన్నారు.

ఆయుర్వేద ఫార్మసీ..

విశాఖ పరిధిలోని శొంఠ్యాం ప్రాంతంలో రూ.6 కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌లకు భవన నిర్మాణాలు పూర్తవుతున్నాయని, రూ.5 కోట్లతో పరికరాలు, యంత్రాల కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతోందని మంత్రి చెప్పారు. కాకినాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో 50 పడకలతో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు కూడా పూర్తయ్యాయన్నారు. ఇక్కడ ఆయుర్వేద, హోమియో, యునాని వైద్య సేవలు ప్రారంభించేందుకు వైద్య పరికరాలు, యంత్రాల కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. 3నెలల్లోగా ఈ ఆస్పత్రి సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నేషనల్ ఆయుష్ మిషన్ కింద కాకినాడ, ధర్మవరంలో ఆయుర్వేద వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్ర ఆయుష్ శాఖకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

బడులకు మళ్లీ కళ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ అనే విధానం అమల్లోకి తెచ్చింది. రెండుమూడు దశాబ్దాల కిందట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో ఉండేవారు. ప్రతి పాఠశాలలో కనీసం ముగ్గురు చొప్పున టీచర్లు పాఠాలు చెప్పేవారు. కాలక్రమంలో ప్రైవేటు పాఠశాలలు పెరగడంతో ప్రభుత్వ ప్రాథమిక విద్య అత్యంత దయనీయంగా మారింది. నలుగురైదుగురు పిల్లలతో నడుస్తున్న బడుల సంఖ్య వేలల్లోకి చేరింది. గత విద్యా సంవత్సరం వరకు 20 మంది విద్యార్థులు కూడా లేని పాఠశాలల సంఖ్య 13వేలుగా ఉంది. ఈ పరిస్థితిని చక్కదిద్దే లక్ష్యంతో కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూళ్లను ప్రవేశపెట్టారు. గతంలో ఉన్నట్టుగా తరగతికి ఒక టీచర్ విధానం తెచ్చారు. ప్రస్తుతం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఐదు తరగతులకు కలిపి ఒక్కరే టీచర్ బోధిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య 45 దాటిన పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చారు. రాష్ట్రవ్యాప్తంగా 9600 ప్రాథమిక పాఠశాలలు మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మారాయి. వాటిలో 45 నుంచి 59 వరకు విద్యార్థులుంటే నలుగురు టీచర్లను, 59 దాటితే ఐదుగురు టీచర్ల చొప్పున కేటాయించారు. ఆ పాఠశాలలకు హెచ్ఎం పోస్టు కూడా ఇచ్చారు.

జీవో 117 రద్దు

వైసీపీ ప్రభుత్వం జీవో 117ను తీసుకొచ్చి పాఠశాల విద్యను అస్తవ్యస్తం చేసింది. ఉపాధ్యాయులు ఈ జీవో మాకొద్దు అని రోడ్డెక్కే స్థాయిలో ఆ జీవో ప్రభుత్వ విద్యపై ప్రతికూల ప్రభావం చూపింది. టీచర్లకు బోధన సమయాన్ని అమాంతం పెంచేసి గుక్క తిప్పుకోకుండా చేశారు. 4250 ప్రాథమిక పాఠశాలల్లోని 3 నుంచి 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ఊరి బడిని దూరం చేశారు. ఫలితంగా మా బడి మాకు కావాలని తల్లిదండ్రులూ రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది. అప్పుడే తాము అధికారంలోకి వస్తే జీవో 117ను రద్దుచేస్తామని తెలుగుదేశం నేతలు హామీ ఇచ్చారు. హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం జీవో 117ను రద్దు చేసి ప్రత్యామ్నాయంగా జీవో 21ను తీసుకొచ్చింది. టీచర్ల బోధన సమయాన్ని వారానికి 32 పీరియడ్లకు తగ్గించింది. ఉన్నత పాఠశాలల్లో సెక్షన్‌కు విద్యార్థుల సంఖ్యను 53 నుంచి 49కు తగ్గించింది. ఫౌండేషనల్ పాఠశాలల్లో గతంలో 30 మంది విద్యార్థులు దాటితే రెండో టీచర్‌ను ఇచ్చేవారు. నూతన విధానంలో 20 మంది దాటితే రెండో టీచర్‌ను ఇస్తున్నారు.

తొమ్మిది రకాల పాఠశాలలు

గత ప్రభుత్వంలో ఆరు రకాల బడుల విధానం ఉండగా కూటమి ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల బడులుగా మార్చింది. తొమ్మిది రకాల బడుల విధానంపై తొలుత వ్యతిరేకత వచ్చింది. ఆ తర్వాత నూతన మోడల్ ప్రైమరీ స్కూళ్లు, పనిభారం తగ్గింపుతో వ్యతిరేకత కొంతమేర తగ్గింది. శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2), ఫౌండేషనల్ స్కూల్(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1, 2 తరగతులు), బేసిక్ ప్రైమరీ స్కూల్(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1-5 తరగతులు), మోడల్ ప్రైమరీ స్కూల్(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1-5 తరగతులు), ప్రాథమికోన్నత పాఠశాల(ప్రీప్రైమరీ 1, ప్రీప్రైమరీ 2, 1-8 తరగతులు), ఉన్నత పాఠశాల (6- 10 తరగతులు), ఉన్నత పాఠశాల (1- 10 తరగతులు), ఉన్నత పాఠశాల ప్లస్(6- 12 తరగతులు), ఉన్నత పాఠశాల ప్లస్(1- 12 తరగతులు) విధానం అమలు చేస్తున్నారు. 45 మంది విద్యార్థులు దాటిన పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా పరిగణించి ప్రతి తరగతికి ఒక టీచర్‌ను ఇచ్చారు. బేసిక్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్లు ఉంటారు.

పూర్తిస్థాయిలో టీచర్లు

చాలాకాలం నుంచి పాఠశాలల్లో టీచర్ పోస్టుల బ్లాకింగ్ విధానం అమల్లో ఉంది. అంటే ప్రతి పాఠశాలలో కనీసం ఒకట్రెండు పోస్టులు ఖాళీగా ఉంచుతారు. టీచర్ల కొరత కారణంగా ఈ విధానం అమలుచేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం చేసిన టీచర్ల బదిలీల్లో బ్లాకింగ్ విధానం తొలగించింది. దీంతో టీచర్లు పట్టణాలకు దగ్గరగా ఉన్న పాఠశాలలను ఎక్కువగా కోరుకుని అక్కడికి వెళ్లారు. దీంతో అక్కడ వంద శాతం టీచర్లు నిండారు. పూర్తి గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో కొరత పెరిగింది. ఇప్పుడు కొత్త టీచర్లతో ఆ పాఠశాలల్లో ఖాళీలన్నీ భర్తీ అవుతాయి. దీంతో దాదాపుగా అన్ని పాఠశాలల్లో నూరు శాతం టీచర్ల భర్తీ జరుగుతుంది. దీనివల్ల సబ్జెక్టు టీచర్ కొరత ఉండదు.

రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

డీఎస్సీ కాల్ లెటర్లలో జాప్యం

అమరావతి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం నుంచి చేపట్టనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. కాల్ లెటర్ల విడుదలలో ఏర్పడిన జాప్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం కాల్ లెటర్లు విడుదల చేసి సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టాలని తొలుత నిర్ణయించారు. కానీ, ఆదివారం అర్ధరాత్రి వరకు కాల్ లెటర్లు విడుదల కాలేదు. సోమవారం ఉదయం కాల్ లెటర్లు విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం నుంచి చేపట్టనున్నారు.

బార్.. బేర్!

లైసెన్స్ దరఖాస్తులకు స్పందన కరువు

- 840 బార్లకు వచ్చింది 30 మాత్రమే
- ఔత్సాహికుల కోసం 'ఎక్సైజ్' ఎదురుచూపులు
- రేపటితో ముగుస్తున్న గడువు

అమరావతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దరఖాస్తుల సమర్పణకు గడువు సమీపిస్తున్నా రాష్ట్ర నూతన బార్ విధానానికి స్పందన కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు లైసెన్స్‌లు ఇవ్వడానికి నోటిఫికేషన్ జారీచేస్తే.. ఈ వారం రోజుల్లో కేవలం 30 దరఖాస్తులే వచ్చాయి. దరఖాస్తులు సమర్పించేందుకు మంగళవారం చివరి రోజు. మరో రెండ్రోజులే గడువున్నా వ్యాపారుల్లో పెద్దగా స్పందన కనిపించకపోవడంతో ఎక్సైజ్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. కొత్త పాలసీ విఫలమవుతుందన్న ప్రచారం ఉధృతమైంది. ఆదివారం రాత్రి వరకు కృష్ణా జిల్లాలో 13, కర్నూలు-1, నంద్యాల-1, ఎన్టీఆర్-7, పల్నాడు-1, ప్రకాశం-3, తిరుపతి-1, విజయనగరం-1, కడప జిల్లాలో రెండు వచ్చాయి. వీటిలోనూ నాలుగు దరఖాస్తులు వచ్చిన బార్లు రెండే ఉన్నాయి. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ తీయరు. అంటే లాటరీ తీయదగిన స్థాయిలో దరఖాస్తులు అందింది కేవలం రెండు బార్లకు మాత్రమే. కాగా సుమారు వెయ్యి మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారు రూ.5 లక్షలు చెల్లించి తుది దరఖాస్తులు సమర్పిస్తారా అనేది అనుమానంగా మారింది. ఒకవేళ వారంతా దరఖాస్తులు సమర్పించినా 30 శాతం బార్లే లాటరీలోకి వస్తాయి. 840 బార్లకు లాటరీ తీయాలంటే మొత్తం 3,360 దరఖాస్తులు రావాలి. అది కూడా ప్రతి బార్‌కు నాలుగు చొప్పున దరఖాస్తులు అందాలి. ఒకవేళ ఏదైనా బార్‌కు నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వేస్తే మొత్తం దరఖాస్తుల సంఖ్య ఇంకా పెరగాలి. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే చివరికి సగం బార్లకైనా వస్తాయా అనే అనుమానం కలుగుతోంది. బార్లకు ఇచ్చే మద్యంపై అదనపు పన్ను, నాలుగు దరఖాస్తులు తప్పనిసరి అనే నిబంధనలను వ్యాపారులు వ్యతిరేకిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఎంత అనునయించినా ముందుకు రావడం లేదు. మరోవైపు.. ప్రతికూలంగా ఉన్న నిబంధనలను సవరిస్తారని వ్యాపారుల్లో ప్రచారం జరుగుతోంది. నాలుగు దరఖాస్తులు తప్పనిసరి నిబంధనను తొలగిస్తారని, అదనపు పన్ను మినహాయింపు వస్తుందని వారు ఎదురుచూస్తున్నారు. కానీ అధికారులు మాత్రం పాలసీలో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టంచేస్తున్నారు. ఈ మార్పులపై ప్రభుత్వం ఆలోచన కూడా చేయలేదు. దీంతో కొత్త పాలసీ నీరుకారిపోయే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.



బైక్ వాహనంపై కూలీలను పొలానికి తీసుకెళ్తున్న రైతు ఆడారి మోహన్

ఐడియా అదిరిందిగా..!

పొలానికి కూలీలను తీసుకెళ్లడానికి, పంట ఉత్పత్తులను ఇంటికి తీసుకుని రావడానికి ఓ రైతు కొత్తగా ఆలోచించాడు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం గౌరిపురానికి చెందిన రైతు ఆడారి మోహన్‌కు ఐదెకరాల పొలం ఉంది. గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ పొలంలో పని చేయడానికి 10 మంది కూలీలు అవసరం. వీరిని పొలానికి తీసుకెళ్లిన ప్రతిసారీ రూ.200 ఖర్చవుతోంది. ఈ ఖర్చును తగ్గించుకోడానికి మోహన్ కొత్తగా ఆలోచించారు. తన ఆలోచనను వర్క్‌షాపు నిర్వాహకుడికి చెప్పి.. తన బైక్‌కు చిన్న ట్రాలీలాంటిది చేయించుకున్నారు. ఇప్పుడు పావు లీటరు పెట్రోలుతో.. ఆటో కోసం ఎదురుచూసే పని లేకుండా కూలీలను పొలానికి తీసుకెళ్తున్నానని రైతు చెప్పారు. పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునేందుకూ ఈ ట్రాలీ ఉపయోగపడుతోందని, దీని తయారీకి రూ.15వేలు అయిందని తెలిపారు.

- ఎస్.కోట రూరల్, ఆంధ్రజ్యోతి

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.